భారతి

సాహిత్య మాసపత్రిక

ఆగస్టు 1982



వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు



భారతి

మాసపత్రిక



శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)



ఆగష్టు 1982

సంపుటము : 59 సంచిక : 8

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

ఆగస్టు 1982



మైలురాళ్ళు

డా. సి. నారాయణరెడ్డి

ఈ రోడ్డు
ఎన్నిసార్లు నన్ను విసిరేసిందో
తింపుగొట్టే కందకాల్లోకి.

ఎన్నిదున్నపోతుల
తోపిళ్లను తప్పుకొని
ఈగలా దూరిపోయానో?

ఎన్నిసార్లు తట్టుకున్నాయో
ఈ చెవుల పొరలు
నాటుమందు కొట్టేసిన
నానాజాతుల లారీల
హారన్‌మోతల బండబూతులను.

అప్పుడప్పుడు నా కాళ్ళు
ఉరుకుతుంటాయి
కదిలే కారులో కూచొని


కోడి అడ్డమొచ్చినా
కొంపమునిగినట్టు అరుస్తాయి.
ఎంతజాలి ఈ పిచ్చికాళ్లకు!

బుద్ధుణ్ని గాంధీనీ
పుక్కిట్లో పెట్టుకున్న కారుఅడుగులకు
చురుక్కున అంటుకుంటుంది
కెవ్వున అరిచే పసిపాపనెత్తురు.

కారు ఆగుతుంది
కాల్చే కన్నీరు సాగుతుంది.
ప్రవహించే కాలంలాంటి రోడ్డుకి
అడ్డుకటలా మైలురాళ్లు ?

కావు——

ప్రతిక్షణ పురోగతిని
ప్రశ్నించే ఆనవాళ్లు.



డా. ఎన్. ఎస్. రామచంద్రమూర్తి

డా॥ వై. గోపాలరెడ్డి


పల్లవ సింహవర్మ పాంటూరు తామ్ర శాసనము

సుమారు రెండేండ్లకు పూర్వము నెల్లూరుకు దగ్గరలో నున్న పాంటూరు గ్రామములో ఒక రైతు మట్టి త్రవ్వుచుండగా ఈ తామ్ర శాసనము లభ్యమైనట్లు తెలియుచున్నది. ఇందు ప్రకటించబడు ప్రతిబింబములు తప్ప దీనిని గూర్చిన వేరే సమాచారము తెలియదు. ఈ ప్రతిబింబములను గూడ మేము అతి కష్టముతో ఒక మిత్రుని ద్వారా పొందగలిగితిమి. ఈ శాసనమును ప్రకటించుటలో మాకు తోడ్పడిన శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి గారికి మా కృతజ్ఞతలు తెలుపుచుంటిమి. ఇందు ఎనిమిది రాగిరేకులు ఒక రాగి కడియములో దూర్చబడియున్నవి. కడియమునకు తాపటము చేయబడిన రాజముద్రిక శిథిలమై యున్నది.

శాసన లిపి

ఇందలి అక్షరములు క్రీ. శ. అయిదు, ఆరు శతాబ్దములలో తెలుగు దేశములో వాడుక యందున్న వేంగి లిపి అనబడుచున్న ప్రాచీన అక్షరములను పోలియున్నవి. ఈ పల్లవరాజుల ఓంగోడు (రెండవది)[1], పీకిర[2], మంగదూరు[3] తామ్రపట్టికలలోని అక్షరములతో పోల్చదగియున్నవి. అక్షరములపైన తలకట్లు పూర్తిగా రూపొందలేదు. ఆస్థానములో చుక్కలు మాత్రము అక్షరముల పై భాగమును అంటి గుర్తించబడెను. క, ర అక్షరముల క్రింది యెడమవైపు వంపులు కొద్ది యెత్తు మాత్రమే కలిగియున్నవి. "బ" అక్షరము నలువైపుల పూర్తిగా మూయబడెను. "శ" అక్షరములోని మధ్యగీత సగమే వ్రాయబడెను. అచ్చులలో అ, ఇ, ఎ, ఏ లు గలవు. హల్లులపైనుంచు దీర్ఘ "ఈ" గుడిలో దీర్ఘము గలను. "ఊ" కారము అక్షరము క్రింద కొమ్ములో అడ్డుగీతగను వ్రాయబడెను. రేకుల సంఖ్యను తెలుపుటకు 2, 3, 4, 5, 6 7, అంకెలు వరుసగా ఆయా రేకుల యెడమ పైపు మార్జినలో చూపబడెను. గుణింతములో రేఫ తెరు







వాత వచ్చు హల్లులకు ద్విత్వము సాధారణముగ కనుపించు చున్నది. అనుస్వారము సంధిలో ఆయా వర్గముయొక్క అనునాసికముతో కలిపి చూపబడెను. శాసనము సంస్కృత వచనములో రచింపబడెను. తుదిని వ్యాసగీత శ్లోకములు మూడు ఉదహరించ బడెను. లేఖక ప్రమాదములు లేవని చెప్పవచ్చును. మొదటి రేకు మొదటివైపునకు, ఎనిమిదవ రేకు రెండవ వైపునను విడిచి మిగిలినరేకులురెండు వైపుల ఒక్కొక్క వైపున అయిదేసి పంక్తుల పంతునను, ఎనిమిదవ రేకున నాలుగు పంక్తులు మాత్రమే వ్రాయబడి మొత్తము శాసనమంతయు 79 పంక్తులలో వ్రాయబడి యున్నది. రాజముద్రిక లభించుట లేదు కాని మిగిలిన శాసనాక్షరము లన్నియు చెడిపోకుండ భద్రముగనే యున్నవి.

శాసన విషయము

"జితం భగవతా, స్వస్తి" అను మంగళముతో శాసనము ప్రారంభమగుచున్నది. విజయ దశనపురము నుండి పల్లవ మహారాజు సింహవర్మ తన విజయరాజ్య ప్రథమ వర్షమున కొందరు వేదవిదులగు బ్రాహ్మణులకు ముణ్డ రాష్ట్రములో పొణ్ణారు అను గ్రామమును దాన మొసగినట్లు తెలుపుటకై యీ శాసన మొసగెను. ఇందు దాతయగు సింహవర్మ మహారాజు భారద్వాజ గోత్రుడు, బప్పభట్టారక పాద భక్తుడు, యథావిధిగ అనేక క్రతువులు ఆచరించి దేవేంద్రునితో సమానమైన పల్లవుల వంశములో జన్మించె ననియు, తన ప్రతాపముచేత సామన్త మణ్డలమును





తపింప జేసిన వాడనియు, వసుధాతలైక విజిగీషువనియు, భగవత్పాదాను ధ్యాతుడనియు కీర్రింపబడెను. ఇతని ముత్తాతయగు మహారాజ శ్రీ వీరవర్మ యథావిధిగ సేవించ బడిన దేవతా, బ్రాహ్మణ, గురు, వృద్ధ సమూహము గల వాడనియు, శక్తిత్రయ సంపన్నుడనియు, పృథివీతలైక వీరుడనియు కీర్తింప బడెను. సింహవర్మ తాతయగు మహారాజశ్రీ స్కందవర్మ అనేక సమరములు చేసి, అద్భుత ప్రతాపముగలవాడని పేరుపడ్డవాడనియు విద్యావృద్ధుడనియు, మహాదాతయనియు ప్రసిద్ధి గాంచెను, తండ్రి చంద్రాంశు శుభ్రయశస్సుగల వాడనియు, విద్యా వినీతాత్ముడనియు, యువరాజ విష్ణుగోపుడనియు చెప బడెను. ఈ ప్రశస్తి వాక్యముల తరువాత సింహవర్మ మహారాజు ముణ్డ రాష్ట్రములో జేరియున్న పాణ్బూర గ్రామమును కొందరు బ్రాహ్మణులకు దాన మొసగుచున్నట్లు ఆ గ్రామానికి సంబంధించిన వారికి (గ్రామేయకులకు), అధికారులుగా నియోగించబడియున్న సర్వాధ్యక్షుడైన వల్లభునకు శాసన సంచారకులకు ఆజ్ఞాపించును. ఆ బ్రాహ్మణుల పేర్లు గోత్రములతో పేర్కొనబడెను. ఈ పాణ్బూర గ్రామమును సర్వపరిహారములతో మన్నించి దేవభోగమైయున్న భూమిని విడిచి రాజు తన ఆయుర్బల విజయాభివృద్ధి కొరకై, తన విజయరాజ్య ప్రథమ సంవత్సరములో ఆషాఢ శుక్లపక్ష పంచమినాడు బ్రహ్మదేయముగా దాన మొసగినట్లాదేశించి







దానిని సర్వపరిహారములతో తామేగాక ఇతరులు కూడ మన్నించవలెనని ఆజ్ఞాపించును. దీని నతిక్రమించువారు శారీర దణ్డమునకు పాత్రులగుదురు. తరువాత "భూమి దానాత్పరందానం"; "బహుభిర్వ్వసుధా దత్తా"; "స్వదత్తాం పరదత్తాం వా" అను మూడు అర్ష శ్లోకములుదాహరించ బడెను తుదకు "బ్రాహ్మణ్యుడు, సకల మహీతలైక వీరుడు, వీరులకు అభిలషితార్థమును కూర్చువాడు, శివులకు (ప్రజలకు) గతియైన నరేంద్రుడు స్వయముగ శాసించగా నేమియను వానిచే బాగుగా వ్రాయబడెను" అని శాసనము ముగియుచున్నది. కనుక నేమియనువాడు ఈ శాసన లేఖకుడని తెలియుచున్నది.

విషయపరిశీలన


కృష్ణానదికి దక్షిణమునగల ఆంధ్రదేశమును ఇక్ష్వాకుల తరువాత భారద్వాజ గోత్రోద్భవులైన పల్లవరాజులు సుమారు మున్నూరేండ్లు పరిపాలించిరి. వారిలో మొదటి రాజులు క్రీస్తుశకము నాలుగవ శతాబ్దములో ప్రాకృత శాసనములిచ్చిరి. అట్టివి మయిదవోలు, హిరహదగల్లి, గుణపదేయ (బ్రిటిషు మ్యూజియంలోనున్న) చారుదేవి శాసనము తామ్ర పట్టికలపైనను, మంచి కల్లు శిలా శాసనము ఇప్పటికి లభించుచున్నవి. నాలుగవ శతాబ్ది కడపటి భాగమునుండి యీ రాజులు తమ శాసనములను సంస్కృతములో ఇచ్చుట ప్రారంభించిరి. అవి కూడ ఇప్పటికి





సుమారు పదునాలుగు శాసనములు దొరకెను. ఈ శాసన దాతయైన సింహవర్మ ఇచ్చినవి అన్ని సంస్కృత శాసనములే. ఇప్పటికి దీనితో అయిదు శాసనాలీరాజువి దొరికెను. అవి పీకిర, ఒంగోడు (రెండవది), మంగదూరు, వెలవట్టి, నాలుగు, ఇది యైదవది. ఈ శాసనములలో దాతయగు సింహవర్మ యొక్క తండ్రి యువమహారాజు విష్ణుగోప వర్మ అనియు, తాత "స్కందవర్మ అనియు, ముత్తాత వీర వర్మ అనియు పేర్కొన బడిరి. వారి ప్రశంసా వాక్యములు అన్నిటిలోను ఒకే విధముగ లేవు. కనుక ఆయారాజుల ప్రశస్తులకు విశేషమగు సార్థకతను చెప్పజాలము. అయినను కొన్ని ప్రశంసా వాక్యములు యథార్థములని తోచుచున్నవి. ఉదాహరణకు సింహవర్మ తాతయగు స్కందవర్మ విద్యావంతుడని యందును, అతని మొదటి ఒంగోడు శాసనములోను కీర్తింప బడెను. ఈ ఒంగోడు శాసనములో "సర్వ శాస్త్రార్థనిర్ణయ తత్త్వజ్ఞు"డని స్కందవర్మ చెప్పబడెను. అదియే పల్లవుల మొదటి సంస్కృత శాసనము. అట్టి విద్వాంసుడు గనుకనే ఆ శాసనమును సంస్కృతములో చక్కగా వ్రాసెనని అందలి రచన అనిపించును. మిగిలిన వారిలో మొదటివాడు వీరవర్మ రాజ్యమేలెనో లేదో నిశ్చయముగ తెలియను. రాజవంశములోని వారందరు మహారాజులుగనే చెప్పబడు చుందురు. కాని వారందరు రాజ్యమేలిరో లేదో చెప్ప వలెనన్న ఆధారాంతరములు లభించ





వలెను. ఈ వీరవర్మను గూర్చి మరియొక సందేహము కూడ కలదు. పల్లవుల వంశములోని రాజుల పట్టికను విపులముగా నొసగుచున్న రాజసింహుని వాయలూరు శాసనములో ఒక్క వీరవర్మ మాత్రము చాల మంది రాజుల తరువాత పేర్కొనబడు చున్నాడు.[5] అతడే యీ శాసనమందు దాతకు ముత్తాత యగునా అని సందేహము. శాసన దాత యొక్క తండ్రి యైన విష్ణుగోపుడు కొన్ని శాసనములలో "యువ మహారాజ విష్ణు గోపవర్మ" యని చెప్పబడెను. ఇతడు తన అన్నయగు వేరొక సింహవర్మయొక్క రాజ్య సంవత్సరములు లెక్కించుచు ఉరువపల్లి, నెడుంగరాయ తామ్ర శాసనము లొసగుటనుబట్టి ఆ సింహవర్మ క్రింద విష్ణుగోపుడు యువరాజుగ నుండెనని స్పష్టమగుచున్నది. అయినను తూర్పు చాళుక్య రాజులలో మంగి యువరాజు, యువరాజ బిరుదమును కలిగి యుండియే యిరువది నాలుగేండ్లకు పైగా (క్రీ. శ. 681-705) రాజ్యము చేసినట్లుగా, యువ మహారాజవిష్ణుగోపుడుకూడ తన అన్నయైన సింహవర్మ తరువాత రాజ్యము చేసి యుండుననియు, అందువలననే యితని కొడుకైన ఈ శాసనదాతయగు సింహవర్మ రాజ్యాధిపతి యయ్యె ననియు కొందరు చెప్పుదురు. ఈ శాసనములో విశేషించి యితడు యువమహారాజని కాక యువరాజని మాత్రమే చెప్పబడెను. కనుక ఈ విష్ణుగోపుడు రాజ్యమేలెనో లేదో నిర్ణయించుటకు ఇతనిని.





స్వతంత్ర రాజుగ చెప్పు ఆధారాంతరము లభించ వలెను. అదియుగాక, పెద తండ్రియైన సింహవర్మకు స్కంద వర్మయను కొడుకు ఉన్నట్లును, అతను రాజ్యాధికారియై రాజ్యము చేయుచున్నట్లును పశ్చిమగాంగ రాజుల పెను గొండ తామ్ర శాసనము ఒట్టి తెలియుచున్నది.7 దానిలో ఒక పల్లవ సింహవర్మ పశ్చిమ గాంగవంశపు అయ్యవర్మను గాంగ సింహాసనముపై ప్రతిష్ఠించగా, ఆ సింహవర్మ కొడుకగు పల్లవ స్కందవర్మ గాంగ అయ్యవర్మ కొడుకైన రెండవ మాధవవర్మను గాంగ సింహాసనముపై నధిష్టింపజేసినట్లు చెప్పబడెను. కనుక యువరాజు విష్ణుగోపుని అన్నయగు సింహవర్మయు అతని కొడుకును రాజ్యముచేసినట్లు తెలియుచుండగా విష్ణుగోపుని కొడుకైన శాసనదాతయగు సింహవర్మ శాసనములిచ్చునట్టి స్వతంత్ర రాజెట్లాయెను సందేహము కలుగుచున్నది ఇతడేకాక ఇతని పుత్రుడైన విజయవిష్ణుగోపవర్మకూడ చూరశాసనము (8) నిచ్చెను. కనుక ఈ శాఖవారుకూడ కొంతరాజ్యములో స్వతంత్రాధికారము కలిగియుండినట్లు చెప్పవీలగుచున్నది. ఈ రాజవంశములమధ్య అధికారములో పరస్పర సంబంధ మెట్టిదో ప్రస్తుతము నిర్ణయించి చెప్పజాలము. ఈ శాసన దాతయగు సింహవర్మతండ్రి యువరాజు విష్ణుగోపుడని




మాత్రమే చెప్పబడినందువలన అతడు తన అన్నయగు సింహవర్మ క్రింద యువరాజు మాత్రమే కొంతకాలమేజీవించి సింహాసనము నధిష్టించకయే చనిపోయి యుండునని తోచుచున్నది. అన్నయగు సింహవర్మ తన 41 వ రాజ్య సంవత్సరములో ఇచ్చిన సక్రెపట్న తామ్రపట్టికల శాసనము ఇటీవల బయల్పడెను (9) ఇది మైసూరుమండలములో చిక్కమగులూరు జిల్లాలో సక్రెపట్నంలో దొరకెను. దానమొసగిన వల్విల్లి అగ్రహారము సేన్ద్రకరాజ్యములో నిధిగా చెప్పబడుట వలన ఈ పల్లవుల రాజ్యము మైసూరుప్రాంతముల గూడ వ్యాపించెనని తెలియుచున్నది! ఆ సింహవర్మ నలుబదేండ్లకుపైగా రాజ్యపాలన చేసెనుగనుక, యువరాజును, తమ్ముడును అగు విష్ణుగోపుడు రాజుగ పట్టాభిషిక్తుడుగాకయే చనిపోయెననుకొనుట అనుచితము కానేరదు.

శాసనకాలము

ఈ శాసనము ఆసింహవర్మయొక్క తమ్ముని కొడుకగు మరొక సింహవర్మ తన విజయరాజ్యప్రథమసంవత్సరములో ఇచ్చినట్లు చెప్పబడెను. కాని ఆ మొదటిసంవత్సరమును నిర్ణయించి చెప్పుటకష్టము. ఇతడు తనతండ్రియైన విష్ణుగోపుడు చనిపోయిన పిదప అధికారమునకు వచ్చెనో లేక పెదతండ్రి అయిన సింహవర్మ తరువాత అధికారమునకువచ్చెనో లేక ఆసింహవర్మ కొడుకైన స్కందవర్మ పరిపాలన తరువాత అధికారము చేపట్టెనో చెప్పజాలము లిపిని బట్టియు, ఇతర చరిత్రాంశములను బట్టియు ఈ శాసనము క్రీ.శ. అయిదు-ఆరు శతాబ్దుల మధ్యకాలమగునని సుమారుగ చెప్పవచ్చును.

ఈసింహవర్మ ఇచ్చిన యితర శాసనములలో ఒంగోడు శాసనము (రెండవది) నాలుగవరాజ్య సంవత్సరములోను, పీకిర శాసనము ఐదవరాజ్య సంవత్సరములోను, మంగదూరు శాసనము ఎనిమిదవరాజ్య సంవత్సరములోను, విళవట్టి శాసనము పదవరాజ్య సంవత్సరములోను ఇచ్చెను. ఇంతవరకులభించిన ఈ శాసనములనుబట్టి యితడు కనీసము పదిసంవత్సరములైనను రాజ్యమేలినట్లు తెలియుచున్నది. ప్రస్తుతమైయున్న పొణ్ణూర శాసనము, పీకిరశాసనము విజయదశనపురమునుండి యొసగబడినవి. దానమొసగిన ఆరెండు గ్రామములు ముణ్డరాష్ట్రములో నున్నట్లు చెప్పబడెను. ప్రస్తుతము నెల్లూరునగరమునకు ఉత్తరమున గల దేశవిభాగమును పూర్వము ముండరాష్ట్రమని వ్యవహరించువారు. దశనపురమును ఇప్పటి ప్రకాశంజిల్లాలోనున్న దర్శి గ్రామముగా కొందరు చెప్పుచున్నారు. అచటనే వేరొక శాసనములోని ఒకరేకుమాత్రము దొరకెను. అదికూడ దశనపురమునుండియే యొసగబడెను. కనుక దశనపురము దర్శియే కాదగునను వాదము సహేతుకముగకనబడుచున్నది. అయినను ఈ విషయములో కొందరు మఱియొకవిధమగు అభిప్రాయమును వెలిబుచ్చుచుండిరి "దశన" అను సంస్కృతపదమునకు "పల్లు" అనునది దేశీ పదముఅనియు సముద్రగుప్తుని అలహాబాదు శాసనములో ఉగ్రసేనుడి రాజ



ధానిగా చెప్పబడిన "వల్లక్కడ" నగరము దశనపురముగా దగుననియు చెప్పుదురు. ఆనగరము ఇంతవరకు సరిగా గుర్తించబడలేదు.

దాన ప్రతిగ్రహీతలలో 26 గోత్రములకుచెందిన 170 మంది వేదవిదులు పేర్కొనబడిరి. ప్రాచీన పల్లవులలోనేమి, ఇతర శాలంకాయన, విష్ణుకుండి వంశము వారిలోనేమి యిందరు వేదాధ్యయనపరులకు గ్రామదానమొసగినవారు తెలియదు. త్రిలోచనపల్లవుడనేరాజు శ్రీశైలమునకు ఆగ్నేయముగ కొన్నివందల అగ్రహారములు స్థాపించినట్లు మధ్యయుగమునాటి మన తెలుగుదేశ శాసనములు, స్థానిక చరిత్రలు తెలుపుచున్నవి. కాని ఆ త్రిలోచనపల్లవుడెవరో నిశ్చయముగ తెలియుటలేదు. ఈ ప్రాచీనపల్లవులందరు వైదికమతోద్ధరణకై పాటుపడిరి. బౌద్ధమతముయొక్కబహుళ వ్యాప్తిని - వైదిక, పౌరాణికవ్యాప్తిద్వారా కొంతఅరికట్టిరి. వీరికాలమునుండి ఆంధ్రదేశములో పౌరాణిక దేవతారాధన పునరుద్ధరింపపడెను.

శాసనపాఠము

మొదటి రేకు

1. (ఓం) జితమ్భగవతా (1*) స్వస్తి [1*] విజయ దసనపురా ద్యథావ దభ్యర్చ్చి తదేకతా
2. బ్రాహ్మణ గురు వృద్ధస్య శక్తిత్రయ వృద్ధస్య మహాత్మన[ః స్వభు] జ
3. ద్రవిణార్జ్జితోదార భోగభుజః పృథివీ తలైక వీరస్య
4. మహారాజశ్రీ వీరవర్మ్మణః ప్రపౌత్రః సమరశత కరణ
5. సమధి గతాద్భుత ప్రతాపస్య విద్యావృద్ధ స్వానన్త కల్ప్యప్రదాయినః

రెండవ రేకు, మొదటి వైపు

6. అనన్త కల్పస్య గుణమహతో మహారాజశ్రీ స్కన్ద వర్మ్మణః
7. పౌత్రో న్యదీయై ర్య్యశోభి రగహితైః శ్చన్ద్రాంశునికర శుభ్రై ర్య్య
8. శోభి ర్వ్యాప్తలోకస్య విద్యావినీతాత్మనో [మ]హాను-
9. భావస్య యువరాజశ్రీ విష్ణుగోపస్యపుత్రః త త్ప్రసామన్త
10. మణ్డలే న్నా ప్రతిమాభి స్వప్రజ్ఞేస్తాభి శ్చేష్టాభి రహరహ రే ధమానే న

రెండవ వైపు

11. మహతా ప్రతాపేన వ్యాప్తలోకో లోకోపచయ ప్రవృత్తసర్వ-
12. రమ్భ స్సమ [గ్రప] సుధా తలైక విజిగీషు ర్బ్భ గవత్పాదానుద్ధ్యా (ధ్యా) తో బప్ప
13. భట్టారక పాదభక్తః పరమభాగవతో భారద్వాజః పరమో-
14. దాత్తాన్వయా నా[ం] స్వభుజ ద్రవిణార్జ్జిత ప్రథిత ప్రతిష్ఠితా ద్భుత
15 యశసామ్ యథావదాహృతానేక క్రతూనాం శత్రక్రతు కల్పానామ్

మూడవరేకు, మొదటివైపు

16. శ్రీ వల్లభానా మ్పల్లవానా న్ధర్మ్మ మహారాజ శ్రీ సింహ వర్మ్మ మణ్ణ
17. రాష్ట్రే పాణ్డార గ్రామే గ్రామేయకా న్రతానేకృతాంశ్చ సర్వా ధ్యక్ష
18. వల్లభ శాసన సఞ్చారిణ శ్చాజ్ఞాపయతి ఔదమే-
19. యిభ్యో గ్నిదత్త శిఖధత్తాగ్ని దత్త విష్ణుదత్తా ద్వివేద భత్ప[రి] దత్తేభ్యః
20, భారద్వాజేభ్యశ్చ వీరహస్తి గోలశర్మ్మ కొణ్డశర్మ్మ యజ్ఞశర్మ్మ

మూడవరేకు, రెండవవైపు

21. మాతృశర్మ్మ వీథిశర్మ్మ వీరశర్మ్మ దత్తశర్మ్మ శర్వ శర్మ్మ దామనన్ది ద్వి [వేదాప]-
22. లశర్మ్మ దత్తశర్మ్మ కాసిశర్మ్మ రుద్రశర్మ్మ దేవశ్మ(శ)ర్మ్మ దత్తశర్మ్మ ద్వివేదనన్ద
23. శర్మ్మ ద్వివేతరాతశర్మ్మ పితృశర్మ్మ దేవశర్మ్మ శివశర్మ్మ దేవశర్మ్మ

24. బద్దశమ్మ౯ కుమారశమ్మా౯ గ్నిశమ్మ౯ శివ శమ్మ[illegible] భ్యః కుణ్డినేభ్యః ద్వివేద

25. స్కన్దశమ్మ౯ ద్రోణశమ్మ (చ్మా)౯ య్యా౯ భూతి రుద్రశమ్మ౯ భత్రు౯ శమ్మ౯ తూక్క౯శమ్మ౯

నాలుగవరేకు, మొదటివైపు

26 ద్వివేద దామశమ్మ౯ నన్దిశమ్మ౯ శివశమ్మ౯ వీధి శమ్మ౯ గోవశమ్మ౯ కావటక

27. శమ్మ౯ శబర శమ్మ౯ భత్రు౯ శమ్మ౯భ్యః హారితే భ్యశ్చ ద్రోణశమ్మ౯ ద్వివేద

28. రుద్రశమ్మ౯ భవదేవ[శివ]త్రాత శర్వ౯ త్రాతాగ్ని శమ్మ౯ ద్వివేదదా

29. మశమ్మ౯ మాతృశమ్మ౯ కుమారశమ్మ౯ రుద్ర శమ్మ౯ దేవశమ్మ౯ ద్వివేద యజ్ఞ

30. శమ్మ౯ జ్యోతిశ్శివ ద్వివేద చె[న్ది] శమ్మ౯ ద్వివేద వీధి శమ్మ౯ద్రోణశమ్మ౯భ్యః

నాలుగవరేకు, రెండవవైపు

31. ద్వివేద ధ్రువద్రోణ దేవశమ్మ౯ ద్వివేద శివశమ్మ౯ భూతి శమ్మ౯

32. ద్వివేద కణ్ణ౯ శమ్మ౯ దామ శమ్మ౯ కణ్ణ[illegible] శమ్మ[illegible] దామశమ్మ[illegible] స్కన్ద శమ్మ[illegible] భవదామ

33. దామశమ్మ[illegible] 13 ద్వివేద విన్ద్య శమ్మ[illegible] భత్రు[illegible] శమ్మ[illegible] ద్వివేదమాష శమ్మ[illegible]

34. విన్ద్యశమ్మ[illegible] తూక్క[illegible] శమ్మ[illegible] ద్వివేద కీర్తి[illegible] శమ్మ[illegible]భ్యః కుశికేభ్యశ్చ

35. ద్వివేద దామశమ్మ[illegible] కొట్టిశమ్మ[illegible] మహాసేన స్వామి శమ్మ[illegible] చెన్దశమ్మ[illegible] దేవశమ్మ[illegible]

అయిదవరేకు, మొదటివైపు

36. ద్వివేదద్రోణశమ్మ[illegible] ద్వివేద కుమార శమ[illegible] గోవ శమ్మ[illegible] హస్తిశమ్మ[illegible] దుర్గ[illegible] శమ్మ[illegible]

37. రుద్రదామ దామశమ్మ[illegible] రుద్రశమ్మ[illegible]భ్యః గోతమే భ్యశ్చ శివశమ్మ[illegible] ద్వివేద శివ-

38. త్రాత ద్వివేద షష్ఠిశమ్మ[illegible] నన్దిశమ్మ[illegible] భూతిశమ్మ[illegible] సమ్మశమ్మ[illegible]భ్యః

39. మైత్రేయా (భ్యాంచ) ద్వివేద మిత్రశమ్మ[illegible] యజ్ఞశమ్మ[illegible] భ్యామ్ మాణ్డవ్యాయ చద్వివే-

40. ద దామశమ్మ[illegible]ణే కుత్సేభ్యశ్చ కొట్టిశమ్మ[illegible] ద్వివేద బప్ప శమ్మ[illegible] శర్వ[illegible] శమ్మ[illegible]

అయిదవరేకు, రెండవవైపు

41. కాశ్యపేభ్యశ్చ ద్వివేద మాతృశమ[illegible] ద్వివేద భూతి శమ్మ[illegible] హస్తిశమ్మ[illegible] స్కన్ద

42. శమ్మ[illegible][గణ] శమ్మ[illegible] నాగశమ్మ[illegible] గణశమ్మ[illegible] కోరజ్ఞ నన్ది శమ్మ[illegible] ద్వివేద దేశ శమ్మ[illegible]

43. మాతృశమ్మ[illegible] దేవశమ్మ[illegible] దామశమ్మ[illegible] భవశమ్మ[illegible] గోలశమ్మ[illegible] శివనాగ-

44. యజ్ఞశమ్మ[illegible] ద్వివేద తత్రశమ్మ[illegible]భ్యః అగ్నివేశేభ్యశ్చ భర్తృశమ్మ[illegible] రుద్ర

45. శమ్మ[illegible] ద్వివేద స్కన్దభటముక్క శమ్మ[illegible]భ్యః అత్రి భ్యశ్చ రుద్రశమ్మ[illegible] ద్రోణశమ్మ[illegible]

ఆరవరేకు, మొదటివైపు

46. వి[illegible]శమ్మ[illegible] ద్రోణశమ్మ[illegible]భ్యః వత్సేభ్యశ్చ నన్దిశమ్మ[illegible] దామ శమ్మ[illegible] కాటశమ్మ[illegible] ద్వి-

47. వేద తూక్క[illegible] శమ్మ[illegible] భత్రు[illegible]శమ్మ[illegible] దేవశమ్మా[illegible] య్యా[illegible] శమ్మా[illegible] యజ్ఞశమ[illegible] భవశమ్మ[illegible] శివశమ్మ[illegible]

48. సెన్ద శమ్మ[illegible] మాతృశమ్మ[illegible] భత్రు[illegible] శమ్మ[illegible] ద్రోణ వసు సీహ యజ్ఞశమ్మ[illegible] భ్యః

49. ఐతి శయనాయ చ యజ్ఞశమ్మ[illegible]ణే వైష్ణువృద్ధాయచ ద్వివేద భవత్రాతా-

50. య గర్గ[illegible] భ్యా వసుశమ్మ[illegible] రుద్రశమ్మ[illegible] భవశమ్మ[illegible] భ్యః మాఠరాభ్యాం [స్థాణు- -]

ఆరవరేకు, రెండవవైపు

51. భత్రు[illegible]శమ్మ[illegible]భ్యః (భ్యాం) పరాశరేభ్యశ్చ నన్ని శమ్మ[illegible] ద్వివేద కొ[illegible]శమ్మ[illegible] యజ్ఞ

52. శర్మ■ కన్దశర్మ■ ద్వివేద కాటిశర్మ■భ్యః శాలా వత్యాయచ ద్వివేద

53. శివశర్మ■దే శణ్డిలేభ్యశ్చ ద్రోణభూతి శివభూతి ద్వివేద

54. కుమార శర్మ■ ద్వివేద భవదేవ శఙ్కర శర్మ■ ద్రోణ శర్మ■ ధ్రువశర్మ■ ద్వివే-

55. ద దామశర్మ■భ్యః ముద్గలేభ్యశ్చ స్వామిశర్మా■గ్ని దామ రుద్రవిష్ణు

ఏడవరేకు, మొదటివైపు

56. హస్తిశర్మ■భ్యాం (భ్యః) సాఙ్కృత్యాయచ రుద్ర శర్మ■ [దే] లోహిత్యాయచ మహా

57. సేనాయు ధాధీతరేభ్యశ్చ ధ్రువశర్మ■ రుద్రశర్మ■ బ్రహ్మరాతేభ్యః కాప్యాభ్యాం

58. భత్రు■ శర్మ■ ద్వివేద దేవశర్మ■ భ్యామ్ భార్గ■ వాయుచ రుద్ర శర్మ■దే

59 ఇమ మ్మాణ్డూర గ్రామం సర్వ■ పరిహారోపేత ద్దేవభోగ హలవజ్జ■ మస్మ-

60. దాయుబ్బ■ల విజయాభివృద్ధయే సమేధమాన విజయ రాజ్య ప్రథమ

ఏడవరేకు, రెండవవైపు

61. సంవ్వత్సరాషాఢ శుక్లపక్ష పఞ్చమ్యా మ్ముహ్మదేయా కృత్య న్నమ్ముదామ తద

62. యుష్మా■ము సర్వ■ పరిహారై [ః] పరిహర్త్త■వ్యః పరి హారయితవ్యశ్చ యశ్చేద మస్మ

63. [ద్చా] సన వశిక్రామే త్సపాపః శారీరన్దణ్డ మర్హ త్యపిచా తాషా■[ః]

64. [శ్లో] కా చ(భ) వన్త (న్తి) [:*] భూమ (మి) దానాత్పర న్దార న్నభూత న్న భవిష్యతి [1] తస్యైవహరణాత్

65. పావ న్నభూత న్నభవిష్యతి [11*] బహుభిర్వ్వ■ సుధాదత్తా బహుభిశ్చాను పాలితా [1*]

ఎనిమిదవ రేకు

66. యస్య యస్య యదా భూమి స్తస్య తస్య తదా ఫలమ్ [11*2]

స్వ ద■ మ్పర దత్తా మ్వా (త్తాంవా)యోహ.

67. రే తవసున్ధరామ్ [1*] గవాంశత సహస్రస్య హన్తుః పిబతి కిల్బిషమ్ [11*3] బ్రహ్మణ్యస్స-

68. కల మహీ కాలైక వీరో వీరాణామభిలషితేన సమ్ప్రి యోక్తా [1*]

69. భూతానాజ్ఞప్తి రశిష త్స్వయన్నరేన్ద్రస్స' త్రీప్త్యా లఘులిఖితశ్చ నేమినామ్నా [11*4]

సూచి

1. ఎపి. ఇండికా. 15, పుటలు 250-
2. ఎపి. ఇండికా. 8, పుటలు 159-
3. ఇం. ఎంటెక్వరి 5, పుటలు 154-
4. మయిదవోలు-ఎపి. ఇం. 6, పు. 84-; హిరహడగల్లి ఎపి. ఇం.1, పు.2-; చారుదేవిశాసనం. ఎపి.ఇం-8,14 –
5. ఎపి ఇం. 8, పుటలు 45-
6. ఇం ఎంటిక్వరి 5, పు. 50-; భారతి 18, పుట,628
7. ఎపి. ఇం. 14, పు. 31
8. ఎపి. ఇం. 21, పు. 137
9. ఎపి ఇం. 38, పు 91
10. ఎపి ఇం. 1, పు. 397
11. మాకు లభించిన ప్రతిరూపములనుండి
12. 32వ పంక్తిలో కణ్డశర్మ■ దామశర్మ■లు పొరపాటున తిరిగి వ్రాయబడినట్లుతోచును.
13. 33వ పంక్తిలో "భామ" అనునదికూడ తిరిగి వ్రాయబడి నట్లుతోచును; అట్లే 27వ పంక్తిలోకూడ

[■ అక్షరం లోపించడం వలన ■ పెట్టవలసివచ్చినది!]

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

మృత్యుహేల

అప్పుడే పోస్టుమాన్ వచ్చి ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. అది వుత్తరంగాదు న్యూట్రాన్ బాంబు! గుంటూరు నుంచి రమణ వ్రాశాడు. చిన్ననాటి ప్రాణమిత్రుడు ప్రకాశరావు పదిహేనురోజుల క్రితం పోయాడని ఆవుత్తరంలోని సారాంశం. ప్రకాశరావుకి నిండా పాతికేళ్ళులేవు. ఏ దురలవాటూలేదు. ఆరోగ్యంగా హుషారుగా వుండేవాడు. అటువంటి ప్రకాశరావుకి గుండెజబ్బు వచ్చిందట! ఒకవారంలోనే రెండుసార్లు గుండెపోటువచ్చి, అయిపోయాడట, ప్రకాశరావు!!

కాంతారావు నాలుగునిముషాలు మౌనంగా వుండిపోయాడు. మనసుపొరలలో అగ్నిపర్వతాలు పగిలాయి. గుండెల్లో తుఫాను చెలరేగింది. అప్రయత్నంగానే కన్నులు తడి నింపుకున్నాయి. కళ్ళుతుడుచుకుని మవునంగానే రోధించాడు. బాధపడ్డాడు.

ఆ రోదనని అణచివుంచటానికి,ఆతుఫానునుపారద్రోలటానికి, ఒక్కటే మార్గం. కలమూ, కాగితాలూ. "ప్రకాశరావు ఆత్మశాంతి" కోసంనాలుగునిముషాలు మౌనం పాటించి,కాగితాలూ, కలం చేతబట్టాడు కాంతారావు. చరచర రాసిపారవేశాడు. చకచక కలం గుర్రంవలె పరుగులుతీసింది. చేతులు నొప్పిపెట్టాయి. మెడడు అలసటవచ్చి రొప్పింది. నరాలు తీవ్రంగా మూల్గాయి అయినా కాంతారావుకలంఆగలేదు సాగిపోయింది. ఇక్కడ కొన్నికోట్ల సంవత్సరాల నుంచి సూర్యుడు చండప్రచండంగా వెలుగుతూవున్నాడు. ఆవెలుగులో శక్తివుంది. ఆశక్తివలన సముద్రాలలోని నీరు ఆవిరయి మేఘాల దప్పిని తీరుస్తాయి. మేఘాలు వర్షించి భూమిని తడుపుతాయి. ఆ తడికీ,వేడికీ భూమిమీద అపారవృక్షజాతులు మొలకెత్తి పెరుగుతాయి. ఆకులు చిగురెత్తీ, కొమ్మలుసాగి పూలూ పళ్ళూ వస్తాయి. ఈ మొక్కలు జీవరాశికి చల్లని నీడనూ అహారాన్ని అందిస్తాయి- చివరకి ఈ జీవుల దవుష్ట్యానికి బలయిపోయి నశిస్తాయి.నశించకముందు బీజాల్ని అవి వదల్తాయి. అందువలన మొక్కలు మరలాపుట్టి,పెరుగుతాయి. నశిస్తాయి: పుడతాయి. పెరుగుతాయి. నశిస్తాయి. మరలా.... మొక్కలమీద ఆధారపడి బ్రతికే ఈ జీవులు రకరకాలు. కొన్ని దుర్భరమయినవి. కొన్ని బలవంతమయినవి బలంగల జీవులు బలంతక్కువయిన జీవుల్ని చంపితింటాయి. అధికారాన్ని చలాయిస్తాయి. ఘర్షణ తప్పదు. పోరాటం వుంటుంది. ఈ జీవనపోరాటంలో బలంగలజీవులు నిలద్రొక్కుకుంటాయి. బలంలేనివి బలి అయిపోతాయి. ఈ జీవుల్లో మరలా బుద్ధిగల జీవులూ, బుద్ధిలేనిజీవులూ అనివున్నాయి. తనకుగల బుద్ధిబలంవల్లన, మనిషి, అనంతమయినప్రకృతినీ ప్రపంచంలోని సకల జీవరాశినీ తన అదుపులోనికి తెచ్చుకొనటానికి నిరంతరం ప్రయత్నిస్తూనేవున్నాడు - అంటుంది విజ్ఞానశాస్త్రం. విజ్ఞానశాస్త్రం ఎన్నో వాస్తవాల్ని తెలుపుతోంది. తనచుట్టూ తానుతిరుగుతూ, సూర్యునిచుట్టూకూడా నిర్ణయింపబడిన దూరంలో, ఈభూమి పరిభ్రమించటము వలన జీవుల వునికికీ మనుగడకూ తగిన ఉష్ణోగ్రతాస్థితిగతులూ, వేడీ వెలుగులూ అంది వృక్షతతులూ, జీవరాసులూ మనుగడ సాగించగలుగుతున్నాయనీ విజ్ఞానశాస్త్రమే చెబుతుంది. ఈ విజ్ఞానశాస్త్రాన్ని మధించి, సృష్టిరహస్యాన్ని ఛేదించి ప్రపంచానికీ సర్వాధికారి ఆయిన - ఈ మనిషి ఒక విచిత్రమయిన రెండుకాళ్ళ జంతువు. మనిషి సంఘజీవి అయ్యాక, ఆసంఘానికి అవసరమయిన కొన్ని పద్ధతుల్ని ఏర్పరచుకున్నాడు. ఈ పద్ధతులు కాలానుగుణంగా మారక తప్పదు. ఆమార్పు సంఘర్షణని అనివార్యం చేస్తుంది. బలవంతుడూ, బలహీనుడూ, వున్నవాడూ, లేనివాడూ, అగ్రవర్ణంవాడూ, అధమ వర్ణంవాడూ, సంపన్నరాజ్యాలూ, పేద దేశాలూ, ఎర్రతోలువాళ్ళూ, నల్లతోలువాళ్ళూ - ఇలాగ ప్రపంచం రకరకాలుగా విభిన్నమయిన వర్గాలుగా అయి, ప్రాబల్యంకోసం నిరంతరం సంఘర్షణకు తలపడటం జరుగుతూవుంది. ఆ విధంగా ప్రపంచ చరిత్ర రచనసాగుతూ వుంది. సామూహిక న్యాయవిశేషాల్ని అలాఘించి, వైయ

_క్తిక విషయానికి వస్తే, ఈ మనిషి ఎంత చిత్రమయినవాడు అన్పిస్తుంది! వాఙ్మయం, చరిత్రా తరతరాలుగా ఘోషి స్తూనేవుంది, మనిషి హుళక్కి అని.

అయినా,-నేనూ, నాదీ అన్న భ్రమలోపడి, అరిషడ్వర్గాలకు తలొగ్గి, స్వార్థంతో వెఱ్ఱివేషాలు వేస్తున్నాడు,మనిషి వచ్చినప్పుడు తెచ్చింది ఏమీలేదు. పోవునప్పుడుకూడా తీసుకొని వెళ్ళేదికూడా ఏమీవుండదు. మట్టిలోనుంచి వచ్చిన శరీరం చివరికి మట్టిలోనే అయిక్యమయిపోక తప్పదు. కాల్చినా, పాతిపెట్టినసూ. అయినా-క్షణ భంగురమయిన ఈ జీవితకాలంలో, అహం పెచ్చరిల్లగా, ఈ వెఱ్ఱిమనిషి వేసే వేషాలు కోకొల్లలు. ఆ కారణం వలననే - ఆనందం, విషాదం నవ్వు, ఏడ్పు, సుఖం, దుఃఖం మొదలయిన చిత్ర భ్రమలకు లోనయి విపరీతావస్థలకు గురి అవుతున్నాడు ఈ వెఱ్ఱి మానవుడు.

ఓ మనిషీ! నువ్వెవరవు? ఎక్కడినుంచి వచ్చావు? ఎక్కడికి నీ ప్రయాణం? ఈ జీవితానికి అర్థం ఏమిటి? ఏమి సాధించాలని ఈ ప్రయాస? నేనూ, నా భార్యా, నా పిల్లలూ నా సంసారం, నా రాష్ట్రం, నా దేశం, నా ప్రపంచం!ఇవన్నీ నీవా? నీలోవున్న స్వార్థానివా? రోజురోజుకీ పుచ్చిపోతూ ఛిద్ర దశకు పయనిస్తూన్న ఈ శరీరం నీదా? ఎంతసేపూ? నెలరోజులనాడు కనపడి, జలసంతాన ఇంటికి తీసుకువెళ్ళి, ప్రాణంపెట్టి, సత్కారం చేసిపంపిన ప్రియమిత్రుడు ప్రకాశరావు ఇవాళలేడు! ఏడీ? ఎక్కడకు వెళ్ళేడూ? ప్రకాశరావూ, అతనితో స్నేహం, ప్రేమా, ఇవన్నీ ఇక మిగిలిపోయిన జ్ఞాపకాలేగదా! మృత్యువు విశ్వవ్యాప్తమై పొంచిచూస్తూ వున్నదిరా. దానికోరలకు ఏక్షణాన ఎవరు బలిఅవుతారో తెలయదు. అందువలన క్షణం క్షణం రిస్కుకి లోనవుతూ, నడుస్తూవున్న ఈ గాజుబ్రతుకునుగూర్చి అంత ప్రాముఖ్యతయేం ఎందుకురా కాంతిగా?కాంతారావుగారూ?—

అక్కడ వరకు వ్రాసి ఆగాడు కాంతారావు కలం ముందుకు సాగలేదు.

కాంతిమతి రాసిన పుత్తరం జ్ఞాపకానికివచ్చింది. కాంతిమతి పుట్టింటికివెళ్ళి నెలరోజులయింది. ఈ నెలరోజులూ కాంతారావు జీవితం ప్రశాంతంగా సాగింది. పత్రికలవాళ్ళకి రెండు కథలూ, మూడువ్యాసాలూ రాసిపంపాడు. కాంతిమతి నోరు పెద్దది. పెద్దదికూడా అందువలన పది సంవత్సరాలు సంసారంచేసి, ఇద్దరుపిల్లలు కలిగినాకూడా ఆకాపురంలో కాంతిమతి దాషికమే కొనసాగుతూవుంది. అందుకు ఒక కారణంగా కాంతారావు నోరులేనితనాన్నికూడా పేర్కొనాలి. అది కాంతిమతిదృష్టిలో చాతకానితనంగా పేరుబడింది.

"నేను మధ్యాన్నం రెండుగంటలకు అక్కడకివచ్చే ట్రయినులో శనివారంనాడు వస్తున్నాను. స్టేషనుకి రండి" అని రాసింది కాంతిమతి. అది ఆర్డరు.

గోడ గడియారం ఠంగున ఒకటికొట్టింది.

ఆ దెబ్బకి, రాత ఆపి, తలెత్తిచూశాడు కాంతారావు రైళ్ళు లేటుగారావడం అలవాటే అయినా ముందునూవచ్చే ప్రమాదం వుంది. అందువలన ముందే వెళ్ళివుంటే అతర్వాత కాంతిమతినుంచి నిష్ఠూరాలు వుండవు. అది సుఖమయిన పద్ధతి.

ఇంటికి తాళంవేసి వీధినపడ్డాడు కాంతారావు. తాళం చెవులు పక్కింట్లో ఇచ్చాడు.

సూర్యుడు చండనిప్పుల్ని విరజిమ్ముతున్నాడు.గాలి వేడిసెగల్ని చిమ్ముతూవుంది.

నేల పెనంలాగా కాలిపోతూవుంది.

గొడుగేసుకునిచరచరా నడచాడుకాంతారావుస్టేషనుకని.

o o o

వెలిసిపోయిన స్టేషను బిల్డింగుకి ఒకప్రక్కగా, కటకటాల దగ్గర నిలబడివుంది ఒక ముసలిగన్నేరు చెట్టు. కొమ్మల్ని కొట్టుకు పోయినవాళ్ళు కొట్టుకుపోగా, కాకిలాగా లేకిగా నిలబడిన ఆచెట్టు, ఆమధ్య కురిసినవర్షాలకి చిగుళ్ళు వేసింది. ఎండబారిపోయి, మోడిగా అయినట్లున్న ఆచెట్టు క్రింద పడివుండనట్లున్న నీడలో పడివుంది ఒక ఆకారం. ఆ ఆకారానికి అరడులపొడుగునా తెల్లటిగుడ్డ కప్పివుంది. దానిముందు ఒకమనిషి కూర్చుని గుండెలు పగిలేటట్టు రోధిస్తున్నాడు అతనిముందు పరచివున్న మాసినదుప్పటి మీద అయిదు పైసలు పదిపైసలు, పావలాలు, అర్ధరూపాయి నాణాలు చిల్లర మల్లరగా పడివున్నాయి.

అక్కడ కూర్చుని గుండెలుబాదుకుంటూ ఏడ్చేవాడు గురవయ్య.

"ఓర్నాయినో, ఒరిదేముడో, అమ్మా, నాతల్లీ, నువ్వు ఇట్టాపేసావు సస్తావనుకోలేదే. దిక్కులేకసావు సచ్చావుగదే అమ్మా. నాయమ్మా నవమాసాలుమోసి నన్నుగన్నావుగదే, ఓయమ్మా. నాదగ్గిర సిల్లికానీకూడా వుండి సావలేమగదే తల్లీ. నిన్నె ఇధాన తగలేసేదే తల్లీ? నాయినల్లారా! దర్మనాతల్లారా! దిక్కులెససావు సచ్చిన, నాతల్లిని నేనెట్టా తగలెయ్యను మహానుబావుల్లారా?....దయతలచండి బాబుల్లారా!

స్టేషనుకి వచ్చిపోయేవాళ్ళు అదివిని ఆగి జేబుల్లో చేతులుపెట్టి. అందిన పావలా, అర్థా ఆగుడ్డమీద విసిరేసి తమదార్ని తాము పోతూవున్నారు. తాముచేసిన ఆసహాయం వలన ఏదోవిధంగా ఆముసల్ది తగలబడుతుంది లెమ్మన్న సంతృప్తిని సొంతం చేసుకుంటున్నారు. పుణ్యాత్ములన్న భావనకి లోనవుతున్నారు.

ఆ నిద్ర గన్నేరుచెట్టు మొదట్లోకి వచ్చి నిలబడింది ఒక ఎర్రకుక్క. కడుపుకు సంతానాన్ని కన్న ముత్తయి దువులాగ వుంది, అది. భాష అర్థంకాక పోయినా, గుర వయ్య కష్టంలో వున్నాడని గుర్తించింది అది. అందువలన దానికళ్ళు తడిగా అయ్యాయి. ఏడుస్తూవున్న గురవయ్య గాడ్ని జాలిగా చూస్తూవుంది అది. గురవయ్య అవస్థకి గుండెలు కరిగిన బేలహృదయునిలాగా మూగాగా రోదిస్తూ, కన్నీరు కారుస్తూ నిలబడివున్న ఆ కుక్కని గురవయ్య చూశాడు.

"అమ్మో! అమ్మో! దీని బాబుగాడి సొమ్ము ఇక్కడ దాచిపెట్టినట్లు ఈ శెని కుక్క మల్లీ దాపరించిందిరా, నా మనా. దీనికి బుద్ధిలేదుగదరా బాబూ" అంటూ శోకంతో కూడిన రాగస్థాయిని కొద్దిగా తగ్గించి, నేలమీంచి ఒక పలుకు గులకరాయిని తీసి గురిచూసి కుక్కపైకి విసిరాడు గుర వయ్య. నడుం మీద రాయితగిలి, బాధగా కుయ్యోమని అరుస్తూ, దూరానికి పరుగెత్తింది కుక్క. అలా పరు గెత్తిన ఆ కుక్క పది నిముషాలలోనే తిరిగి ఆ స్థానానికి వచ్చి నిలబడింది. గురవయ్య శోకాలు వింటూ, వాడి దీన స్థితికి బాధపడసాగింది. ఏడవటం మొదలు పెట్టింది. అలాగ అప్పటికి చాలాసార్లు జరిగింది.

అటు ఇటు చూసాడు గురవయ్య. ఎండ నిప్పులు చెరిగి పోస్తూవుంది గాలి వేడిగా కుతకుతలాడి పోతూంది.

"ఏంట్రా ఎదవా? సెమటతో తడిసి పోతావున్నాను. ఇంకా ఎంతసేపురా నాకి శిచ్చ??" -ముసుగలోంచి గుస గుసగా మాటలు వచ్చాయి.

"అయిపోయింది కూంతసేపు ఆగరా ఎంకా. ఇంకా, ఈ "జనం ముండా కొడుకులు" నడవటం మానిసావలేదు. పేలాలేగి పోతున్నట్టుగాఏగిరోతానే నడిచ్చత్తన్నారుగందా"

"ఇకనే నాగలేనెహె పొద్దున్నుంచి సత్తన్నానుగందా"

"మా బాబుగాదు రెండ్ని నిమిషాలోపికపట్టు. సందు జూసుకుని లెగిసిపోదాం మన్నాటకం బయటపడితే జనం మక్కెలిరగ దంతారు. అయిపోయిందిలే"

"నేనాగను - అంటే ఆగను"

"బాబ్బాబు. నామాటినుకో. మల్లీ ఈ కుక్క ముండ నా ప్రాణానికి దాపరించిందే తల్లీ. ఎన్నిసార్లు కొట్టినా దీనికి బుద్ధి, గ్నానం వున్నట్టు నాకగపట్టం లేదుగందా" అంటూ ఒక పలుకురాయి నందుకుని గురిచూసి విసిరాడు గురవయ్య. ఆ దెబ్బకి కాలు అదిరిపోగా, కుయ్యోమంటూ కుంటుకుంటూ పరుగెత్తింది కుక్క.

ం ం ం

గొడుగు మడిచి వుస్సురంటూ స్టేషనుకి చేరాడు.

స్టేషనులో అంతా కోలాహలంగా ఉంది. అవతల స్టేషను రెండు రయిళ్ళు గుద్దుకున్నాయట. చాలామంది ప్రయాణీకులు చచ్చిపోయారట. ఎంతోమందికి అంగ వైకల్యం అయిందట. కొంత మంది చావు బ్రతుకుల్లో వున్నారట. ఆ వార్త అప్పుడేవచ్చి రైలువేవాళ్ళు కాళ్ళు తొక్కుకుంటున్నారు

కాంతారావు గుండెలు అదిరాయి మనసు వికలమయి పోయింది

కిటికీ దగ్గరవున్న గుమస్తాని అడిగాడు.

"ఏ బండికంటి యాక్సిడెంటయిందీ?"

"యాభయినాలుగు డవును" అన్నాడాయన చిరాగ్గా, కోపంగా.

"అంటే?"

"యాభయినాలుగు డవును కండి" కరిచినట్టు అన్నా డాయన.

"అంటే ఏంటండి? ఏ బండి?"

గుమాస్తా, తినేసేటట్టు కాంతారావునిచూసి, పళ్ళు కొరికాడు. తలవంచుకొని తనపనిలోమునిగిపోయాడు. కాంతా రావుని గుర్తించదలచినట్లులేదు.

"54 డవునంటే ఏ బండండి?"

"పాసెంజరే!"

"అంటే-మన బందరూ, బెజవాడా పాసెంజరేనా?"

"ఆఁ"

"అంటే- ఇక్కడికి రెండుగంటలకు చేరుకునే పాసింజ రేగా? అదేనా?"

గుమస్తా తలను అవునన్నట్టు వూపాడు.

"యాక్సిడెంటు ఆ బండికే అయిందంటారా? వేరే బండికి అయితే తప్పు నంబరు కయినట్టుగా ఇన్‌ఫర్మేషన్ వచ్చే అవకాశం వుందంటారా? ఏ మంటారూ?"

"యూ ఫూల్..గెటవుట్" అన్నట్టుగా కిటికీ తలుపు ధడాల్మని వేశాడు. గుమాస్తా. కాంతారావుకి మొహంమీది కొట్టినట్లనిపించింది.

"గాడిదకొడుక్కి ఎంతటెంపరూ! అత్తారింటికివచ్చి; అలిగి కూర్చుని మామ్మీద ధుమధుమలూ పెళ్ళాంమీద చూపించే అల్లుడ్లా, వీడు వీడి వెధవమొహమూ, బయటకిలాగి నాలుగు తన్నేవాడు లేకనేగదా వెధవ్వేషాలూ!" అని అతన్ని తిట్టు కుని ఇవతలికి వచ్చాడు కాంతారావు. కానీ, మనసు మనసులో లేదు. ప్లాటుఫారం ఈ చివర్నుంచి ఆ చివరికి నడిచి - ఒక పంచకట్టాయనా, ఒక కోటుధారీ, ఒకనిలువునామాలాయనా, ఇద్దరు కాలేజీ స్టూడెంట్లూ ఎదురవగా - వాళ్ళందర్నీ ఆపి, అడిగి, ఆరాదీసి, యాక్సిడెంటయింది ఆ బెజవాడా, బందరూ ప్యాసింజరుకే అని తెలుసుకున్నాడు. గజగజలాడిపోయాడు.

అతని నవనాడులూ క్రుంగిపోయాయి.

గుండెలు అతివేగంగా కొట్టుకున్నాయి.

మనసు ఉండలు చుట్టుకుపోయింది.

ప్రపంచం శూన్యమయినట్లు అనిపించిచింది.

తను ఇంటి దగ్గర కాగితాల మీద రాసిన, ప్రపంచపు అశాశ్వతతత్వం, తలపుకు వచ్చింది. భోరుమని ఏడుద్దామని పించింది. బయటికి ఏడవలేక పోయాడు.

ఆ బండిలో కాంతిమతీ, పిల్లలూ వస్తున్నారు. ఆ బండిలోనే రావాలా వాళ్ళూ?

వాళ్ళేమయ్యారు? భగవంతుడి దయవలన ఆపద నుంచి గట్టెక్కారా? లేక మృత్యువు వాతనుబడి తనను అన్యాయంచేశారా?

ఏం చేయాలి?

ఇప్పుడు తను ఏం చేయగలడు? ఇంటికివెళ్ళి డబ్బులు తీసుకుని యాక్సిడెంటయిన వూరువెళ్ళాలి. అది సరే. పదేళ్ళు సాగిన వచ్చని సంసారం ఏమయేటట్టూ?

కాంతారావు మనస్సు గిర్రున బండిచక్రంలాగా తిరిగింది. తాగిన వాడివలె తూలుకుంటూ, అప్రయత్నంగానే అడుగులువేసి ఆ నిద్ర గన్నేరు చెట్టుక్రిందకివచ్చి నిలబడ్డాడు కాంతారావు.

అతన్ని చూసి గురవయ్య భోరుమన్నాడు-ఈ శనిగా డెవడ్రా అన్నట్లు చూస్తూ.

"ఎండ ఉదరగొట్టా వున్నా బుద్ధిలేక ఈ గాలితొత్తు కొడుకులకు బజార్లో ఈ తిరుగుళ్ళేమిటిరా నాయునా? ఈ పరిస్థితుల్లో ఏంజేసి చద్దామంటావురా బాబూ"

"ఛ. నోర్మూయ్యహె. వళ్ళిరగడంతానెదవా. చస్తూ చస్తున్నాను. ఇక నేనులేచి పోతాను. ఆగలేను" ముసుగు లోంచి వెంకడు శివాలెత్తుతున్నాడు గుసగుసగా. గురవయ్య ఆమాటలకి కాంతారావు ఇహంలోకి వచ్చిపడ్డాడు.

"ఏం జరిగింది బాబూ?" అని అడిగాడు గురవయ్య.

"మా అమ్మ! నన్నుగన్నతల్లి పోయింద నాయినా. చేతుల్లోచిల్లికానీ కూడాలేదునాకు అమ్మని తగలెయ్యాలి. డబ్బుగావాలి. నీకు తోచినదర్మంచేసి వెంటనే వెళ్ళిపోమా రాజా!

"ఈ తల్లికి ఎవరూలేరా?" అన్నాడు జాలిగా కాంతారావు

"ఎందుకులేరు నానా, చెట్టంత కొడుకుని నేనులేనా? ఎదురుగా కనబట్టం లేదా?

"పాపం! ఎప్పుడు పోయిందీ ప్రాణం?"

"నిన్న అర్థరాత్రప్పుడు చచ్చింది. అప్పట్నించీ నాకు ఈ చావు వచ్చిపడింది నానా'

"ఈమెకు నువ్వు ఒక్కడివేనా, సంతానం?"

"ధరమంజేసి అవతలకి పో బాబూ, అంటే ఈ ప్రెశ్నలు ఏం ప్రెశ్నలు బాబూ? కన్నతల్లిపోయి తట్టిడు దుక్కంతో వుండి, తగలెయ్యటానికి కట్టెలులేక నేను సస్తా వుంటే నన్ను పట్టుకుని ఏలాడతన్నావేంటి నానా? డబ్బు ల్లేకపోతే తగలేమన్కి కట్టెలుగానీ, మనుషులుగానీ, పూరికే వస్తాయనుకున్నావా? దయగలిగితే ఒక రూపాయో, అర్ధో అక్కడ వడేసి పోరాదా?" – భగ్గు మన్నాడు గురవయ్య.

అది గమనించని కాంతారావు కళ్ళల్లోకి అశ్రువులు పొంగివచ్చాయి. గుండెల్ని తొలుచుకుని వచ్చిన సముద్రాలు వుప్పొంగాయి. కాంతిమతీ, పిల్లలూ ఏమయిపోయారో అన్న భయంకరమైన ఆలోచన మనసుని పురుగులాగ తినేస్తూవుంది. శిలలా అలాగే నిలబడిపోయాడు కాంతారావు.

"దీన్తల్లి ఏదోపోయినట్టుగా మాటిమాటికి ఇక్కడికి వచ్చి ఏడుస్తానంటుందిరా బాబు, ఈ కుక్కముండ ఎన్ని మార్లు తరిమి కొట్టినా ఈ గాలిదానికి బుద్దిలేదూ" అంటూ పక్కన పడివున్న కర్రనుదీసి విసిరాడు గురవయ్య కోపంగా. నిద్రగన్నేరు చెట్టు మొదలునుంచి కుయ్యోమంటూ దూరంగా పరుగుదీసిందికుక్క.

సడెన్గా–ముసుగును ఒక్క తన్ను తన్ని గుడ్డను అవతలకి విసిరేసి, లేచికూర్చున్నాడు వెంకడు!

ఆ దృశ్యాన్ని నోరు వెళ్ళబెట్టి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు కాంతారావు! కళ్ళు పెద్దవిచేసి చూస్తున్న కంతారావుకి వళ్ళంతా చమట్లుపట్టాయి ముసుగులోంచి లేచి నిలబడిన వెంకడు బుంగమీసాల్తో, మెలిదిరిగిన కండల్తో ఎర్రగా అయివున్న మిడిగుడ్లతో కాంతారావు వంక భయంకరంగా చూసాడు-డొక్కలో బలం కొద్దీ కాంతారావుని ఒక కుమ్ము కుమ్మాడు–కాంతారావు క్రిందపడిపోయాడు.

డబ్బుల్తోవున్న దుప్పటినీ, ముసుగుబట్టనీ, చకచక మడుచుకుని, చంకలో పెట్టుకుని ఇద్దరూ ఆఘమేఘాల మీద వుడాయించారు. పిట్టల్లాగ పారిపోతున్న వాళ్ళ కెదురుగా-

సడన్గా మలుపు దిరిగిందిలారీ. బాణంలాగా దూసుకు వచ్చింది. మృత్యువువలె మీదిమీదికి వచ్చింది. భీకరంగా యమస్పీడుగా వస్తున్న లారీ బ్రేకులు కర్ణ కఠోరంగ కీచుమన్నాయి.

కొన్ని క్షణాలుమాత్రమే అప్పటికే జరగవలసింది జరిగిపోయింది. ఎర్రెర్రగా, భయంకరంగా అయిన ఆ లారీ చక్రాలక్రింద, విగత జీవులయి పడివున్న గురవయ్య వెంకడు జనం పోగవుతున్నారు. ఆ దారుణాన్ని చూడలేక ఇవతలకి వచ్చాడు కాంతారావు, కాలుచేతులు గజగజలాడగా.

ఈ ప్రపంచం అంతారిస్కుకి లోనయివుంది. బ్రతుకే ఒక లాటరీలాగా వుందిగదా! ఇలా ఈనిమిషాన, ఆ ఇద్దరు దున్నపోతులూ, మృత్యువుకి బలి అయిపోతారని కొన్ని నిముషాలకి ముందు తను అనుకున్నాడా? లేదే. మరిఇదేమిటి?

కాంతారావుకి కాలుచేతులు వణికాయి. ఆగొడవలో గొడుగు సంగతి మర్చిపోయాడు. తాగినవాడిలాగ తూలుతూ, అప్రయత్నంగానే ఇల్లుచేరాడు. నెత్తిమాడింది. కాళ్ళు కాలాయి.

ఇల్లు! తన ఇల్లు.
ఏముంది, ఇంకా ఇంట్లో?
ఇల్లు ఇల్లనియేవు
ఇల్లు నాదనియేవు
నీ ఇల్లు ఏదే, ఓమనసా!
కాంతీ,
కాంతి మతీ
నీకేమయింది? నా జీవితనేస్తమా? అబ్బ! డొక్కలో నొప్పి!

కాంతిమతికి నోటి దూకుడు అన్నమాట నిజమేకాని, నువ్వు ఎంతమంచిదానివీ! నిన్నెలాగఒదులుకోనూ? కాంతిమతీ! నీవు లేని నా జీవితం వూహించుకోవటానికే భయంకరంగా అనిపిస్తూవుందే? ఏంచేసేది?

తోలు తిత్తి ఇది

తోలు తిత్తి ఇది

తోలు తిత్తిరా, నరుడా! పామరుడా!! మరెందుకు నీకి భయంకరమైన వ్యధా!

కేవలం ఆరడుగులనేలా, ఇన్నికట్టెలూ, ఒక్కఅగ్గిపుల్లా- ఇవేరానీకు అవసరమైనవీ,

అమ్మో,

గుండెల్లో పోటు!

ఆ మిడిగుడ్ల రాక్షసుడు ఎంత బలంగా గుద్దాడూ?

తను బ్రతికి మరల బట్టగట్టగలడా? అసలు ఎందుకు ఇక తను బ్రతకటం?

కాంతీమతీ, పిల్లలూ లేని బ్రతుకు తనకువద్దు ఆవెలితిని తను భరించలేడు!

మాయా సంసారము, తమ్ముడు.

నీమదిలో సదాశివుని, మరువకు తమ్ముడూ,


'అమ్మా! నాన్న వచ్చారేయ్'-పాపసంభ్రమపూర్వక అరుపువిని ఆలోచన్ల నుంచి బయటపడ్డాడు కాంతారావు.

ఆ కేకలికి చంకలో బాబును వేసుకొని లోపల్నించి ఆత్రంగా చకచకా వచ్చింది కాంతిమతి; సౌభాగ్యవతి, పుణ్యవతి, నిజపత్ని, తన ఇంటి దీపం తన ఆశలపందిరి. కాంతారావు కన్నులలో తడి వుబికింది. ఆనందంతో గుంటెలు గుబగుబ మన్నాయి.

ఒక నెలరోజుల విరహం. ఎండిబీటలు వారిన నేలమీద తొలకరిజల్లు పునస్సమాగమం. మాకోసం స్టేషనుకి వెళ్ళి వస్తున్నారా? మేము రైలుకి రాలేదు. అన్నయ్య స్నేహితు డొకాయిన, కారులో ఈ పూరువస్తుంటేనూ, అందులో వచ్చా ములెండి. కష్టపడ్డారుగాని, మొహం కడుక్కోండి. కాఫీ ఇస్తాను. అంది కాంతిమతి ప్రేమగా అలాగేనన్నట్లు తలవూపి కాంతారావు, వెయ్యిఏనుగుల బలంతో గాబుదగ్గరకు మొహం కడుక్కోవటానికి వెళ్ళేడు,

ఈ బ్రతుకును గూర్చి అంతతాపత్రయం ఎందుకురా! కాంతిగా?

మొహం కడుక్కొబోతున్న కాంతారావు, చింపిన ఆకాగితం ముక్కమీద, ఉదయం దిగుల్లోపడి తనురాసిన, ఆ మాటల్ని చదువుకొని ఉలిక్కి పడ్డాడు! నేలమీద చింపి పారవేయబడివున్న కొన్ని కాగితం ముక్కల్లో అది ఒకటి. నిర్దాక్షిణ్యంగా చిన్నచిన్న ముక్కలుగా చింపివేయబడిన ఆలోచనాపరంపరలు ఆపని కాంతిమతిదా? పిల్లలదా? అన్న ఆలోచనలోపడ్డాడు కాంతారావు.!



ఆదూరి సత్యవతీ దేవి

మా వి తో పు

ఎక్కడ నించి యీ ఘుమఘుమలు? ఎవ్వరివీ కిల కిలలు!

తూరుపు ఆకాశం బంగారాన్ని భూమిపైకి వొంపుతున్నట్లుగా యిట్లా వెలిగి పోతోందేమిటీరోజు! అబ్బ! ఏంత మిరుమిట్లు గొలిపే సౌందర్యమిది!

ఈ మావితోపు యిట్లా పులకించి పోతున్నదేమిటీ రోజు! ఏ లోకపు దేవతలకో స్వాగతం పలుకుతున్నట్లుగా-

ఈ కొలనులోని కలువలు ఎట్లా విచ్చుకుంటున్నాయో పసిపాపల కళ్ళలా-

అంతా కొత్తగా ఏది చూసినా వింతగా తోస్తోంది. రాత్రంతా మంచులో తడిసిన బొండుమల్లెలపైన పరుచుకున్న మంచు బిందువులు గాలిపాటుకి నేలరాలుతుంటే ముత్యాలు జాలువారుతున్నట్లు వుంది- లేకపోతే రాత్రింతా ముత్యాల వానే కురిసిందేమో!

కొమ్మకొమ్మకీ గుత్తులే! తెల్లని తేజస్సుతో ఆ మల్లెలు వూగుతూంటే యేదో సందేశం చెబుతున్నట్లున్నది. స్వచ్ఛంగా.... స్వేచ్ఛగా నాలాగా నువ్వూ నవ్వగలవా అని అడుగుతున్నట్లున్నది- ఈ గాలిలో యీ గరికలో మొన్న మొన్నటి వరకూ లేని కొత్తదనమేదో దోబూచులాడుతోంది-

ఆc. అవునూ.... ఇదివసంతకాలం కదూ?

అందుకా యీ ప్రకృతిలో యీ పారవశ్యం....యీ నూతనత్వం.

అవును.... నాలోకూడ యేదో గమ్మత్తయిన భావ లాస్యం.

నాలో నాకే వినిపించని యీ గుసగుస లెవరివి?

ఎందుకి గుండెలో యిలా కరుగుతోంది పాట?

మధుమాసం వచ్చినదా
మావి పులకరించినదా
మల్లె పొదలు పూచినవా
మనసు వీణ మీటినదా ॥మధు॥

తూరుపు బంగారు పూత
ఝుమ్మంటూ తేటి మ్రోత
ఎటు చూచినా ఆ మనే
నే నున్నది నవ వనే ॥మధు॥

విరితేనెల జల్లులు
సిరి వెన్నెల పూతలు
చిరుగాలిలో పాటలు
తీయతీయని వూహలు ॥మధు॥

అదిగో- అక్కడ యేవో పిట్టలు కబురులు చెప్పుకుంటున్నాయి -వాటి స్వరాలు వింటూంటే నా అడుగులు ఆటే పడుతున్నాయి.- ఆ నీలివన్నె పక్షులు ఆ గోధుమ రంగు పిట్టలతో ఏమి షంభాషిస్తున్నాయబ్బా? పెళ్ళి మాటలేమో! ఉండీవుండీ అటూయిటూ ఆ చూపు లేమిటి? అదిగో....దూరం నించి మరికొన్ని పక్షులువచ్చి వీటి ప్రక్కనే చేరుతున్నాయి- ఇంకేముంది ముచ్చట్లూ పెరుగుతున్నాయి!

అక్కడ ఆయేటి మీదికి యేటవాలుగా వంగిన ఆ కొమ్మ చిగురుటాకుల మీదకూర్చుని వూయలలూగుతోందో చిట్టి చిలకమ్మ- కొంచెమైనా భయం లేదుకదా. అయ్యో- ఇందాకటి ఆ రెండు జంటలూ ఏవీ? ఆ గుంపులేవీ? ఎక్కడికో తుర్రుమన్నట్టున్నాయి- అబ్బబ్బ ఒక్క క్షణం కుదురుగా ఎక్కడా నిలవు గదా. మళ్ళీఇక్కడికిఎప్పుడొస్తాయో! దారి తప్పిపోవుగద? అయినా ఆ పరుగు లేమిటమ్మా-

ఎక్కడికి వెడతాయో నేనూ చూస్తా-

ఆఁ ....అవిగో! ఆ కొలనులోని నీళ్ళన్నీ ముక్కుతో కదిలిస్తూ, రెక్కలు ముంచి పైకెగురుతూ, తుళ్ళుకుంటూ. జల్లుకుంటూ ఎట్లా ఆడుకుంటున్నాయో! వీటికెలాంటి బాధలూ భయాలూ లేవు కాబోలు-ఎప్పుడూ ఆటలే పాటలే పెళ్ళి కొచ్చిన కన్నె పిల్లలా- అసలీ తోటంతా యీరోజు యిట్లాగే వుంది. కొత్త పెళ్ళికూతురిలా సింగారించుకుని-ఆకు కదలినా గాలి వీచినా కొత్త గీతానికి శృతి కూర్చుకుంటునట్లు అన్నీ వింత శబ్దాలే! అబ్బా – ఎంత కమ్మని వాసనలో! మనసుకి యేదో మగత కమ్ముతోంది-ఇక్కడే యిట్లా వుండి పోతానేమో!

పువ్వా పువ్వా పులకించే
కొమ్మా రెమ్మా తలలూచే
చిలకల చిగురుల గుబురులలో
కిలకిల నవ్వులు వొలికించే ||పువ్వా||

ఆకు కదలినదంటే కోటి రాగాలు
యేరు నడచినదంటే కొత్త అందాలు
గాలి వీచినదంటే తావి ఘుమఘుమలు
కొమ్మ వూగినదంటె సంగీత శ్రుతులు ||పువ్వా||

పక్షి పలుకులు కావు సన్నాయి పాటలు
తోట కానే కాదు కొత్త పెళ్ళిపీట
వరుడు మోహనుండు వధువు పూరాణి

ఈ తోట సొగసును వీక్షి సొగదె నా మనసు ||పువ్వా||

ఇక్కడే యిట్లాగే వుండి పోతానేమో? ఉండి వుండి కొమ్మల్లో కొమ్మనై పువ్వుల్లో పువ్వునై చిక్కుకుపోతే ఎంత బాగుండును? ఇక్కడట్లా హాయి పొందాలంటే ఏదైనా వరం పొంది పుట్టాలేమో! సౌందర్యాన్ని కళ్ళతో చూచి, మనసుతో గ్రహించి ఆర్ద్రి మవ్వాలని సార్థకత చేసుకొమ్మని చెప్తున్నాడా సృష్టికర్త అన్నట్లుగా పరమ రసభరితమైన ఈ ప్రకృతి అంతులేని భావ గాంభీర్యంతో తొణికిసలాడుతోంది! అదిగో-ఆ మావి గుబుర్లలో వగరుమామిడి రెమ్మలు తింటూ సొగసుగా కుహుకుహు మంటూ మనసుని మైమరపించే పాటనే వినిపించ బోతోందొక కోయిల. దాన్ని అడుగుతా అసలు సంగతి- పోనీ ఒక్క పాటైనా నేర్పమంటా. అదిగో - రాగం అందుకుంది. ఏమి రాగమో.... ఎక్కడ నేర్చిందో ...ఏమిటి నాలో యింత మైమరపు? ఈ పాటలో యేదో చెప్పలేని హాయివుంది- ఆత్మీయత వుంది- పలుకరిస్తే పారిపోతుందో యేమో! అయినా అడుగుతాను_

ఏటి దాపున మావి తోపున
కొమ్మనూగుచు పాటపాడుచు
హాయినంతగ పొందగా
తపములేమి చేసినావో
చెప్పరాదా కోయిలా ||ఏటి||

తేటనీటి వూటలాగా
తెలుగుపలుకుల తీపిలాగా
తోటతోపులు పరవశించగ

కలల ముంచి అలల నూపి
పాటలెవరు నేర్పినారు
చెప్పరాదా కోయిలా ||ఏటి||

పలుకులా అవి కవితలా
పరమ శివుని సూక్తులా
ఏ స్వరము కూర్చి పాడుచుంటివె
యిహము మరచి పోతినే
చెప్ప వద్దులే కోయిలా
పాటపాడవే హాయిగా ||ఏటి||

అబ్బ! యింతటి మహత్తరమైన సౌందర్యాన్ని చూచిన తరువాత, యింతటి అద్భుతమైనగానాన్ని విన్న తరువాత నా దృష్టిని యితర విషయాలపై ఎలా నిలిపేది? ఇంత కంటె గొప్పవరాన్నిమ్మని ఏ దేవతల్ని మాత్రంఎట్లాకోరేది? సౌందర్యమూ, ఆనందమూ పొడుగూ పేకల్లా యీ ప్రకృతంతా పరచుకున్నాయి- ఈ వొంగిన ఆకాశం క్రింద యీ పచ్చని పచ్చికలో యీ తోపులో యీ కొమ్మల రెమ్మలో యే కోయిలనోఅయి పరవశిస్తాను. నా జన్మాంతరాల సంస్కారాన్ని, నా భావాల్ని ఆర్తినీ వీటితోనే పంచుకుంటూ నేను యిందులోనే లీనమౌతా-ఇలాగే పులకరిస్తా నేనే ఒక పాటనై యిలానే వుండిపోతే....?

కోయిల నేనై కూయనా
కొమ్మను నేనై పూయనా
పున్నమి నేనై విరియనా
పుడమిని నేనై మురియనా ||కోయిల||

పారిజాతపు తోటనేనై
పరిమళము వెదజల్లనా
పరిమళాలా పొన్పుపైనా
పాటనై పవళించనా ||కోయిల||

లోకమంతా తిరిగి తిరిగి
లోకులందరి కుశలమడిగి
వేకువల్లే దీపమల్లె వెలగనా
వెలుగు నీడన నడవనా ||కోయిల||

గగనము నేనై ఎదగనా
గానము నై సాగనా .
వానమేఘమై కురియనా
ఆమని ఋతువై మిగలనా ||కోయిల||




మరమ్మత్తు

శ్రీ కొడవంటి లీలామోహనరావు

విశాల నీలాకాశంలో
కారుమేఘం బెదిరించిందని
అందాల చందమామలో
నల్లమచ్చ వెక్కిరించిందని
ప్రశాంత సాధుజీవనంపై
క్రూరత్వం పంజావిసిరిందని
ఎందుకయ్యా ఆక్రోశిస్తావు
ఏకాంతానికి పరిగెడతావు?

మనిషిని యంత్రంగా మార్చేసెయ్
అతని తీరికంతా హరించేయ్
మాయ మద మాత్సర్యాలని
చక్రాల మధ్య తుక్కుతుక్కు చేసేయ్
అర్హత పోగొట్టుకున్న మనిషికి
యంత్రంగా వునికి నిచ్చి
ఎగుడు దిగుడుల "దైవసృష్టి"ని
నమతలంగా సరిచెయ్యి.



డా॥ కె. జె. కృష్ణమూర్తి

బమ్మెర పోతన - తరిగొండ వెంగమాంబ

ఆంధ్ర వాఙ్మయ మహేతిహాసంలోని విశిష్ట ఘట్టాల్లో శ్రీ మద్భాగవతం అనువదింపబడటం అత్యంత ముఖ్యమైన సన్నివేశం. భక్తకవీ, సహజపండితుడూ అయిన బమ్మెర పోతరాజ కవి చంద్రుడు చేతులార శివపూజ చేసిన అమృత హస్తంతో, హరికీర్తి నిలయమైన ఆ పురాణ రత్నాన్ని మధుర భక్తిరసాయనంగా తెనిగించినాడు.

ఆంధ్ర మహా భాగవతం అవతరించిన నాటినుండి తెలుగు సారస్వతం అపూర్వ దివ్య కళలతో తేజరిల్లసాగింది. పోతనామాత్యుని రచన అచిరకాలంలోనే ఆంధ్రావని వాడ వాడలా కవిత్రయ భారతాన్ని మించిన ప్రశస్తి, ప్రచారా లను పొందగలిగింది. అందుకు మూలకారణాలు— ఒకటి : అందలి భక్తిరస పరిప్లుతమైన కమనీయ శైలి (శయ్య); రెండు : ఆ భక్తిరస వాహినిలో ఎందెందు వెదకి చూచిన అందందే గోచరించే పోతన మహాకవి ఆత్మీయత.

పోతన కృతి అదివరకు తెలుగులో సంస్కృత భాగవ తానికి అనువాదం లేదనే కొదువను పూరించడమేగాక, అనంతర కాలీనులైన అనేక భక్తకవులను, కవయిత్రు లను పుష్కలంగా ప్రభావితుల్ని చేసింది. ఇది ఈ సంద ర్భంలో పేర్కొనదగిన సరస సారస్వత విశేషం . ఏ తత్ఫలి తంగా తెలుగు సాహిత్యంలోని వేర్వేరు రచనా ప్రక్రియల్లో భాగవత కథాత్మకాలైన రచనలు కోకొల్లలుగా వెల్లివిరిసి నాయి, ఈ విధంగా తరువాతి కవులకు ఒజ్జబంతియై విల సిల్లడంలో అగ్రేసరమై వెలసింది ఆంధ్ర మహా భాగవత కల్పశాఖి.

పోతనార్యుని భాగవత కవితచే ప్రభావితులైన అసంఖ్యాక కవుల్లో, కవయిత్రుల్లో అగ్రగణ్యురాలు తరిగొండ వెంగమాంబ చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకాలోని తరిగొండ గ్రామంలో కానాల మంగమాంబాకృష్ణయా మాత్య దంపతులకు తిరుపతి వేంకటేశ్వరుని వరంవల్ల జన్మించిన వెంగమాంబ బాల్యం నుండే పరమభక్తురాలుగా, గొప్ప తపస్వినిగా, సహజ కవయిత్రిగా పేరుపొందింది. శతకం, యక్షగానం, ద్విపద, పద్యం, గేయం—వంటి విభిన్న సాహితీ ప్రక్రియలలో ఇంచుమించు ఇరువది రచన లను వెలయించిన వెంగమాంబ వాఙ్మయ జీవితం చాలా మట్టుకు బమ్మెర కవిచంద్రుని భాగవత రచనచే సముజ్జీవి తమై భాసించింది.

వెంగమాంబ విరచించిన తొమ్మిది యక్షగానాల్లో నృసింహ విలాసము, బాలకృష్ణనాటకము, రుక్మిణీనాటకము, విష్ణుపారిజాతము, జలక్రీడా విలాసము - అనే ఐదిటికి పోతనామాత్యుని భాగవత కల్పతరువు ప్రత్యక్షంగా కథా వస్తువును ప్రసాదించింది. దశమస్కంధంలోని రాసక్రీడా కథాంశం ఆధారంగా వెంగమ లేఖిని నుండి వెల్వడిన బాల కృష్ణ నాటకంలోని ఈ క్రింది పద్యం పోతనగారి పద్యాల ఒరవడికి చక్కని ఉదాహరణ :

ఉ॥ నవ్వుముఖంబువాడు, మృదునాదపు వేణువుఁ బూని
నాడు, వాఁ
డివ్వసుధారమణుఁ, డి దరకున్ ప్రియుఁడైన
వాఁడు, మా
యవ్వన మూల్యమిప్పుడతఁడంతయు ముచ్చిలి
తెచ్చినాఁడు, బల్
రవ్వలు చేసినాఁ డిటకు రాఁడుగదా గిరులార!
చెప్పరే."

లీలా మానుష విగ్రహుడైన శ్రీకృష్ణుని అద్భుత కృత్యాల్లో కాళీయమర్దనం ఒకటి. కాళీయుని పడగలపై బాల కృష్ణు డాడిన ఈ వింత నాట్యాన్ని గూర్చి పోతన —

"అక్షీణోద్ధతినాడుఁ బాడుఁ జెలంగున్ హాసంబుతోడం బద ప్రక్షేపంబులు సేయుఁ గేళిగతులన్"— అని సంగ్రహంగా పేర్కొన్నాడు. పై పల్కుల్లో సూచితమైన భావం ఆధారంగా, వెంగమాంబ ఆ దివ్య నాట్యాన్ని మనోజ్ఞంగా వర్ణించిన తీరు తిలకించండి.

దరువు, ఆది తాళం

ఆడెనే, కృష్ణు డాడెనే ॥పల్లవి॥

పాడుచు నా గోపకులందరు తన
వేడుక జూడగ వింతగ నగుచూ ॥ఆడెనే॥ ఉపపల్లవి॥

తతకిట తకఝుం తధిమి ధిమిత యని
గతులు చొల్లు లతులితముగ మెరయా ॥ఆడెనే॥ ౧

అలరుచు చిరుగజ్జెలు నూపురములు
ఘలుఘలు ఘలుఘలు ఘల్లని మ్రోయా ॥ఆడెనే॥ ౨

ధాణు ధణంధణు ధణిత యనుచు గీ
ర్వాణులు నభమున వరుసగ పొగడా ॥ఆడెనే॥ ౩

మణిభూషణములు మరి మరి కదలగ
ఘణఘణ యని మొలఘంటలు మొరయా ॥ఆడెనే॥ ౪

తారి తకిణఝుం తకకిణ తకఝుం
తారి తకిట తక తాత్తై యనుచూ ॥ఆడెనే॥ ౫

వర తరిగొండ నివాసుడు వేంకట
గిరి నిలయుండగు కృష్ణుడు చెలగి ॥ఆడెనే॥ ౬

వెంగమాంబ రచించిన తాత్త్విక కావ్యాల్లో విశిష్టమైనది రాజయోగామృతసారం. భాగవత తృతీయస్కంధం లోని కర్దమ ప్రజాపతి వృత్తాంతమే ఇందలి ఇతివృత్తం. ఈ కథలోని "కపిలదేవహూతి సంవాదం" ఆధారంగా వెంగమ్మ ఈ ద్విపదకృతిలో స్వానుభవపూర్వకమైన రాజయోగ విజ్ఞానాన్ని ముచ్చటగా మూడుప్రకరణాల్లో ఇమిడించింది.

ఈ కవయిత్రి రచనలన్నింటిలో పరిమితిలోను, కవితా పరిణతిలోను ప్రథమగణ్యమైన గ్రంథం శ్రీభాగవతము. ఇది ద్విపదకావ్యం. భగవంతుని ప్రేరణయే కారణంగా తాను ఈ గ్రంథాన్ని రచించినట్లు వెంగమాంబ అవతారికలో తెలిపింది.

ఒకనాడు మధ్యాహ్నవేళ వెంగమాంబ ముదముతో మోక్షచింతన చేస్తూ ఉండగా, అంబుజోదరుడు ఒక భూసుర శ్రేష్ఠుని రూపంలో ఆమె చెంతకు వచ్చి ఈ విధంగా పల్కినాడు-

ద్వి॥ "ఘనతరంబైన భాగవతంబునందు- మొనసిన తత్త్వార్థములను పామరులు
తెలియలేరటుగాన తేటగా తత్త్వ-ములనెల్ల సంక్షేపముగ రచియించి
హరి వరాక్రమములు హరి విహారములు-హరి యవతారముల్ హరి మహత్వంబు
పొలుపొంద విస్తరింపుము నీవటంచు"

భగవంతుడు పలికిన పై పలుకులను మననంచేసి కొంటూ, ఆరీతిగా భాగవతాన్ని రచించే భాగ్యం, శక్తి తనకు ప్రసాదించవలసిందని, కవయిత్రి ఇష్టదైవమైన వేంకట గిరీశ్వరుణ్ణి ప్రార్థిస్తూవుండగా, ఆస్వామి మరో రూపంలో మళ్ళీవచ్చాడట!

ద్వి॥ "నీలాభ్రవర్ణుడై నిరుపమ హేమ- చేలుడై మోముపై చిరునవ్వు మెరయ
కరుణాకటాక్ష వీక్షణము దీపింప-సరసుడై మధ్యాహ్న సమయంబునందు
చిన్ని కృష్ణుని రీతి చెంతకు వచ్చి-పన్నుగా దెచ్చి శ్రీభాగవతంబు
నన్ను చేకొమ్మని నాచేతికిచ్చి - సన్నసైగల నిది సారంబుగాను
వరుసగా ద్విపదకావ్యము జేయుమనుచు-చిరమైన దయను సూచించి యున్నాడు"

కాబట్టి, మధ్యాహ్నకాలంలో భగవానుడు మొదట భూసుర శ్రేష్ఠుని రూపంలో వచ్చి, భాగవతంలోని తత్త్వార్థాలు పామరులకుసైతం బోధపడేటట్లు సంగ్రహంగానూ, శ్రీహరి మహిమలను విస్తారంగానూ రచించవలసిందని వెంగమాంబను ఆదేశించివెళ్ళాడు. ఆయనే మరికొంత సేపటికి బాలకృష్ణుని రూపంలో ఆమె చెంతకు వచ్చి, భాగవత గ్రంథాన్ని చేతికిచ్చి, "ఈగ్రంథాన్ని ద్విపదగా రచించు" అని సూచించి వెళ్ళినాడు. ఇది ఈ కవయిత్రి ద్విపదభాగవత రచనకు హేతువై వెలసిన మహనీయ సంఘటన! ఈ సంఘటనలో చిన్నికృష్ణుడు వెంగమాంబకు తెచ్చియిచ్చిన "భాగవతం" పోతనామాత్యుని భాగవతమేనని పరిశీలనవల్ల వెల్లడైన సత్యం.

పోతనకు తరువాతికాలాల్లో భాగవతపురాణాన్ని తెలుగులో రచించిన కవులను ముఖ్యంగా రెండు రకాలుగా వింగడింపవచ్చు. పోతన రచనలో శిథిలమైన భాగాలను పూరించడానికి పూనుకొన్నవాళ్ళు అందులో ఒక వర్గం. ద్విపద, గేయం, వచనంవంటి సులభగ్రాహ్యప్రక్రియల్లో భాగవతాన్ని రచించినవాళ్ళు ఇంకొకవర్గం. తరిగొండ వెంగమ్మ ఈ రెండవ వర్గానికిచెందిన కవయిత్రి. ఈ రెండు రకాలవారికీ పోతనార్యుని భాగవతరచనయే ఆదర్శమై అలరారింది.

వెంగమాంబకు పూర్వం తెలుగులో ద్విపదభాగవతాలు కొన్ని వెలసి ఉన్నప్పటికీ, ఈకవయిత్రి కృతి యొక్కటే పోతనగారి రచనను ఆమూలాగ్రం సమర్థవంతంగా అనుసరించిన ప్రఖ్యాతికి, ఆ భక్తిగౌరవాలకు నోచుకొన్నది. ఇందువల్ల, ఆనాడు (క్రీ. శ. 18వ శతాబ్దిఉత్తరార్ధంలో) వెంగమకు అందుబాటులో ఉండిన పోతన భాగవతప్రతిలోని పాఠాలను గుర్తింపగల సదవకాశం ఈనాడు మనకు ఈమె ద్విపదకృతివల్ల సిద్ధిస్తూవుంది. ఈవిధంగా పోతన భాగవత పాఠనిర్ణయానికి పరోక్షాధారంగా వెలసివుండట మూలాన వెంగమాంబ ద్విపదభాగవతం యొక్క ప్రాముఖ్యం ఇనుమిక్కిలిగా ఇనుమడించి వుంది. ఈవైశిష్ట్యాన్ని తొలుదొల్త గుర్తించినవారు పరిశోధన వరమేశ్వరులు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు.

ద్వి॥ "ఆనాడు పోతరాజాత్మయందుండి-నానార్థసార నిర్ణయ వాక్యములను
పలికించినటువంటి పట్టాభిరాము-డలర నామీద నేడభిమానముంచి
చెలువొప్పనెపుడు నా జిహ్వయందుండి-పలికించినటుల నేబలికి తత్కృతిని
శ్రీ తరిగొండ నృసింహుడనంగ - ఖ్యాతిగావెలయు వేంకటగిరీశ్వరుని
పదయుగళికి సమర్పణము చేసెదను-సదయులై తప్పొప్పు సమకూర్చికొనుడు
ఘనమైన తత్కథాక్రమమెట్టులనిన - వినరయ్య కవులార! విద్వాంసులార!"

అని అవతారికలో పోతనను స్మరించి, వెంగమాంబ భాగవత కథను అనువదించటానికి ఉపక్రమించింది. పోతనకు గ్రంథం వ్రాయమని ఆదేశించింది శ్రీరాముడు; అంకితం గైకొన్నది శ్రీకృష్ణుడు. అలాగే వెంగమాంబకు గ్రంథం రచింపుమని ఆజ్ఞాపించినవాడు శ్రీ కృష్ణుడు. అంకితం కైకొన్నవాడు వేంకటగిరీశ్వరుడైన వేంకటేశ్వరుడు.

వెంగమాంబ పోతన రచనను యథాతథంగా ద్విపదీకరించి నప్పటికీ, ఆమె అచ్చటచ్చట కథలో కొన్ని చిన్న మార్పులు, చేర్పులు చేసింది. ఈ మార్పులు,చేర్పులు -ఇత్యాదులు ఈ కవయిత్రి యొక్క కవితానైపుణికి, ఔచితీ దృక్పథానికి కమనీయోదాహరణలు. వాటిల్లోనుండి మచ్చుకు ఒకటి రెండు:

1) పోతన నైమిశారణ్యాన్ని సమాస భూయిష్ఠమూ, అలంకారికమూ ఐన సుదీర్ఘ వచనంలోవర్ణించాడు. బాణుని

కాదంబరిలోని అటవీ వర్ణనలను పోలిన అవచవాన్ని అనుకరింపక, వెంగమాంబ ఆ ధర్మారణ్యాన్ని మున్యాశ్రమోచిత వాతావరణం ఉట్టిపడే రీతిలో నిసర్గసుందరంగా, నూత్న భావమనోహరంగా వర్ణించింది. పురివిప్పి ఆడుతూ వున్న నెమళ్లు, పుప్పొడి కుప్పలలో నడియాడుతూన్న రాజహంసలు, రామాయణం చదివే రామచిలుకలు, సహజవైరం వీడి సంచరించు గోవులు-పులులు, ఏనుగులు-సింహాలు-మున్నగు వీటన్నిటితో గూడిన పవిత్ర వాతావరణం వెంగమ వర్ణనలో ప్రత్యక్షరంలోనూ పరిమళిస్తూ వుంది.

ii) భాగవతపురాణ కథా ప్రధాన శ్రోత పరీక్షిత్తు అతని జన్మవృత్తాంతాన్ని పురస్కరించుకొని ప్రథమ స్కంధంలో భారత కథ కొంతభాగం ప్రసక్తమైంది. వెంగమ ఈకథా భాగాన్ని అనువదించడంలో భారతంలో నుండి కొన్ని కథాంశాలను స్వీకరించి, తన రచనలో జోడించి ఆయా సన్నివేశాలను రంజింపజేసింది.

iii) స్త్రీపాత్రలయెడ కొన్ని చోటుల గోచరించే న్యూనతను తొలగించే పూనికతో వెంగమాంబ చిరుమార్పులు చేసి న్యాయంచేకూర్చింది. ఈవిషయమై ఒకేఒక ఉదాహరణ:

పరీక్షిత్తు కలిపురుషునికి ఇచ్చిన స్థానాల్లో స్త్రీకూడా చెప్పబడివుంది. "ప్రాణివధ, స్త్రీ, ద్యూత, పానంబులనియెడు నాలుగు స్థానంబులనిచ్చి" (1స్కం.,461వ.) అని. కవయిత్రి ఈ అభిప్రాయాన్ని సవరించిన తీరు అరయదగింది.

"ద్వి॥ ఎప్పుడు ప్రాణుల హింసించు చోటు-పోరి పరస్త్రీలను
పొందెడు చోటు
ఆరూఢిగా జూదమాడెడి చోటు-తగ మద్య మేవేళ
త్రాగెడిచోటు
నగుబాటుఁగు నిట్టి నాల్గు చోటులను-చరియింపుమన
నవి చాలక వాడు"

స్త్రీజాతి అంతా కలిస్థానమని చెప్పబడి వుండగా వెంగమ దానిని 'పోరి పరస్త్రీలనుపొందెడి చోటు'గా మార్పుచెయ్యడం మిగుల సముచితమై ఒప్పింది.

iV) ఆయాభక్తులు భగవంతుణ్ణి స్తుతించే సందర్భాల్లో ఈ కవయిత్రి పెక్కుచోట్ల పోతననే అనుసరించినప్పటికీ, ఆ 'సహజపాండిత్య విరాజితు'నివలెనే ఈ సహజకవయిత్రి కూడా భక్తిరసార్ద్ర చిత్త కలదగుటచే ఒక్కొకచో స్వతంత్రించి భగవన్నుతిని సమకూర్చింది. చతుర్థస్కంధంలో ధ్రువుడు శ్రీమన్నారాయణుని స్తోత్రం చేసే ఈ క్రింది ఘట్టం ఇందుకు ఒక తార్కాణ.

"ద్వి॥ శరణు రమాధీశ! సార ప్రకాశ!-శరణు పాప వినాశ!
జలదసంకాశ!
శరణు పావననామ! జగదభిరామ!-శరణు సత్పరధామ!
సంపూర్ణకామ!
జయ నిగమవిహార! జయ మేరు ధీర!-జయసుజనాధార
జగదేకవీర!
జయపరమ పవిత్ర! సత్యచారిత్ర!-జయవికుంఠక్షేత్ర
సన్మునిస్తోత్ర!
విశ్వాత్మకుడ వీవు విశ్వంబు నీవు-విశ్వేశ్వరుడవీవు
వేదార్థమీవు
నిన్ను సన్నుతిచేయ నీలకంఠునకు-పన్నగభర్తకు బ్రహ్మ
దేవునకు
నలవిగాదన నే నతిబాలకుడను - జలజలోచన! నిన్ను
సన్నుతించుటకు
నేనెంతవాడను నిజము భావింప-నన్ను రక్షింపవె నా
తండ్రి! యనుచు
గొనకొని వేదాంతగుంఫితోక్తులను - వినుతింప గరుణ
నవ్విష్ణుడిట్లనియె"

V) భాగవతమంతటిలో దశమస్కంధం ప్రత్యేకత కలది. అందులోనూ శిఖరాయమాణమైన సన్నివేశం శ్రీకృష్ణావతారవర్ణనం. ఈఘట్టంలో పోతన భావాన్ని అనుసరిస్తూనే, ఈభక్తకవయిత్రి శ్రీకృష్ణుని దివ్యమంగళ స్వరూపాన్ని మణిమకుటం మొదలుకొని పాదాంగుష్ఠం పర్యంతం మహనీయంగా భావన చేసి, ఆ దివ్యభావనను ఇరువదియైదు ద్విపదల్లో మధురంగా ఆవిష్కరించింది.

తరిగొండ వెంగమాంబ కవిత్వవిషయంలోనేగాక, స్వాభావికంగానూ పోతనామాత్యుని వంటి భక్తిరసార్ద్ర చిత్తంకల మహాత్మురాలు. పోతనవలెనే శారదాసాక్షాత్కారాన్ని పొందిన తపస్విని. శారదాదేవి అక్షరస్వరూ

పిడియై ఆకాశంనుండి దిగివచ్చి తన వదనంలో ప్రవేశించి నట్లు ఈ భక్తకవయిత్రి వేంకటాచలమాహాత్మ్యంలో వక్కాణించింది:

చ. అలఘునభంబునుండి విమలాక్షర పంక్తులరీతి వచ్చి నే
నలసత నొందియున్న తఱి నాననమందు వసించి, జ్ఞానముం
గలుగఁగఁజేసి, మానసవికారములం దొలఁగించి, జిహ్వపై
నిలిచి నటించు శారదను నిత్యము సన్నుతిఁ జేయుచుండెదన్"
-Iఆశ్వా, 5ప.

ఒక్కమాటలో, ఆంధ్రసాహితీ ప్రపంచంలో బమ్మెర పోతనకు ఎటువంటిస్థానం ఉన్నదో, అలాంటిస్థానమే ఆంధ్రకవయిత్రీలోకంలో తరిగొండ వెంగమాంబకు కలదు.

వెంగమాంబ రచించిన ద్విపద భాగవతంలోని తొలి స్కంధాలు మాత్రమే ఈనాడు వ్రాతప్రతులరూపంలో లభిస్తున్నాయి. తరువాతి స్కంధాల్లోని కొన్ని భాగాలు తప్ప, గ్రంథంపూర్తిగా లభించడంలేదు. ఈ శ్రీభాగవతం" ఏనాటికైనా సమగ్రంగా లభిస్తే, అది అటు ద్విపదవాఙ్మయశాఖకూ, ఇటు "భాగవతసారస్వనిత" కుంజానికి పుష్టిని, తుష్టిని ఒడగూర్చే మధురకావ్య ఫలమవుతుంది. నేటికి అముద్రితాలుగా నిలచివున్న ఇలాంటి ద్విపదభాగవతరచనలను,మరికొన్ని పద్య,గద్య,గేయ మయాలైన భాగవతాలను అన్నింటినీ లభించినంతవరకైనా ప్రచురించి, తద్ద్వారా తెలుగులో విలసిల్లిన "భాగవతసారస్వతం"యొక్క సమ్యక్ పరిశీలనానికి దోహదం చెయ్యడం భాషావాఙ్మయోద్ధారకుల అవశ్యకర్తవ్యం.

ఆధారాలు

1. శ్రీ మహాభాగవతము- ఆం.ప్ర. సాహిత్య అకాడమి (ప్రచురణ 1977)
2. శ్రీ మహాభాగవతము (ద్విపద)-శ్రీ వేంకటేశ్వరవిశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధన సంస్థయందలి వ్రాతప్రతి ఆర్ నెం. 2347 (పేపర్)

హారక్యాహారికం

శ్రీ సోమసుందర్

తిరిగాను....నా
తెలుగు నేల వేల గ్రామాటవులు
పురాతన కంటక పూరితాలు
పరిత్రాణా లెరుగని బాటలు....

కెరటాల చప్పట్లు చరచి
ఎలుగెత్తి పిలిచే సెలయేరులు
తీరాల మెత్తలపై విశ్రమించాను;
మృదుతర తటాల జలతారు
ఇసుక పొత్తిళ్ళలో వ్రేళ్ళు జొనిపాను....
గతజన్మల అవిచ్ఛిన్న చిహ్నాల కోసం
గాలించాను—వెర్రిగా....

వీక్షించాను....నా
పితరుల నీతి శాస్త్రాల హితోపదేశాలు
ప్రాదేశిక వైమనస్యాలుగా మారి
గుసగుసలాడుతున్న పెదవులు........
నా కాలాన్ని గమనాన్ని
అభిశంసిస్తున్న నొసళ్ళు....

నిరీక్షించాను—
బేలకిన్నులు విశ్వాసంతో సారిస్తూ
కారడవులు చిమ్మిన చిమ్మచీకట్ల కవతల
అరుణోదయం తప్పక పొడుస్తుందనీ
తరుణహృదయంతో చేతులు చాపుతుందనీ—
తలలు బోడులైన మ్రోడుల్నీ
పరార్థ ప్రాసకాలైన కీడుల్నీ
అకుంఠిత మౌఢ్యంలా నిలచిన తాళ్ళనీ
సంకీర్ణవ్యాకులత్వాల గుబురుపొదల్నీ
ఎరుపు మలాముతో ఓదారుస్తుందని
నవజీవన శుభ్రకాంతి కూరుస్తుందని
విన్నాను; విన్నదంతా నమ్మాను......
మూడు దశాబ్దాలుగా నిరీక్షించాను........

అలసి సొమ్మసిల్లినా
పాడటం, పారటం తప్పని
నిరుపేద సెలయేళ్ళనోళ్ళకు
అమృతధారలందిస్తుందని—
దిక్కులేని మొగిళ్ళకన్నీళ్ళు తుడిచి
ముంగురులు సవరించి—ముచ్చటగా
మురిపాల మురుగులు తొడుగుతుందని—
అక్కున చేర్చి సేద తీరుస్తుందనీ
కొండ కొమ్ములనెక్కి దీక్షగా
గొంతెత్తి అరచి ఉపన్యసించాను........

సంధ్యాసమయార్భటితో తల్లి పేగుకదలి,
అర్మిలి ఊర్మికగా తత్తరించ
గృహోన్ముఖమై సాగే ఆలమందల మందలింపుల,
గోపాలకుల అర్ధనగ్న సభ్యతల సందడింపుల—
సంపుటీకృత సౌందర్యం హెచ్చరించగా
మనోహర లావణ్యాలకు కందళించాను
ఆశారేఖలలో పురోగమించాను.... ....

రానున్న రాత్రీధ్వాంత స్ఫురణలో
గుండెలదర అలమటించాను.

కొండ చెరియల నిశ్శబ్దగహ్వరాలలో
పలకరించే వాగుల ప్రియభాషలలో
ఆర్తవస్ఫూర్తితో పులకించే సానువులు
అనురాగ కుసుమాల మాలల ల్లి
మధుమాస హాసాల అతిథిదేవునికోసం
తలవాకిలి నిలచి దిక్కులు వెదికే
రసహృదయినుల మధురాకృతులు
సాక్షాత్కరించగా నమస్కరించాను.......
అనురాగధారలకోసం నిరీక్షించే
అరుణాధర కోమలాంగుల ఆశీర్వదించాను.....

గ్రీష్మాతప తప్తాంగినులు కొండపాళ్ళు
కొనగోళ్లతో సుతారంగా ఒళ్ళుగోక్కునేసరికే
బ్రతుకు బ్రతుకే మంటలై రేగగా—
సముదుష్ణరక్తాగ్నికీల లెగజిమ్మగా—
వేదనావీచుల కంటి ఉదల నెగళ్ళుముంచెత్తగా
భిన్నాకృతుల ఏకీకృత భస్మరాశులను
సానునయంగా పరిశీలించాను....
మూడు దశాబ్దాలుగా తపించాను.........

కాలం ఒక కొండచిలువ
దుర్బలులను సునాయాసంగా మ్రింగుతోంది
వర్తమానం ఒక మ్రోడుమోక
నిశ్శంకగా చుట్టబెట్టు కొంటోంది—
వేటయెముకలు చూర్ణచూర్ణం చేస్తోంది.......

అందుకే అరుణోదయాల కోసం
జీవన తరుణోపాయాల కోసం—వేగాను;
మానవతాలాలిత్యాల మధుకోశాలకోసం
ప్రేమామృత సురధునుల రుచిర తరంగాలకోసం—
వెదికేకన్నులతో సాగాను........
సౌమనస్య తీరాలకోసం
కానల నభిషేకించేవానలకోసం
వేసట తీరని అంగలతో సాగాను...........

దుర్మోహ చేలాంచల విస్మరతప్ప
పూలదారి పులకించే వాన కానరాదు
సెలయేటి కలలపాటల
వాన అలికిడి వినిపించదు ....
పల్లెమొగాల ఏబ్రాసి పుసులుకడిగి
పంటనవ్వులు వెలిగించే వాన కానరాదు
మలినాశ్రు కాలుష్యాలుతుడిచి
తోట గుండెలపై మకరిక చిత్రాలు కీలించే
హర్షోత్సవ వర్షం దర్శన మీయదు!
సునిశిత నేత్రాల సుదృఢగాత్రంతో
కరవాలం వంటి సంకల్ప దీక్షతో
సూర్యసేన వంటి పురోగమన శీలంతో
మూడు దశాబ్దాలను సుదీర్ఘ పథంలో
పరుగెడుతూనే ఉన్నాను...............
మనోచాంచల్యాన్నీ
హృదయ సౌందర్యాన్నీ
కలిపి శిల్పీకరించిన హిరణ్య హరిణంవలె
నా దృక్కేంద్రాన్ని
దాటిపోతున్నది చిరవాంఛిత గమ్యం!



శ్రీ బండ్లపల్లె ఓబుళారెడ్డి

భారత ఇతిహాసంలో ప్రభుత్వార్థిక నీతి

వ్యాసభారతం ఇతిహాసంగానేకాకుండా, ధర్మశాస్త్రంగా, నీతిశాస్త్రంగా కూడ రూపొందించబడిందని నన్నయ ఆంధ్రమహాభారత కృత్యాదిలో పేర్కొన్నాడు. ధర్మరాజు మయసభలో తులదూగుతూ ఉండగా నారదుడు ఒకనాడు గగనమార్గాన అతని వద్దకు వచ్చినాడు. అతని బృందంలో పర్వత, పారిజాత, దైవత, సుముఖ మహామునులు ఉన్నారు. ధర్మరాజు నారదుని అర్ఘ్యపాద్యాది విధులతో పూజించిన పిమ్మట, నారదుడు అతనిని అనేకరాజకీయ విషయాలు అడిగి తెలిసికొన్నాడు. ఈచర్చలలో ఆధునిక పాఠకులకు ఆసక్తికలిగించే విషయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ సభాపర్వంలో చూడవచ్చును.

రాజసేవకులను ఉత్తమ, మధ్యమ, అధమ అని మూడు తరగతులుగా విభజింపవలసి ఉంటుందని నారదుడు చెప్పినాడు. వారికి తగుపనులు అప్పగించి, "అనూనముగా దగు జీవితంబు లాయత్తము సేసియిత్తెదయః"అని అడిగినాడు. జీవితంబులు అంటే జీతాలు అని అర్థం. ఈ మూడు తరగతులకు చెందిన రాజసేవకులకు సరిగా జీతాలు ఇస్తున్నావా?" అని ధర్మరాజును ప్రశ్నించినాడు. అంతే కాదు. "అయ్యయికాలముదప్పకుండగన్" అనేమాట కూడ జోడించినాడు. ఆకాలంలో ఒక్కొక్కతరగతికి నెలలో, లేక వారంలో ఒక నిర్దిష్టతిథిని జీతాలు(జీవితంబులు)ఇస్తున్నట్లు అగపడుతుంది. "ఆయాతిథులలో దయతో జీతాలు తప్పక ఇస్తున్నావా? అని నారదుని పృచ్ఛ. సకాలంలో జీతాలు ఇయ్యక పోతే ఏమిజరుగుతుందో అతడు దిగువ విధంగా హెచ్చరించినాడు:

"తమ తమ కనియెడు తతి, జీ
తము గానక, నవయు భటుల దౌర్గత్య, విషా
దములేలిన వాని కవ
శ్యము నెగ్గొనరించు నతడు శక్రుండైనన్"

ఆది వారంనాడో లేక పూర్ణిమ-అమావాస్యలనాడో జీతం ఇయ్యటానికి నిర్ణయించి, దీనిని మఱునాటికి మార్పు చేస్తే, అది కొన్ని గంటలకాలమే అయినా, సేవక బృందం ఎంతగిలగిల కొట్టుకొంటుందో నారదుడు ఈ మాటలద్వారా విశదీకరించినాడు. "తమ తమకని యెడుతలు" అంటే నిర్దిష్టకాలం (వారం, తిథి) అని అర్థం, నిర్ణయించిన తిథిని జీతాలు బట్వాడా చేయకపోతే, ఆరాజు ఇంద్ర సమానుడే అయినా, అతనికి కీడు కలిగిస్తుందని హెచ్చరించినాడు. సేవకులు పనిలో ఆలస్యంచేస్తే (నేటి పరిభాషలో "గోస్లో" సమ్మెచేస్తే) ఎన్నో అవాంఛనీయ పరిణామాలు ఏర్పడతాయని అర్థం.

నారదుడు తన ప్రసంగంలో "కులపుత్రుల" ను ప్రస్తావించి, వారిని ఎందుకు సత్కరించవలెనో నొక్కివక్కాణించినాడు. రాజుకోసరం "కులపుత్రులు" తమ ప్రాణాలను విడవటానికైనా సిద్ధం అయి ఉండటమే దీనికి కారణం.

"కుల పుత్రులైన సద్భృ
త్యులకును సత్కారమర్థితో జేయుదె, వా
రలు నీ ప్రవస్తవమునని
మ్ముల గృతము దలంచి ప్రాణములువిడుతురనిన్."

"కురురాజు మన్నన యప్పుడీర్తు ప్రాణమాన పడక" అని తిక్కన కర్ణునిచేత చెప్పించిన విషయం పాఠకులకు గుర్తు ఉంటుంది. రాజు ఉప్పు, పులుసు తిన్నవారు కాబట్టి ఈ మేలును తాము ఎల్లప్పుడూ మరువరని, అతనికోసరం, అవసరం అయితే ప్రాణాలను సైతం బలిచేస్తారని అర్థం. వంశపారంపర్యంగా నిలిచిన సేవకలు "కుల పుత్రలు". నారదుడు తన ప్రసంగంలో సైనిక బృందాన్ని, వారిని ఆశ్రయించినవారిని కూడ ప్రస్తావించి, వారిని ప్రత్యేక శ్రద్ధతో చూడవలెనని కోరినాడు.

"అనఘా, నీ ప్రపన్నమున
నని నీల్గిన వీరభటుల యనుపోష్యుల నె
ల్లను బ్రోతె? భోజనాచ్ఛా
దనముల, వారలకు నెమ్మిదఱుగక యుండన్?"

యుద్ధంలో వీరమరణంచెందిన భటులను ఆశ్రయించి ఎందరో ఉంటారు. అట్టివారిని "అనుపోష్యుల"నిపేర్కొన్నాడు. వారందరికి తిండి, బట్ట "తరుగక" ఉండేటట్లు చూడుమని కోరినాడు. ఒకేసారి ఏదో కొంత నష్టపరిహారమో. నెలవారీ పింఛనో వారి మొగాన పారవేయటం వంటిది కాదు ఇది. అమరవీరుల కుటుంబాలకు వారి జీవితాంతం తిండి, బట్ట "తఱుగని" విధంగా ఇచ్చి తద్వారా అమరవీరులను అను నిత్యమూ స్మరించటం ఇది. దీనినిబట్టి ప్రాచీన కాలంలో సైనిక కుటుంబాలను ప్రత్యేక శ్రద్ధతో చూచే సత్సంప్రదాయం ఉన్నట్లు అగ పడుతుంది.

నారదుడు తన చర్చలలో కర్షకుల, వణిక్ప్రముఖుల సమస్యలనుకూడ తడివి, తగు సూచనలు చేసినాడు.

"హీనులగు కర్షకులకును,
భూనుత, ధాన్యంబు బీజములు, వణిజులకున్
మానుగ, శతైక వృద్ధిన
నూనముగా ఋణములిత్తె? యుత్తమ బుద్ధిన్?"

"హీనులగు కర్షకులు" అంటే ధాన్యం విత్తనాలు లేమి చేత అని అర్థం. అట్టి వారికి ఉత్తమ బుద్ధితో, ఉదార భావంతో ఉచితంగా విత్తనాలు సరఫరాచేసి, అధికోత్పత్తికి చేయూత నిమ్మని నారదుడు నొక్కి చెప్పినాడు. మోతుబరి లేదా ధనిక రైతుల ప్రసక్తి తీసికొని రాకుండా, ధాన్యం విత్తనాల చేత "హీనులగు కర్షకులను" మాత్రమే అతడు ప్రస్తావించినాడు. అంతేకాదు. రాజు తన ధనాగారంనుండి డబ్బు విడుదల చేసి, ఇతోధిక వాణిజ్యం నెరపటానికి వీలగా మారు వడ్డీబేరానికి కాదు–వణిక్ప్రముఖులకు ఋణాలు ఇమ్మని కోరినాడు. అయితే వడ్డీరేటు ఎంత? నేటి వ్యాపారులు ఒకరి మొగం ఒకరు చూచుకొనే అంత! అది 'శతైక వృద్ధి'! ("వృద్ధి" శబ్దమే "వడ్డీ"గా మార్పు చెందింది) అంటే నూటికి ఏడాదికి నూఱు అని అర్థం. ఇంత వడ్డీరేటు పెట్టి, వారు వ్యాపారం లాభసాటిగా జరుపుకొనటంగాని, అసలు, వడ్డీ సకాలంలో చెల్లించటంగాని సాధ్యమేనా? అని పాఠకులు అడుగవచ్చు. ఆ కాలంలో విదేశాలతో వాణిజ్యం బాగా జరిగింది. అనేక రాజధానీ నగరాలలో రత్నాలు రాసులు పోసి అమ్మిన ఘటనలు ఉన్నాయి. పరదాస్యంలో ఇవన్నీ హరించుకొని పోయినాయి. ఈ వడ్డీ రేటు ఆ కాలంలో సరసంగానే ఉన్నట్లు అగపడుతుంది. చైనా "హిస్టారికల్ రికార్డ్సు"ను బట్టి దాదాపు ఇదే కాలంలో ముప్పయి నుండి మున్నూఱు శాతం వరకు వడ్డీ రేటు ఉన్నట్లు తెలుస్తుంది.

నారదుడు అవిటివారిని (వంగుల), మూకాంధుల (మూగవారిని, గ్రుడ్డి వారిని), వికలాంగులను, ఆ విధంగానే అబాంధవులను (అర్ఫన్స్–దిక్కులేని వారిని) దయతో కాపాడమని ధర్మరాజును కోరినాడు. వీరి రక్షణకు ఆ కాలంలో ఎట్టి ఏర్పాట్లు చేసినారో తెలియదు. నేటివలె అనాథ శరణాలయాలు – అవి నామమాత్రం అయినా సరే-ఉన్నట్లు అగపడదు. కాలాంతరంలో మఠాలు ఏర్పడినాయి. ఆ కాలంలో కూడ దొంగలతో లాలూచీ పడి, వారి నుండి డబు గుంజి, వారిని కాపాడే రక్షక భటులు ఉన్నట్లు నారదుడు చెప్పిన చర్చలద్వారా వెల్లడి కాగలదు.

"చోరభయ వర్జితముగా
ధారుణి బాలింతె? యధిక ధనలోభమునం
జోరుల రక్షింపరుగా
వారలచే ధనముగొని భవద్భృత్య వరుల్?"

రాజు నెలవారీఇచ్చేజీతంకాకుండా, "పై సంపాదన"కు అంటే-"అధిక ధనలోభమునకు" రక్షక భటులు పాల్పడుతూ ఉండేవారని అర్థం. దొంగలను పట్టుకొనటానికి పొమ్మంటే, వారు దొంగలకే "లైసెన్సు" ఇచ్చి వచ్చేవారు.

"మా మామూలు మాకు ఇచ్చి, ఆ మీదట మీ ఇష్టం వచ్చినట్లు చూచికొనండి!" అని వారు అన్నట్లు అగపడుతుంది.

నారదుడు తన ప్రసంగంలో ఆదాయ వ్యయాలను కూడ ప్రస్తావించినాడు. "ఆ యంబునందు నాలవ భాగ మొండె. మూడవ భాగముండెనందర్థమొండెగాని మిక్కిలి సేయుగాదు వ్యయంబని" తెలిపినాడు. రాజు ధనాగారం ఎల్లప్పుడూ మిగులుబాటులో ఉండవలెనని, "లోటుబడ్జెట్" కూడదని దీని అర్థం. ఆ యుధాగారాలకు ధనాగారాలకు, గజశాలలకు, అశ్వశాలలకు, భండారాలకు మిక్కిలి విశ్వాసపాత్రులైనవారిని అధ్యక్షులుగా నియమించవలెనని సలహా ఇచ్చినాడు.

"గురుల, వృద్ధ, శిల్పి, వర వణిగ్బాంధవ జనుల, నాశ్రితులన ,సాధుజనుల, గరుణబేదటీకము నొరయకుండగ బ్రోతె?" అని నారదుడు అడిగినాడు. "పేదటీకము నొరయ కుండగ" అంటే రాజులు వీరికి "వృద్ధాప్యపించనులు" ఇచ్చి నారు అనుకొనరాదు వీరికి అగ్రహారాలు ఇయ్యటం మొదలైన వాటిద్వారా ఏదో జీవనోపాధి కల్పించి ఉంటారని ఊహింపవచ్చు.

నారద మహర్షి "వార్త"ను ప్రస్తావించినాడు.

"వార్తయందు జగము వర్తిల్లుచున్నది,
యదియులేని నాడ యఖిల జనులు
నంధకార మగ్నులగుదురు, గావున
వార్త నిర్వహింప వలయు బతికి"

బౌద్ధ,జైనమతాలు ఆచరణలో "వార్త"కు తొలిప్రాధాన్యత ఇయ్యకుండా, సన్యాసాశ్రమానికే ఇచ్చినాయి. జైన ప్రముఖుడు ఉమాస్వాతి (మి) తన "ప్రశమరతి ప్రకరణమ్" లో "వార్తా" కు చేసిన భాష్యం ఇది:

యా చేహ లోకవార్త శరీరవార్తా తపస్వినాం యాచ!
సద్ధర్మచరణ వార్తా నిమిత్తకం తద్వ్యయ మ పిష్టమ్

"వార్త"కు రెండు అర్థాలు: ఒకటి జీవనం, రెండు మాట. సేద్యం, పశుపోషణ, వ్యాపారం మొదలైనవి "లోక వార్త" అని పిలువబడతాయి (భిక్షుకుడు సాధువు) తన కాలంలో కేవలం శరీరం నిలుపుకొనే నిమిత్తం భోజనాన్ని యాచిస్తూ తిరుగుతాడు. ఇది "లోకవార్త".ఎందుకంటె భోజనం లేకపోతే జీవయాత్రే దుర్లభం అవుతుంది; శరీరం నిలవదు శరీరం లేకపోతే ధర్మాచరణ ఉండదు.. ధర్మాచరణ-శరీరస్థితి పరస్పర సంబంధం కలవి. శరీరస్థితికి కారణం లోకవార్త. పరంపరను బట్టి లోకవార్తకూడ ధర్మాచరణ ప్రవృత్తికి కారణం అవుతుందని జైనుల అభిప్రాయం. నన్నయ "గృహస్థ జీవనం" అనే అర్థంలో "వార్త" ను ప్రయోగించినట్లు అగపడుతుంది. గృహస్థ జీవనం లేకపోతే సమస్త ప్రజలూ అంధకారమగ్నులు అవుతారని నారదుడు హెచ్చరించినాడు. దీనినిబట్టి వైదికులు గృహస్థజీవనానికి తొలి ప్రాధాన్యత ఇచ్చినట్లు బోధ పడుతుంది.

తిక్కన భారతాన్నిబట్టి ప్రజలవద్దపన్ను (అరి) అరవ పాలు స్వీకరింపవలసి ఉంటుంది. పన్ను వసూళ్ళకై కఠిన చర్యలు తగదని నొక్కి చెప్పినాడు.

"అరియాఱవ పాలుగొనచు
గరుణ గలిగి ప్రజల దండ్రిగతి మధ్యస్థా
దరణంబున బాలించుట
పరమ పదము చేర్చు; విడుపు భయసంశయముల్"
(శాంతి 1-176)

"పరుసదనము మెయిగరి గొన
జొర దగ, దది పొదును గో యుచొప్పగు, విను, పా
ల్గురియించు కొనదలంచిన
నరయవలదెగోవు, ప్రజయునటి దయఃధిపా"
(శాంతి 2-299)

ఈ అభిప్రాయాన్నే తిక్కన మఱింత విశదీకరించి "బొగ్గులకు వోలె మొదలంట బొడువజనదు" అని విదుర నీతిలో చెప్పినాడు.

శాంతి పర్వంలో మఱొకచోట -


"కోరి తోటవాడు కుసుమఫలంబులు
గోయునట్లు రాజుగొనగవలయు
వవ్వనములు నటికి యంగారములుసేయు
భంగియైన భూమి పాడుగాదె?" (శాంతి 2-300)

"మేదినీ ప్రజల నత్యాదరంబును గరుణాతిశయంబు మధ్యస్థతయును గలిగి బిడ్డల నరసిన కరణి గాఢ రక్షణం బొనరించుట" "అశ్వమేధ ప్రముఖా ధ్వరంబులు పెక్కులాచరించుటకంటె నధికము" అని ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో చెప్పినాడు. (అశ్వ 1-77)

ధనధాన్యాలు, పశుసంపద అధికంగా గల వైశ్యుడు యజ్ఞం చేయకుండాపోతే, అతని సంపదను రాజు వశపరచుకొని, బ్రాహ్మణయజ్ఞానికి ఉపయోగింపవలసి ఉంటుందని (శాంతి 2-431), తాను కుడువకుండా, ఇతరులకు సైతం పెట్టకుండా శూద్రుడు కూడబెట్టిన బంగారాదులో, ధాన్యంలో సగభాగాన్ని రాజు స్వాధీనపరచుకొని, ధర్మకార్యాలకు ఉపయోగింపవలసి ఉంటుందని (శాంతి 2-432) తిక్కన భారతంలో పేర్కొనబడింది.

రాజు దేశబలాన్ని ఆరు భాగాలుగా విభజింపవలసి ఉంటుందని ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో చెప్పినాడు. ఆ బలాలు ఇవి : మూలబలం, మొత్తాలవారు, మిత్రబలం, శత్రుబలం, కాననబలం, కైజీతగాండ్రు (ఆశ్రమ 1-73)

"భృత్యుల బ్రోవమి"-అంటే సేవకులను కాపాడకుండా పోవటం "పాపం" అని భారతం పదే పదే చెప్పింది. కాని ఈ నీతులు ఎంతవరకు ఆచరణలోనికి వచ్చినాయో మనకు తెలియదు.



జ్ఞానప్రసూనాంబిక

కే. కిశోర్‌బాబు

కే. అశోక్‌బాబు

మల్లికువ చేత
మత్తిల్లిన వాణ్ణి
వరిపరి విధాలుగాను
ఉల్లాపింప జేస్తుంది!
అమృత వంతునిగాను
మహాదేవునిగాను
సర్వజ్ఞునిగాను
భాసింప జేస్తుంది!
ద్యుతింప జేస్తుంది!
వాసింప జేస్తుంది!
ఉత్తమ గ్రంథం!
అది
జ్ఞాన ప్రసూనాంబిక!



"చాణుక్య"

న్యాయమూర్తుల బదిలీ సమస్యా సుప్రీంకోర్టు చారిత్రాత్మక నిర్ణయం

ఇప్పుడు డిసెంబరు 30న వెలువడిన చారిత్రాత్మకమైన తీర్పులోని ముఖ్యాంశాలను గమనించుదాం దీనికున్న ప్రాముఖ్యతను బట్టి, ఏడుగురు న్యాయమూర్తులు ఈ వ్యవహారాన్ని విన్నారు, ఏడుగురూ తమతమ అభిప్రాయాలను వివరంగా వ్రాశారు. అందరి కంటె చిన్నతీర్పు ఎ. సి. గుప్తాది 11 పుటలయితే, పెద్ద తీర్పు వెంకట్రామయ్యది 117 పుటలు. ఈ ధర్మాసనంలో మొదటివాడైన భగవతీ తీర్పు 05 పుటలుంది.

అచ్చులో 495 పుటలు, 1258 పేరాలుగా తయారయింది. వివిధ దేశాలకూ, మన న్యాయస్థానాలకు సంబంధించిన 170 తీర్పులూ, అవికాక అనేక న్యాయ, రాజకీయ, సాంఘిక శాస్త్ర గ్రంథాలు పరిశీలించబడ్డాయి.

శ్రీయుతులు యల్.యస్. సిన్హా (అటార్నీ జనరల్) పరాశరన్ (సొలిసిటర్ జనరల్) సోలీసొరాబ్జీ, తార్కుండే' డాక్టర్.సంఘ్వీబోటి అనేక మంది ప్రముఖ న్యాయవాదులిందులో వాదించారు.

ఈ వివాదం, ఈ క్రింది పరిస్థితులలో సుప్రీంకోర్టు ముందుకొచ్చింది.

18 మార్చి 981న నాటి న్యాయశాఖా మంత్రి శివశంకర్ రాష్ట్రాల ముఖ్య మంత్రులకు ఒక లేఖ వ్రాశారు. తమతమ రాష్ట్రాలలోని హైకోర్టులలో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న వారినుంచీ, లేదా ఎవరి పేర్లు న్యాయమూర్తులుగా నియమింపబడటానికి పంపబడ్డవో వారి నుంచి అంగీకారాన్ని పొందమన్నాడు. దేశంలోని ఏ హైకోర్టులో తమను శాశ్వత న్యాయమూర్తిగా నియమించినా తమకు అభ్యంతరం లేదనీ, తమ అంగీకారాన్ని సూచించే 3 ప్రాంతాలను సూచించమనీ.

ఈ ఉత్తరంమీద బొంబేలో న్యాయవాదులైన వారు ఒక రిట్ వేశారు. ఇందులో ప్రముఖుడు స్వర్గీయ ఎం. సి. చాగ్లా కుమారుడు ఇక్బల్ చాగ్లా. ఇదే ఉత్తరాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ప్రముఖ న్యాయవాది తార్కుండే ఒక రిట్ వేశాడు. జె. యల్. కార్లా ఇంకా కొంతమంది న్యాయవాదులు ఢిల్లీ హైకోర్టులో మూడవ రిట్ పిటీషను వేశారు ఢిల్లీ హైకోర్టులో పేరుకుపోయిన వివాదాల సంఖ్యనూ, అక్కడి న్యాయమూర్తుల సంఖ్యనూ గురించి కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి, ఎంతమంది శాశ్వత న్యాయమూర్తులు, ఎంతమంది అదనపు న్యాయమూర్తులు కావాలో నిర్ణయించి అంతమందినీ నియమించవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆ రిట్ కోరిక.

శ్రీ తార్కుండే రిట్‌లో కొన్ని విశేషాలున్నాయి. వొహ్రా, కుమార్, వాడ్‌లు ముగ్గురూ ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా 1979 మార్చి 7న నియమింపబడ్డారు. పదవీకాలం2 సంవత్సరాలు. తరువాత తిరిగి 3 మాసాలపాటు నియమింపబడ్డారు. ఆ కాలమూ 7 జూన్‌తో ముగుస్తుంది. తిరిగి ఒక్క వాడ్ మట్టుకు మళ్ళీ ఒక సంవత్సర కాలం పాటు నియమింపబడ్డారు. వొహ్రా, కుమార్‌లకు నియామకాలు లేవు. వారు పదవీచ్యుతులయ్యారు. తార్కుండే తనరిట్‌లో ఈ విషయాలను ప్రస్తావించాడు, కుమార్, వొహ్రాలను ప్రతివాదులుగా చేర్చాడు. వొహ్రా విచారణలో పాల్గొనలేదు, కుమార్ అఫిడవిట్ దాఖలుచేసి విచారణలో పాల్గొన్నాడు.

అలహాబాద్ హైకోర్టులోనూ మురళీధర్, వర్మ, మిత్తల్, ముగ్గురు అదనపు న్యాయమూర్తులున్నారు. వారిని శాశ్వత న్యాయమూర్తులుగా భావించవలసిందంటూ, అలహాబాద్ హైకోర్టులో ఎస్. పి. గుప్తా అనే న్యాయవాది ఒక రిట్ వేశాడు. అది నాల్గవది.

జనవరి 1981లో రాష్ట్రపతి మద్రాసుహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఇస్మాయిల్‌ను కేరళహైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీచేశారు. సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తిలో ఉన్న కుమారి లిల్లీ థామస్, దీనిని సవాల్‌చేస్తూ ఒక రిట్ వేసింది. ఇది అయిదవ రిట్. అయితే ఇస్మాయిల్ తన పదవికి రాజీనామా చేయటంలో ఆ రిట్ వృథాఅయినట్లు లెక్క.

మద్రాసు హైకోర్టులోని న్యాయవాది రాజప్ప ఇంకొక రిట్ వేశాడు. ఇది ఆరవది. ఇందులో కేవలం ఇస్మాయిల్‌ను బదిలీని సవాల్ చేయటమే కాకుండా, అయన స్థానంలో పాట్నా హైకోర్టునుంచి కె. బి. యన్. సింగు నియమకాన్ని కూడా సవాల్ చేశాడు.

మద్రాసు హైకోర్టులోని న్యాయవాది సుబ్రమణ్యం దాదాపు ఇలాంటి కారణాలతోనే ఇంకొక రిట్ వేశాడు. అది ఏడవది.

పాట్నా హైకోర్టునుంచి సింగ్‌ను బదిలీ చేయటంమీద పాట్నా హైకోర్టు న్యాయవాదులిద్దరు పాండే, ఠాకూర్ రమాపతి సిన్హాలు ఒక రిట్ వేశారు. ఇది ఎనిమిదవది.

దాదాపుగా విషయాలన్నీ ఒకటే కాబట్టి ఈ ఎనిమిది రిట్లూ సుప్రీంకోర్టుముందు విచారణకొచ్చాయి. వివిధహైకోర్టులలో దాఖలయినవి కూడా సుప్రీంకోరుకే వచ్చాయి.

ఈ వ్యాసంలో క్లుప్తంగా న్యాయమూర్తుల బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు ఏ విధంగా అభిప్రాయపడిందో తెలుసుకుందాం. ఏడుగురు న్యాయమూర్తులలో ఒక్క భగవతీ తప్ప అందరూ న్యాయమూర్తులకు బదిలీలు ఉండవలసిందనే అభిప్రాయాన్నే వెలిబుచ్చారు. ముఖ్యంగా వెంకట్రామయ్య, ఫజల్‌అలీలు దీనికి చాలా వివరణలను సోదాహరణంగా ఇచ్చారు.

న్యాయమూర్తులకు బదిలీలు ఉండాలి అనే దానికి పెద్ద చరిత్ర ఉంది. అది 1949లో రాజ్యాంగ నిర్మాణానికి జరిపిన చర్చలోనే బయటపడి, చివరకు 1981 డిశెంబరు నాటి ఈ తీర్పుతో, అభ్యంతరాలేమీ లేవని నిర్ణయింపబడటంతో చర్చారంగానికి సంబంధించినంత వరకు అవనిక దిగింది.

ఇక అమలు జరపటమంటారా, అది ప్రభుత్వంవారి తీరికమీద ఆధారపడి ఉంటుంది.

1. ఇప్పుడు బదిలీలను గురించినచరిత్రనుపరిశీలిద్దాం

ఎవరు ఏది చెప్పినా, రాజ్యాంగ నిర్మాణసభ (కాన్స్టిట్యుయంట్ అసెంబ్లీ)లోని చర్చలే అందరికీ మార్గదర్శకాలు. మన రాజ్యాంగనిర్మాతల మనస్సుల్లో ఏ భావాలున్నదీ ఆ చర్చలలో విదితమవుతుంది. దీనికి మూలపురుషుడూ, మన ఆధునికమనువూ అయిన డాక్టర్ అంబేద్కర్ మాటలను స్మరించుకోక తప్పదు. న్యాయమూర్తులు ఫజుల్ అలీ. వెంకట్రామయ్యలు అదే చేశారు.

ఇప్పుడు న్యాయమూర్తులను బదిలీచేసే అధికారం కేంద్రప్రభుత్వానికి ఆర్టికల్ 222 ప్రకారం ఉంది. దానిని గురించిన చర్చలో డాక్టర్ అంబేద్కర్ ఈ విధంగా అన్నాడు. "ఇకనుంచీ హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలన్నీ కేంద్రప్రభుత్వం ద్వారా జరుగుతాయి. ఐ. సి. యస్. ఎలా ఒకే వ్యవస్థో (కడర్) అలాగే హైకోర్టు న్యాయమూర్తులందరినీ ఒకేవ్యవస్థగా భావించి, వారిని ఒక రాష్ట్రంనుంచి ఇంకో రాష్ట్రానికి బదిలీచేయాలి అలాంటి అధికారం కేంద్రం తన చేతిలో ఉంచుకొనక పోతే, న్యాయపరిపాలన అనేది చాలా కష్టం కావచ్చు. ఒకప్రాంతంలో కావలసినంత మేధా సంపత్తి తరుగయితే, ఆ ప్రాంతానికి మరొకచోటి నుంచి న్యాయమూర్తులను బదిలీచేసి ఆహైకోర్టును బలపరుచవచ్చు. రెండవది. ఒక్కొక్కసారి ప్రాంతీయరాజకీయాలు, ప్రాంతీయ దురభిమానాలు లేని వ్యక్తిని, బయటి ప్రాంతంనుంచి తెచ్చి ఒక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించటం మంచిదనిపించవచ్చు కాబట్టే ఈ బదిలీ అధికారాలు కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉండాలని మేము భావిస్తున్నాం." ఈ విషయాలను డా. అంబేద్కర్ చెప్పింది 1949లోనే సుమా! (కర్తింపు న్యాయమూర్తి ఫజుల్ అలీ ది)

2. 1955లో రాష్ట్ర పునర్నిర్మాణ సంఘం తన నివేదికను సమర్పించింది ఇది విజ్ఞుల సంఘం. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీవిరమణ చేసి, ఒరిస్సా గవర్నరుగా ఉన్న

సయ్యద్ ఫజుల్ అలీ దానికి అధ్యక్షుడు, సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ అధ్యక్షుడూ, వాటి కౌన్సిల్ ఆఫ్‌స్టేట్స్ సభ్యుడూ అయినపండిట్ హృదయనాథకుంజ్రూ ఒక సభ్యుడు. ఈజిప్టులో మనదేశపు రాయబారిగా పనిచేస్తున్న సర్దార్ కె. యం. పణిక్కర్ రెండవ సభ్యుడు. ఈ సంఘమూ ఇదే విషయాన్ని నొక్కి చెప్పింది.

రాష్ట్రాల పునర్నిర్మాణము, విభజన అంటేనే దేశంలో ప్రాంతీయ తత్వాలను రెచ్చగొట్టటం.కాబట్టే ఈ సభ్యులు దేశ భద్రత, సుస్థిరత, ఆరోపణలకు తావీయనటువంటి పరిపాలన లను మనస్సులో ఉంచుకొని అనేక సూచనలు చేశారు. అప్పటికి సుప్రీంకోర్టులూ, ఈ తతంగాలు, ఎమర్జన్సీలు ఎవ్వరి అంతరంగాల్లోనూ ఉండలేదుగదా! అయినా ముందు చూపుతో వారీవిధంగా అన్నారు: "రాజ్య నిర్మాణంలోని ముఖ్య అంగాలన్నీ ప్రజలలో ప్రభుత్వం పట్ల నమ్మకాన్ని కలిగించే విధంగానూ, విచ్ఛిన్నకర ధోరణులను అరికట్టేటట్లు గానూ ఉండాలన్నదే మా ముఖ్యోద్దేశ్యం. అందుకనే, ఒక హైకోర్టులోని న్యాయమూర్తులలో కనీసం మూడవవంతు బయటి ప్రాంతాలవారుండాలని మేము సిఫార్సుచేస్తున్నాం. హైకోర్టు న్యాయమూర్తులనియామకాలలో,వారిసామర్థ్యమూ, వృత్తిలో వారికిగల అనుభవమే ప్రధానంగా ఉండాలి. మా సిఫార్సువలన న్యాయమూర్తుల ఎన్నికకు ఇంకా విస్తృత మైన రంగం లభ్యమవుతుంది. (ఎక్స్‌టెండ్ ది ఫీల్డ్ ఆఫ్ ఛాయిస్) అంతేకాదు, సివిల్ సర్వీస్‌వలెనే ఈ న్యాయ మూర్తుల నియామకాలు కూడా 'రెగ్యులేట్' అవుతాయి."

అంతేకాదు. నివేదిక చివర తమ సిఫార్సుల,అంతిమ నిర్ణయాల జాబితాలో కూడా స్పష్టంగా ఈ విధంగా పక్కా టించారు. "58. ఒక రాష్ట్రంలోని హైకోర్టు న్యాయమూర్తు లలో కనీసం మూడవవంతు న్యాయమూర్తులైనా బయటి రాష్ట్రాలలో నియమింపబడినవారై ఉండాలి." ('షుడ్ కన్సిస్ట్ ఆఫ్' సుమా వాడిన భాష.)

3. ఇంతలో 1958లో 14వ లాకమీషను నియామకం జరిగింది. అధ్యక్షుడుగా, అటార్నీ జనరల్‌గా పదవీ విరమణ చేసిన ఎం.సి. సెటల్వాడ్‌ను నియమించారు. ఆ లాకమిషన్ తన నివేదికలో ఇలా స్పష్టంగా పేర్కొంది: "ఒక హైకోర్టు న్యాయమూర్తులలో కనీసం మూడవవంతు బయటిప్రాంతాల న్యాయమూర్తులుండాలని" ఊహించిన రాష్ట్రపునర్నిర్మాణ సంఘపు ఊహలు తప్పక నిజంకావాలని శేమాశిస్తున్నాం."

అయితే రెండవ విషయంలో ప్రతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బయటివాడే ఉండాలి అనే విషయంలో, కొంచెం తటపటాయింపును చూపింది.

తమ ముందు అభిప్రాయాలను వెలిబుచ్చిన వారిలో అనేకమంది, ప్రధాన న్యాయమూర్తి ఇంకొక ప్రాంతపు వ్యక్తిగా ఉండటం మంచిదని చెప్పారనీ,తాము చెప్పబోయే పోలిక అంతగా ఈ విషయానికి సంబంధించింది కాక పోయినా, రాజ్యాంగం అమలులోకివచ్చినప్పటినుంచీ రాష్ట్రా లకు గవర్నర్లను బయటివారినే నియమించటాన్ని ఈ సంద ర్భంలో పేర్కొనవచ్చు అంటూ సూచించారు.

4. 1963 సెప్టెంబరులో పరిపాలనా సంస్కరణల సంఘము ఒక "స్టడీటీమ్"ను నియమించింది. ఆ టీమ్‌కూడా ఈ పై సూచనలను బలపరిచింది.

జాతీయ సమైక్యతా సంఘము (నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్) 31 ఆగస్టు 1964 న సమావేశమై పైనిర్ణయాలను పునరుద్ఘాటించింది.

పరిపాలనా సంస్కరణల సంఘపు "స్టడీటీమ్" తిరిగి 1967 లో సమావేశమై మూడవవంతు న్యాయమూర్తుల విష యమై స్పష్టంగా తీర్మానించింది.

5. 1978లో ఇంకొక లా కమీషను నియామకం జరి గింది. అది ఒక ప్రశ్నావళిని పంపి, సమాధానాలు కోరింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెప్టెంబరు 79న తాను పంపిన సమాధానాలలో, బయటిప్రాంతపువ్యక్తి ప్రధాన న్యాయ మూర్తిగా ఉండాలి అనే దానికి, మూడవవంతు న్యాయ మూర్తులు బయటివారుండాలనే దానికి కూడా తన ఆమో దాన్ని తెలిపింది.

6. ఫిబ్రవరి 1979లో నేటి శివశంకర్, ప్రతిపక్షసభ్యుడు మాత్రమే. నాడు శ్రీమతి ఇందిరాగాంధీ అజ్ఞాతవాసంలో ఉంది. ప్రతిపక్షసభ్యుడుగా మాట్లాడుతూ, శ్రీ సెటల్వాడ్ పల్కీవాలా వంటి న్యాయశాస్త్రవేత్తలచేతచేయబడినసిఫార్సు

లను వెంటనే కేంద్రప్రభుత్వం అమలులోకితేవాలనీ, తద్వారా జాతీయ సమైక్యతకు దోహదంచేయాలనీ శివశంకర్ కోరాడు.

1980 ఎన్నికలలో పరిస్థితులుతారుమారయ్యాయి ఆ శివ శంకరే న్యాయశాఖామాత్యుడయ్యాడు. 1980 జూన్‌లో కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ సలహాసంఘం [కన్సల్టేటివ్ కమిటి] సమావేశమై ఈ రెండు విషయాలను గురించి తిరిగి ఏక గ్రీవంగా తీర్మానించింది. ఇందులో ప్రతిపక్షాలకు చెందిన లోకసభాసభ్యులుకూడా ఉన్నారు సుమా! అలాగే జూలై - డిసెంబరులలో కూడా ఈ సంఘం సమావేశమై తీర్మానాలు చేసింది.

వీటన్నిటిఫలితంగానే 1981 మార్చిలో శివశంకర్ అన్ని రాష్ట్రాలకూ ఆ ఉత్తరాన్ని వ్రాయడం జరిగింది.

7. 80వ లాకమిషన్ రిపోర్టుకూడా 1980లోనే వుంది. దీనికి అధ్యక్షుడు శ్రీ హెచ్. ఆర్. ఖన్నా. (1982 లో రాష్ట్ర పతి పదవికి ప్రతిపక్షాల అభ్యర్థి]

శ్రీ ఖన్నా పూర్తి ప్రజాస్వామికవాది సుమా !

1975 జూన్ 27న రాష్ట్రపతి అత్యవసర పరిస్థితి ప్రక టించిన తరువాత, 226వ అనుచ్ఛేదము ప్రకారం పౌరులకు హైకోర్టుకెళ్ళే అధికారాన్ని రాష్ట్రపతి 359 వ అనుచ్ఛేదం ద్వారా "సస్పెండు" చేసినా, 21వ అనుచ్ఛేదంద్వారా ఆహక్కు ప్రజలకుందని కర్నాటక, బాంబే (నాగపూర్), అలహాబాద్, మద్రాసు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా న్యాయస్థానాలు తీర్పుల నిచ్చాయి. దానికిగాను ఒక్కొక్క న్యాయస్థానం ఒక్కొక్క కారణాన్ని చూపాయి.

ఈ తీర్పులమీద కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీలుకు పోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలకు తమ స్వాతంత్ర్యానికీ, ప్రాణాలకు (లైఫ్ అండ్ లిబర్టీ) గల హక్కు 21వ అనుచ్ఛేదంద్వారా మాత్రమే లభ్యమవుతుందనీ 359వ అనుచ్ఛేదంద్వారా రాష్ట్రపతి ఆ హక్కును సస్పెండు, చేయటంవలన ఇంకే విధమైన హక్కులూ ప్రజలకు లేవని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

అది నలుగురు న్యాయమూర్తుల మెజారిటీ తీర్పు. నాటి ప్రధాన న్యాయమూర్తి రే, తరువాత ప్రధాన న్యాయ మూర్తి అయిన బేగ్, నేటి ప్రధాన న్యాయమూర్తి చంద్ర చూడ్, నేటి సీనియర్ న్యాయమూర్తి భగవతీ-ఆ నలుగురు న్యాయమూర్తులు.

వారితో భేదించిన ఏకైక న్యాయమూర్తి శ్రీ ఖన్నా ఖన్నా ధోరణి వేరు విధంగా నడిచింది. ప్రజలు లేదా భారత పౌరుల ప్రాణాలు, స్వాతంత్ర్యం కేవలం 21వ అనుచ్ఛేదం దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడి ఉన్నవా? ఆ అనుచ్ఛేదం "సస్పెండు" అయితే వీరు ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడాలా అనే మీమాంస మొదలుపెట్టి, వేరు నిర్ణయాని కొచ్చాడు.

చారిత్రాత్మకమైన ఈ తీర్పు 1976మేలో వెలువడింది. 1977 జనవరి మాసాంతంలో తనను కాదని శ్రీ బేగ్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించడంతో శ్రీ ఖన్నా రాజీనామా చేశాడు.

ఈ గతాన్నంతా త్రవ్వటం శ్రీఖన్నా "బాక్ గౌండ్" నూ ఆయన ఆలోచనా ధోరణిని సూచించేందుకే సుమా !

ఆ ఖన్నాకూడా తన రిపోర్టులో ఈ మూడవ వంతు బయటివారే ఉండాలనే సూచనను పూర్తిగా బలపరిచాడు.

8. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టువారు 1980 అక్టోబరులో అహమ్మదాబాద్‌లో న్యాయమూర్తుల నియామ కాన్ని గురించి ఒక సెమినార్ జరిపారు. ఈ సెమినార్‌కూడా న్యాయమూర్తుల బదిలీలను బలపరుస్తూ తీర్మానించింది.

9. న్యాయ మంత్రిత్వ సలహా సంఘం తిరిగి 1981 సెప్టెంబరులో సమావేశ మయింది. అందులోని సభ్యులు శ్రీయుతులు నందా (కాంగ్రెస్-యస్) యస్. సి. మొహంతా (లోకదళ్) జమీల్-ఉర్-రహమాన్ (కాంగ్రెస్) దండపాణి (డి. యం. కె.) హరినాథ మిశ్రా (కాంగ్రెస్) భోగేంద్ర ఝూ (సి. పి. ఐ)- వీరంతా ఈ బదిలీల ధోరణిని బలపరిచారు.

ఈ ధోరణులన్నిటి ఫలితంగానే 1981 మార్చిలో శ్రీ శివశంకర్ సర్క్యులర్ వెలువడింది.

నిజానికి హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేయుటానికి రాజ్యాంగ సంబంధమైన ఆటంకాలేమీ లేవని మన సుప్రీంకోర్టు 1977లోనే నిర్ణయించింది.

అత్యవసరపరిస్థితి సమయంలో-1976 మేలో-నాటి గుజరాత్ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న సంకల్‌చంద్ హిమత్‌లాల్ సేఠ్‌ను రాష్ట్రపతి మన ఆంధ్రకు న్యాయమూర్తిగా బదిలీ చేశాడు. ఇక్కడకు రాబోయే ముందు తన బదిలీ చెల్లనేరదని గుజరాత్ హైకోర్టులో సేఠ్ ఒక రిట్ వేశాడు

ఈ రిట్ విచారణలో కొన్ని తమాషాలు జరిగాయి. శ్రీ జె బి.మెహతా, ఎ.డి. దేశాయ్‌డి ఎ. దేశాయ్‌లతో కూడిన బెంచిఆగష్టు 30 న వాదనలువినటంప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం తంపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ వి. పి. రామన్ వాదనచేశాడు.మధ్యలో ఒక అభ్యంతరం లేవదీశాడు. ఈ న్యాయమూర్తులే, ఇదే విషయంమీద సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తికి ఒక ఉత్తరం వ్రాశారని కేంద్ర ప్రభుత్వానికి తెలిసిందనీ, కాబట్టి ఈ రిట్‌ను ఇంకొకళ్ళు వింటే బాగుంటుందన్నాడు. ఇంకో బెంచి ఏర్పాటు చేయవలసిందిగా ప్రధానన్యాయమూర్తిని సెప్టెంబరు20నకోరాడు. అప్పటి గుజరాత్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి శ్రీ ఓబుల రెడ్డికూడా బదిలీ చేయబడిన న్యాయమూర్తులలో ఒకడు. ఆయన కేంద్రప్రభుత్వం కోరికను కాదన్నాడు సగం విన్న ఆ ముగ్గురు న్యాయమూర్తులే ఆరిట్‌ను వినాలన్నాడు. దానితో వారే విని, సేఠ్‌కు అనుకూలంగా తీర్పు చెప్పారు.

ఆ తీర్పుమీద కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. ఆ అప్పీలు 1977లోవిచారణకొచ్చేనాటికి కేంద్రంలో జనతా ప్రభుత్వముంది, ఆ ప్రభుత్వం దాదాపుగా ఆ అప్పీలు నుంచి విరమించుకుంది. అయినప్పటికీ విషయాన్ని కూలంకషంగా వినటం జరిగింది కాబట్టి,ముఖ్యంగా దానిలో నిమిడి ఉన్న రాజ్యాంగసమస్యలను మనస్సులో పెట్టుకొని, సుప్రీం కోర్టు తన తీర్పు ఇచ్చింది. దానినివిన్నవారు అయిదుగురు న్యాయమూర్తులు - ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్, భగవతి, కృష్ణయ్యర్, ఉంటువాలియా, మూర్తుజాఫజల్ ఆలీలు వీరిలో మెజారిటీ ముగ్గురు బదిలీలు చేసే అధికారముందంటే, ఇద్దరు భగవతీ, ఉంట్‌వాలియాలు మాత్రం అలాంటి అధికారం లేదన్నారు.

ఇప్పుడు 1981లో ఈ విషయాలను విన్న న్యాయమూర్తులంతా కొత్తవారే-ఇద్దరు తప్ప. ఆ ఇద్దరూ భగవతీ, ఫజల్ ఆలీలు తమతమ పాత అభిప్రాయాలకే కట్టుబడి ఉన్నారు ఇప్పుడూ భగవతి బదిలీలు రాజ్యాంగవిరుద్ధమంటే ఫజల్ అలీ కాదన్నారు.

❖ ❖ ❖

కేంద్రప్రభుత్వానికి హైకోర్టు న్యాయమూర్తులను బదిలీచేసే అధికారము 222వ అనుచ్ఛేదము ప్రకారముంది. దాని ప్రకారం, భారతదేశపు ప్రధానన్యాయమూర్తిని సంప్రదించిన అనంతరం,రాష్ట్రపతి,ఒక హైకోర్టు న్యాయమూర్తిని ఇంకో హైకోర్టు న్యాయమూర్తిగా నియమించవచ్చు. 222వ అనిచ్ఛేదపు భాషలో, "బదిలీచేయబడే న్యాయమూర్తి అనుమతి లేకుండా" (విదౌట్ హిస్ కన్‌సెంట్)అనే మాటలు లేనే లేవు.

కాని 1977 సేఠ్ వ్యవహారంలో,ఆ అనుచ్ఛేదపుభాషలో అలాంటి మాటలు వాడబడకపోయినా,కొన్ని పరిస్థితుల రీత్యా ఆ మాటలు ఉన్నట్లుగా భావించి, ఆ మాటలనుకూడా చదువుకోవాలి అని ప్రముఖ న్యాయవాది శ్రీ సీర్‌వాయి వాదన. అయిదుగురు న్యాయమూర్తులలో భగవతీ ఒక్కనికే ఈ వాదన నచ్చింది.

కాని ఈ 1981 వివాదంలో ఇంకా అనేక ఇతర విషయాలుకూడా మిళితం కావటంతో, అన్ని విషయాలనూ కూలంకషంగా విని తీర్పు ఇవ్వటం జరిగింది.

❖ ❖ ❖



అయితే ఈ 222వ అనుచ్ఛేదంలో ఉదహరింపబడిన "సంప్రదించుట" (కన్సల్టేషన్) అనే మాట అనేక అర్థాలకు దారి తీసింది. ఉదాహరణకు భగవతి ఇప్పటి తీర్పులో ఇలా అంటాడు: "అవసరమయితే సరాసరి ఆ న్యాయమూర్తిని అడిగైనా సరే, ఆ న్యాయమూర్తికి సంబంధించిన అన్ని వివరాలనూ సేకరించవలసి ఉంటుంది. ఆ వివరాలు ఈ క్రింది విధంగా ఉండవచ్చు ఉదాహరణకు, ఆ న్యాయమూర్తి ఆరోగ్యము, అయనకు బదిలీ చేయదలుచుకున్న ప్రాంత వాతావరణమూ, అక్కడ లభ్యమయ్యే వైద్య సదు

పాయాలు, ఆయనభార్య లేక కుమా ర్తెయొక్క వృత్తి లేక వ్యాపారము ("బిజినెస్ ఆర్ అక్యుపేషన్ ఆఫ్ హిస్ వైఫ్ ఆర్ డాటర్) తల్లిదండ్రుల పరిస్థితి, పిల్లల విద్య వగైరా కనుక్కోవాలి" ("........ ది పొజిషన్ ఆట్ హిజ్ పేరెంట్సు అండ్ ది ఎడ్యుకేషన్ ఆఫ్ హిజ్ ఛిల్డ్రెన్ ఎట్ సెటెరా యాజ్ ఎ పార్ట్ ఆఫ్ ది ప్రాసెస్ ఆఫ్ కన్సల్టేషన్.")

కాని ఇంకొక న్యాయమూర్తి, ఫజల్ అలీ ఈ "కన్సల్టేషన్" కో రూపాన్నిస్తూ సూత్రాలను నిర్ధారించాలనీ, అప్పుడు ఈ విషయాలను మనస్సులో ఉంచుకోవాలంటూ, నాల్గు విషయాలను ఉదహరించాడు. అవి ఇవి 1. వ్యక్తిగతమైన ఆరోగ్యకారణాలవల్ల బదిలీ పనికిరాకపోవచ్చు. ఉదాహరణకు గుండెజబ్బుతో బాధపడే న్యాయమూర్తిని, పర్వతప్రాంతాల లోని హైకోర్టుకు బదిలీ చేయకూడదు. 2. ఇంకొక ఆరునెల లలో పదవీ విరమణ చేయబోయే న్యాయమూర్తి బదిలీవల్ల ఎవరికీ లాభం జరగదు. 3. ఏదైనా శారీరక సంబంధమైన లోపంవల్ల ఆ న్యాయమూర్తి పూర్తిగాకదలటానికి ఇబ్బంది పడే దశలో ఉన్నప్పుడు ("హిజ్ బికం ఇమ్మొబైల్ అండ్ కెనాట్ బిమువ్డ్ బియాండ్ హిజ్ హోమ్ స్టేట్) 4. ఇంకా ఇలాంటి కారణాలు ఏవైనా ఉంటేను.

చివరకు ఫజుల్ అలీ, ఈ మినహాయింపులు అనేవి పాలసీనే ధ్వంసం చేసేవిగా తయారు కాకూడదు సుమా అంటాడు. ("ఎట్ ది సేమ్ టైం, ది ఎక్సెప్షన్స్ షుడ్ నాట్ బి సో బ్రాడ్లీ కన్‌స్ట్రూడ్ యాజ్ టు డిస్ట్రాయ్ ది ఎఫెక్ట్ అండ్ ఫ్రూటుఫుల్‌నెస్ ఆఫ్ ది పాలసీ")

ఈ రెండు దృక్పథాలనూ పరిశీలిస్తే, ఏ దృక్పథం సరియైనదో మనమే నిర్ణయించుకోవచ్చు.

ఈ వ్యవహారంలో ఇంకో విశేషముంది.

222వ అనుచ్ఛేదము ప్రకారం కేంద్రప్రభుత్వానికి బదిలీలు చేయటానికి అధికారం వున్నా, కేంద్రప్రభుత్వం ఆ అధికారాన్ని వాడనేలేదు సుమా! 1951 నుంచి 1976 దాకా, ఇరవై అయిదు సంవత్సరాల కాలంలో సుమారుగా ఇరవై అయిదు బదిలీలు మాత్రమే జరిగాయి.

కాని అత్యవసర పరిస్థితి రోజులలో - 1976 మేలో - ఒక్కసారిగా పదహారు బదిలీలు జరిగాయి. కాబట్టి ప్రజల మనస్సులలో, హైకోర్టు న్యాయమూర్తి బదిలీ అంటే కక్ష సాధింపు చర్య అనే భావం రూఢీభూతమయింది. అదే ధోరణిలో కక్ష సాధింపుగా ఈ బదిలీలు జరగవచ్చనే అను మానం ప్రజల మనస్సులో నాటుకుంది. నిజానికి ఈ అను మానం ఉండటం వల్ల, కేంద్ర ప్రభుత్వానికి గల అధి కారం లేకుండా పోదు.

కాబట్టి ప్రభుత్వమీ రంగంలో "నిదానంగా త్వర పడాలి" [హాజన్‌స్లోలీ] అని విజ్ఞుల అంచనా.

పై తీర్పులోనే న్యాయమూర్తి ఫజుల్ అలీ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి మీద చెణుకులు విసిరాడు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల బదిలీని గురించి. ఈ "యూనిఫారం పాలసీ"ని గురించి ఆయన రెండు ధోరణు లను వ్యక్తం చేస్తున్నాడనే, చివరకు న్యాయశాఖా మంత్రికి 1980 డిసెంబరు 7న వ్రాసిన ఉత్తరంలో ఆ విషయం బయట పెట్టాడనీ అన్నాడు. [సుప్రీంకోరు ప్రధాన న్యాయ మూర్తి తన ఉత్తరంలో ఇలా వ్రాశాడు: "దో ఐ యామ్ ఫరమ్‌లీ అపోజుడు టు ఎ హోల్‌సేల్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ది ఛీఫ్‌జస్టిసెస్ ఆట్ హైకోర్ట్సు........")

చివరకు ఫజల్ ఆలీ ఇలా అంటాడు: "సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సంబంధించినంతవరకు ఈ రంగంలో తెర దిగింది." ("దస్ దేర్‌ఫోర్‌మార్క్సు ది ఎండ్ ఆట్ ది ఇపిసోడ్ సోఫార్ యాజ్ ది ఛీఫ్‌జస్టిస్ ఆఫ్ ఇండియా ఇజ్ కన్సరన్‌డ్.")

అంటే ప్రభుత్వ నిర్ణయాలను అమలుపరిచే తీరిక ఇంకా న్యాయవ్యవస్థకు దొరకలేదని భావించాలా?

ఏది ఏమైనా 1981 డిశెంబరు నాటి చారిత్రాత్మక తీర్పులోని కొన్ని అంశాలివి.

కీ. శే. శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

ప్రతిభా పూర్ణుడు రవీంద్రుడు

తెలుగు పాఠక లోకానికి రవీంద్రుని పేరే ఎక్కువ వినిపించింది కాని పెంపు అంతగా వినబడలేదు ముఖ్య కారణము రవీంద్రునిరచనలుమనకు ఇంగ్లీషులో అందడము. రవీంద్రునికి నోబెలు బహుమానము వచ్చిందని తెలియగానే సజాతీయుకవి ఏ భేషజముచేసి ఆ గౌరవాన్ని పట్టగలిగినాడో తెలుసుకోడానికి మన యువకవులు మాత్రము ఏ కొద్దో చదివేరు రవీంద్రుని కావ్యాల్ని. కొందరు మర్మకవిశ్వము అల్లి సులభముగా అర్థం కాకపోవటములో తమ కృతులకూ రవీంద్రుని కావ్యాలకూ గల సామరస్యమును తలచుకొని కాబోలు సంతోషించారు! కొందరు ప్రణయ, మధుర వంటి మెత్తని పదాలు కూర్చి పెట్టుకొని అవకాశము దొరికినప్పుడల్లా ఆ పదాలు విరజిమ్మి ఏదో ఒక రకపు భక్తిని ఆశ్రయించి పద్యాంజలులు రచించారూ, వారి అభిమానులు ఆ రచనలకు రవీంద్రుని గీతాంజలి సరసను పెట్టి పొగిడేరు! ఇంత జరిగి రవీంద్రుని సౌందర్యదర్శనము తెలుగుకవులకు పట్టుబడలేదు.

రవీంద్రుని కృతులనుగురించిన విమర్శ అయినావాటి సౌందర్యమంతా మన పూర్వ ఋషుల వాక్కుల ప్రతిధ్వనే అన్నట్లు, చిరకాలము భారతియయోగులు కూడబెట్టిన తేనెను ఇంగ్లీషులోకి తన కావ్యాల్ని తర్జమా చెయ్యడం ద్వారా- రవీంద్రుడు జుర్రుకున్నాడన్నట్టూ చేసిన వ్యాఖ్యానమే అయిపోయింది. తండ్రి దేవేంద్రనాథుడు మహర్షి. హిమాలయప్రాంతాల సౌందర్యము నంతటినీ రవీంద్రుడు చూచి ఆనందించాడాయెను. అన్న ధోరణిలో సాగిపోయాయి కొన్ని విమర్శలు. నిజానికి రవీంద్రుని రచనాకౌశలము సముద్రాలంత విశాలము. అంతటినీ కొలుచుటకు మాట అటుంచి స్పృశించగలగడము కూడా దుసాధ్యమే, అయితే లోకానుభవము వలెనే కావ్య పఠనానుభవము కూడా ఎవరిది వారిదే! అనుభవ బలము ప్రేరణల చెప్పనుంకించే ఉత్సాహముతో నాకు తాకినంతవరకూ రవీంద్రమహాకవి మహత్తును వివరించ ప్రయత్నిస్తున్నాను.

కవిత్వముయొక్క గొప్పతనమువిశాలదృష్టితో చూస్తే వర్ణ్యవస్తు సౌందర్యముమీదా వర్ణనా పద్ధతిమీదా ఆధారపడుతుంది. నన్నడిగితే వర్ణ్యవస్తు సౌందర్యమే కవిత్వానికి ప్రాణం అంటాను. వస్తుసౌందర్యము చైతన్య బలమువల్ల స్ఫురిస్తుంది, ప్రతిభా బలమువల్ల కవి ఊహాదృశ్యాల సౌందర్యాన్ని గుర్తించి వర్ణిస్తాడు. ఇదివరకు వ్రాసిన కవులు ఏ రీతిగా వర్ణించారూ వర్ణించినదారులు నా రచనలో ఎంత వరకూ ఏ రీతిగా ఉపయోగించుకోవచ్చునూ అన్న ఆలోచనకి సాయంచేస్తుంది పాండిత్యము. ఈ పాండిత్యాన్నే వ్యుత్పత్తి అంటారు. వర్ణ్యవస్తు సౌందర్యాన్ని నిరూపించే శక్తి ప్రతిభ. ఈ ప్రతిభ దీపము వంటిది. దీనివలన ప్రకృతి సౌందర్యము కవికి అనుభవమోతుంది, ఎప్పటికప్పుడు క్రొత్తగా మెరుస్తుంది. చూసిన చోటనల్లా సౌందర్యము చూడగలవాడూ వ్రాసినదంతా అందముగానే ఇచ్చేవాడూ ప్రతిభావంతుడు. వ్యుత్పత్తి బలము వంటిది. సౌందర్యానికి దానికి బాంధవ్యము తక్కువ. కండలు తిరిగిన స్త్రీ పురుషులను అందమైన వారని అనగలమా? వ్యుత్పత్తిని మెచ్చుకొంటాము, ప్రతిభకు ఆనందిస్తాము. ప్రతిభావంతుడు అడుగడుక్కి క్రొత్తదనాన్ని స్ఫురింపజేస్తాడు. రవీంద్రుని కావ్యములు నవనవోన్మేషములు. అతడు నూటికి నూరుపాళ్ళు ప్రతిభావంతుడు.

తోటమాలి లోని మూడో కావ్యములో వ్రాస్తాడు రవీంద్రుడు. ప్రాతఃకాలమే నా వల వేశాను సముద్రములో. ఆ నల్లని లోతులలోనుంచి వింతవాలకమూ వింతఅందమూగల పదార్థాలను వెలికి లాగినాను, కొన్ని మందహాసమువలె ప్రకాశించాయి, కొన్ని అశ్రువులవలె మెరిశాయి. కొన్ని నవవధూ కపోలములవలె ఎఱ్ఱబారేయి. దిన సంపాదన భరముతో నేనింటికి పోయేసరికి నా ప్రేయసి ఊరికే తోటలో కూర్చుని పూవులరేకులు తుంచి పారేస్తోంది.

కొంచెము సందేహించి నేను ఎత్తి తెచ్చినవాటన్నిటినీ ఆమె పాదాలకడ ప్రోగుపెట్టి మాట్లాడక నిలబడ్డాను. వాటి వైపు ఆమె చూచి "ఏమిటీ వింతవస్తువులు ? వీటినేం చేసుకోవాలో నాకు తెలియదు" అన్నది.

అవమానముతో తలవంచుకొని అనుకున్నాను. వీటి కొరకు నేను వాదములు చేయలేదూ,విపణివీధిలో కొని తీసుకురాలేదూ, ఇవి ఈమెకు అర్హ బహుమానాలు కావు. రాత్రంతా ఒకటి తర్వాత ఒకటి వీధిలోకి విసిరేశాను. వేకువజామున బాటసారులు వచ్చారు. వారు వాటిని ఏరుకుని దూరదేశాలకు తీసుకుపోయారు.

ఈ కావ్యపు భావార్థము "వాదములూ తర్కములూ నిలబెట్టేది పాండిత్యాన్ని. సామాన్య పాఠకులు మెచ్చేది పూర్వకవులు బజారులో పెట్టిన వస్తువును. నా రచనలలో అవి కానరాలేదు. నా సమకాలిక పాఠక లోకానికి! అయితే

నైసర్గిక సౌందర్యాన్ని గుర్తించగల యాత్రికులు వాటిని గ్రహించి దూరదేశాలకు తీసుకుపోయారు" అన్న ఉపాలంభము.

రవీంద్రుడు గొప్ప ప్రతిభాశాలి ఇరవై యేండ్లు నిండక మునుపే చక్కని కావ్యాలు అల్లినమేధావి. పదగుంభనమూ శబ్దాలంకార ప్రాబల్యమూ క్లిష్టాలంకార వైచిత్రీ సమాస బాహుళ్యమూకాక సరళసుందర రచనమే సాధనముగా రసికుల మనస్సుల ఉద్రిక్తములను చేసిన మధురకవి వాల్మీకి అట్టివాడు, కాళిదాసు అట్టివాడు,మళ్ళీ రవీంద్రుడు అట్టివాడు.

"నా పాట అలంకారాలన్నిటినీ తీసిపెటేసింది. వాటి గలగల నీ గుసగుసల్ని వినబడనీయదు." అంటాడు ఇంకొక చోట. అలంకారాలు సాధించే ఆలోచనలో నైసర్గిక సౌందర్యము మునిగిపోతుందన్న అభిప్రాయమిది. "ఎక్కడ నీకు ఆటవిడుపు గేయమా? పండితులు వేసవిగాలిని ముక్కుపొడుముతో కలచే చోటనా? నిరంతరమూ మానవులు "గిన్నెకు నెయ్యి ఆధారమా? నేతికి గిన్నె ఆధారమా" అని వాదులాడే చోటనా? పచ్చని ప్రాతప్రతులు శీఘ్రగాములైన లాఘవ జీవిత పాదములపై పళ్ళుకొరుకుచోటనా" అని మరియొక చోట (ప్రేమోపహారము 20 లో) అడుగుతాడు. విజయము అన్న కథలో మహారాజనారాయణుని ఆస్థానకవికిన్నీ, దాక్షిణ్యాత కవి పుండరీకుని కిన్నీ పోటీ కల్పించి "పాండిత్యపు నగరాగ్రమోతలో సౌందర్యపు తుమ్మెదల ఝంకారము నిలువగలిగే చోటులుకావు ఈనాటి ప్రజాస్థానాలు"అని పోటు పొడుస్తాడు. తోటమాలి 6 వ గేయములో పంజరకీరానికీ వనశుకానికీ జరిగిన సమావేశములో పండిత నాగరిక కవిత్వము "రా. ఈ పంజరములో బ్రతుకుదాము. ఆకాశములోకి పోతే దేనిమీద వ్రాలడమూ? పండితుల భాషణములు నేర్పుతాను ఎగరడానికి నా రెక్కలకు చైతన్యము లేదు. అవి చచ్చి ముడుచుకున్నవి" అంటుంది. స్వేచ్ఛాజీవియైన వనశుకము "పంజరాలలో రెక్కలు విప్పడానికి చోటేదీ? మూసిపెట్టిన తలుపులతో పంజరముచూస్తే నాకు జంకొత్తోంది." అంటుంది కట్టుబాటుతో ఉండే సంప్రదాయ కవిత్వము పంజరకీరము ద్వారా పలికితే ప్రతిభాపవిత్రమైన స్వేచ్ఛాగానము వనశుకము ద్వారా పలుకుతోంది. చాలచోట్ల వ్యంగ్యంగా ఈ అభిప్రాయాన్ని ధ్వనింపజేసేడు. అప్పటికి ఉండబట్టలేక భావనా బలముల్లా కవులు సాధించే అలంకారాలు-రెక్కల గుత్తులు మానవముఖాల్లా ఉంటే పువ్వులూ పన్నగాంగములు కలిగిన స్త్రీలూ ఈ విడ్డూరపుసామాగ్రి అంతా సహజసుందరములైన శకుంత గీతములూ, ఆకుల మర్మరధ్వనులూ గ్రామసీమ కలకలమూ లేని సృష్టి ముందు దండుగలనీ తోటమాలి 72వ కావ్యములో చెప్పేశాడు-ఇది రవీంద్రుడే పలికిన మాటలలో లభించే సాక్ష్యము. ఇక ఆయన రచనా పద్ధతిని గమనిస్తే అడుగడుక్కీ ప్రతిభావంతునిదృష్టి నైశిత్యముగోచరిస్తుంది.

ఏ సన్నివేశాన్ని వర్ణించినా, స్వయంగా తానా చోటనుంచే ఏయే సంగతులు గోచరిస్తాయో వాటినన్నిటినీ ఆ వరుసలో వర్ణించగలగడం ప్రతిభావంతుని మొదటి లక్షణము ఉత్తమోత్తమ నిశీథము అన్న కథలో "అలాగ మాట్లాడుకొంటూ ఉండగా నాకు ప్రక్క గదులో గాజుల గుసగుస, చీర పలపల. అడుగుల చప్పుడూ వినబడింది. నిశ్శబ్దంగా, కిటికీ తలుపు సందులోనుండి రెండు కళ్ళు నావైపు చూస్తున్నాయి" అంటాడు రవీంద్రుడు చదువరికి వర్ణ్యవస్తు దర్శనానుభవము కలుగడానికి ఈ రకపు రచనకు మించిన సాధనము లేదు. "ఒక్కమాట కూడా అనకుండా కుసుమ శిరసువంచి అతని పాదధూళి తన మీద ఉంచుకుంది ఆ సన్యాసి వెళ్ళిపోయినాడు.

చంద్రుడస్తమించాడు, చీకట్లు దట్టమైనాయి నాకు నీటిలో చప్పుడు వినబడింది. ఆకాశంలోని నక్షత్రాలని ఆర్పేయడానికేమో అన్నట్టుగా చీకట్లో గాలి రివ్వురివ్వుమంది" అని వర్ణిస్తాడు నదీ సోపానం అన్న కథలో. ఇది చదివినప్పుడు కుసుమ గంగా ప్రవేశము కళ్ళకుకట్టి మనమనస్సు కూడా గాలిలాగే రివ్వు రివ్వు మంటుంది.

రవీంద్రుడు రచించిన ప్రతి కథలోనూ ఇలాంటి వర్ణనలు ఉంటాయి. పండ్లరాశి అన్న పుస్తకంలోని గురుగోవింద, సుదాస, సనాతన, సుప్రియ, ఉపగుప్త, శ్రీమతి, సత్యకాములగాథలలో మరీని. కావ్యము కాంతా సమ్మిత తయోపదేశము చేయాలని రసికుల ఆశయము. కవి తన అభిప్రాయాల్ని ప్రభువులాగా, మిత్రుని లాగా చెప్పకుండా తానుచేసే వర్ణనల వలన మనకు కలిగించడమే కాంతాసమ్మితోపదేశము. ప్రతిభవల్లగాని ఈ సన్మార్గము కవికి దొరకదు. పండ్లరాశి కథలన్నిటా ఈ సువీథి గోచరిస్తుంది.

ప్రకృతికి కూడా ఊహలూ ఆవేశాలూ ఆరోపించి చదువరులలో ప్రతిస్పందనాన్ని రేపడము రవీంద్రుని వర్ణనలో అంతటా కానవస్తుంది. కథ చెప్ప జడమని మనమనుకొనే ప్రకృతికి చైతన్యమూ సానుభూతి ఆరోపించి చూపగల నేర్పు వల్ల రవీంద్రుడు మనకు సులువుగా సద్యఃపరనిర్వృతి కలగడానికి దోహదం చేస్తాడు. "పొద్దుమినాడు అపరాహ్ణవేళ మూగి సుభాషిణి నెమ్మదిగా తలుపు తెరచి జంకుతూ పైకి తొంగి చూచింది. ఆమె వలెనే సంపూర్ణ యౌవ్వనీ, ఏకాకియైన ప్రకృతి నిద్రపోయే భూమిని నిదానించి చూచింది. బాధావిలహృదయా నిత్యమౌనీ అయిన భూదేవి కుచ్చెళ్ళ కడ పీడిత హృదయా మూగీ అయిన సుభాషిణి—అని చదివే సరికి సుభాషిణి దైన్యము మన మనస్సులను మబ్బువలె ఆవరిస్తుంది. పోస్టుమాస్టరు అన్న కథలో "పోస్టు

మాస్టరు నిట్టూర్పు విడిచి, సంచీని ఎత్తి బుజముమీద గొడుగు ఆనించి, పెట్టె మోసుకొని నడిచే కూలీని వెంట తీసుకొని పడవ వైపు నడిచాడు. పడవ బయలుదేరి పోతూంటే భూదేవి కన్నీటి ప్రవాహంలాగ వాన నీటితో నిండిన నది పడవ ముక్కు దగ్గరా చుక్కాని దగ్గరా రోదించింది. అతనికి ఏదో బాధ కలిగింది. ఏడుస్తూ ఉండిన పల్లెబాలిక ముఖములో భూదేవి తీరని దుఃఖము తోచిందతనికి. వెనక్కిపోయి ఎవ్వరూలేని ఆ అనాధ బాలికను తనతో తీసికొని పోదామా అని ఒకసారి అనిపించిందికాని తెరచాపలు బాగా గాలిపోసికొని పడవను నది మధ్యానికి తీసికొనిపోయాయి, పల్లె దూరమై ఊరవతలి స్మశానము కూడా దాటిపోతోంది." అని వ్రాసి మన గుండెను పిండుతాడు. నీటి శబ్దము కన్నీటితో ఏడుపులా కనబడడమూ, తాత్కాలిక వైరాగ్యాన్ని నిలిపే శ్మశానము దృష్టిలో నిలపడమూ చక్కగా అమరేయి. కవి మనలో కల్పించ నెంచే దైన్యము ప్రకృతికి అతడారోపించిన సానుభూతిమీద ఎక్కివచ్చి మన మనసుల్ని ఆవరించేస్తుంది. అనడము ఇది ఉత్ప్రేక్షయే. ఉత్ప్రేక్షనే రూపము మార్చి ప్రకృతికి చైతన్య మారోపించి రచిస్తే చదువరి హృదయము సులువుగా ప్రతి స్పందిస్తుంది. అయితే కవి ప్రకృతికి ఆరోపించిన ఈ చైతన్యము సహజముగా ఉండాలి. కవుల ఉత్ప్రేక్షలు సామాన్యంగా అభూత కల్పనలై ఉంటాయి. "రవి బింబ పతనము వలన చీలిన పయోధి గర్భములో నుండి శేషఫణి ఫణారత్నము ఎర్రగా మెరిసింది" అంటే కల్పన అజ్ఞాతంలోనికి వెళ్ళిపోతుంది. ఆలోచనను మాత్రం రేపుతుంది. "లేత మనస్సు కల వరూధిని ఎలపును త్రొక్కుకుంటూ ప్రవరుడు వెళ్ళిపోయాడు. అస్తమించే సూర్యుని ముఖం ఎర్రబారింది. మబ్బుకన్నెల ధవళ శరీరంలో రక్తం ఉడుకెత్తి పోయింది" అని వ్రాస్తే చదువరుల తత్వాలు అనునదము చేస్తాయి. ఆలోచనకర హృదయం జలుమంటుంది రవీంద్రుని ఉత్ప్రేక్షలు ఈ రీతిగా ఉంటాయి.

అయితే ఉత్ప్రేక్షను గౌణముగా జతచేసి వర్ణ్య వస్తువును ప్రదానము చేసి రవీంద్రుడు అందము సాధిస్తాడు. "రాజకుమారుడు మనయింటి మీదుగా వెళ్ళేడు. అతని రథమునుండి ఉదయి భానుడు జిగజిగ మెరిసేడుఅంటుంది ఒక తారుణ్య భరాలస. మొదటివాక్యములోఆమె దుఃఖవా, రెండవ వాక్యములో ఆమె వలపూ తెలుస్తాయి. "భయంకరమైన మెరుపు ఆకాశాన్ని గోళ్ళతో చీరుతోంది. "పెల్లబారింది సముద్రపుటొడ్డు మందహాసము" "కెరటాల కంఠమేళము వింటున్న భూమి గుండె తాకుతోంది." "గుడిగంట నాదముతో ఆకశము నిద్రలేచింది." వేసవి నా కిటికి దగ్గరకు వచ్చింది నిట్టూర్పులతోనూ, గుసగుసలతోనూ, — ఇవన్నీ ఈ కోవలోనివే!

మన మందరమూ సామాన్యంగా చూసే దృశ్యాల్ని క్రొత్తగా వర్ణించి మనకు క్రొత్త అనుభవాన్నివ్వడము ప్రతిభావంతుని రెండవ లక్షణము. "సృష్టికర్త మానవుడి విషయమై ఇప్పటికింకా అధైర్య పడలేదు" అన్న సందేశంతోనే చంటిపాపలు వస్తున్నారంటాడు రవీంద్రుడు. పాపలు మన ప్రపంచంలోకి వస్తూనే ఉన్నారని మన అందరికీ తెలుసు. అయితే పరమేశ్వరుడు సృష్టించడములో గమ్యమేదో ఉన్నదన్న సంగతిని ఈ పాపలు వస్తున్నారన్న సత్యం చెప్పడంలో రవీంద్రుడు మనకు మెరుపుతో కొడుతున్నాడు. తోటమాలి కావ్యములో (70) నా చిన్నతనములో నేను గుంటనీటిలో కాగితపు పడవను వేసి ఆడిన రోజు జ్ఞాపకమున్నది. అనాడంతా మబ్బుగానే ఉండినది. రోజంతా హాయిగా ఆడుకున్నాను. గుంటనీటిలో కాగితపు పడవను వేసి, హటాత్తుగా వాన మబ్బులు దట్టమై రివ్వు రివ్వుమని గాలి విసిరి కుంభపోతగా వర్షము కురిసింది. వాన నీరు రోడ్డుమీద పక్కలనూ కాలువలుగా పారి గుంటని నింపేసి పడవని ముంచేసి నా ఆటని పాడుచేయడానికి పని కట్టుకొని వచ్చిన గాలివానని తిట్టుకున్నాను.

మబ్బు గమ్మిన ఈ శ్రావణపంచమి పొడుగ్గాసాగినట్లు కనిపించింది. జీవితంలో నేను ఆడి నష్టపోయిన ఘటనలన్నీ జ్ఞాపకం వస్తున్నాయి.

నా కడ్డువచ్చిన దుర్విధిని తిట్టుకుంటూండగా చరాలున గుంటలో మునిగిన నాటి కాగితపు పడవ జ్ఞాపకం వచ్చింది. పిల్లవాని కాగితపుపడవమీద వానమబ్బులకు కశియెంతో విధికి మనయత్నాలమీదా అంతే కశి.

"ఈ జీవితమన్నది సముద్రతరణము వంటిది. మన మంతా ఒకే పడవలో చేరిన ప్రయాణికులము. మరణించడముతో ఒడ్డు చేరుకొని మనమన ప్రపంచాలకు వెళ్ళిపోతాము అంటాడు రికామీపిట్టలు అన్న పుస్తకములో" తల్లి తనను కుడిరొమ్మునుండి ఎడమవైపు తప్పించినపుడు శిశువు ఏడుస్తాడు. మరుక్షణమే ఎడమవైపు చేరి ఏడ్పు మానేస్తుంది మరణము అంటే ఇంతేనేమో! అంటాడు తరణములో. మన అనుభవపధములో తగిలికూడా మనదృష్టికి తప్పుకుపోయే అనుభవాలు ప్రతిభావంతుడైన కవికి సాధనాలు అవుతాయి.

కట్టమీది తాడిచెట్లు తల ఆకాశానికి వేసి కొట్టుకుంటున్నాయట,గాలి వెదురుపొదలలో గర్జిస్తూ గింజుకుంటోందట. చలిగాలికి నీరు వడవడ వణికిందట. ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వచ్చు ఈ రీతిగా.

సృష్టి సౌందర్యాన్ని అనుభవించగలిగిన చైతన్యమూర్తి, ఆ అనుభవాన్ని శక్తిమంతమైన భాషలో చదువరులకు అందించగలిగిన రచయితా అయి ఉండడము ప్రతిభావంతుడైన కవి మూడవలక్షణము. ఇంతవరకూ అనుభవము

కలిగించగలిగిన గుణమూ. మనకు తెలిసినవానిలోనే క్రొత్త అనుభవాన్ని కలిగించే శక్తి రవీంద్రునిలోని ప్రతిభగా గుర్తించాము. మనకు తెలియని సరిక్రొత్త అనుభవము కలిగించగలగడము ఈ కవి నవ్యతకు జీవము. రవీంద్రుని వర్ణనలలో విశ్వమంతా చైతన్యంతో పులకించినట్లు కనబడుతుంది. మెరపు వెలుగులో ఈ ప్రపంచమే ధవళోజ్జ్వల వస్త్రాన్ని ధరించి క్రొత్త సౌందర్యముతో కనబడుతుందనీ, చంద్రికా స్పర్శవల్ల నవలావణ్యంలో ఒదుగుతుందనీ మన కందరికీ తెలుసు. రవీంద్రుని అమృతనిష్యంది లేఖినీ స్పర్శతో ప్రకృతి నవచైతన్యముతో కదలాడుతుంది సోమరి మేఘాలు ఆకాశంలో నెమ్మదిగ గుమిగూడుతాయి. అంధకారము మెరుపుతో గడగడ వణకుతుంది. వాన నీరు ఇరుకు కాలవల్లో సెలయేళ్ళుగా పారుతూ తుపానుకి మంగళం పాడుతుంది. కొండల గుండెలలో ఆడుతూ మంచు అందపుటచ్చెరువులు సృష్టిస్తుంది. కాంతి సముద్రముమీద సీతాకోక చిలుకలు తెరచాప లెత్తుతాయి. పూల గుంపులు హటాత్తుగా పైకి వచ్చి వెర్రి సరదాతో గడ్డి నేలమీద గెంతుతాయి. మల్లెలూ మొల్లలూ వెలుతురు కెరటాలమీద తేల్తాయి. మధ్యాహ్నపు వేడిగాలిలో యెండుటాకులు గిరగిర తిరుగుతూ నృత్యము చేస్తాయి మండుటిసుక దాహపు దుప్పటి పరుస్తుంది. ఆకాశము ఎండకు వగరుస్తూ వేసారుతుంది. వేసవి గాలి దుండగీండ్రగుంపులాగ కోపావేశాలతో తిరుగుతుంది. మెలుకువ వస్తున్న నిద్రలాగ మఱ్ఱిచెట్టునీడ నీటిమీద చలిస్తుంది. నీరవ సూర్యాస్తమయోత్సవము పారాణి జల్లులతో బంగారు వెల్లువలతో జరిగిపోతుంది. పగటి కడపటి వెలుగు రాత్రిలోకి అదృశ్యమైపోతుంది.బాలచంద్రుని పాండు కిరణాలుఅదృశ్యమౌతున్న శరన్మేఘశకలాలన్ని స్పృశించి పసిపిల్లల పాల బుగ్గల నవ్వు సృష్టిస్తాయి. సామాన్య కవులుకూడా ప్రకృతి చైతన్యాన్ని మెరుపుల్లాంటి హటాత్ సన్నివేశాల్లో గుర్తిస్తారు. రవీంద్రుని తపనీయసులోచనాలకు సర్వప్రకృతీ చైతన్యమయమే. సృష్టిలో పరిణత జీవియైన మానవుని చర్యలూ భావాలూ సృష్టి అంతటిలోనూ గోచరించాయి ప్రతిభాపూర్ణుడైన రవీంద్రుడికి. అందుకే ఆయన పోలికలు చక్కగా సరిపోతాయి. ఉపమానానికి ఉపమేయానికీ సంఖ్యలోన శబ్దాలలోన సామరస్యమున్నప్పటికీ కవులు పోలికను సాధించేయడము చూస్తాము మనము. గిజేంద్రుడు చొచ్చిన కాసారము వైకుంఠపురంబునుంబోలి శంఖచక్ర కమలాలంకృతంబై భాగ్యవంతుని భాగధేయంబునుం బోలి గురుమకరకుళీరమీన మిథునంబై యుండినట్టిదట. రాజుకీ ధర్మరాజుకీ పోలికలు తొలుదొల్త కమలమిత్రుని వంక రూపొట దక్షాధ్వరధ్వంసి తన్ను గనుట,ఇంతకంటే చేరికలో ఉన్న పోలికలుకూడా "అంతమట్టుకే పోలిక" అని రసికులు సద్దుకునేటివే ఎక్కువ. అంటే కవుల రచనలలో పోలికలు సామాన్యముగా ఏకదేశములే ఉంటాయి అంటాను. రవీంద్రుని పోలికలు వస్తురూపాలతో రేఖలతోనూకాదు! చైతన్యముతో చేష్టలతో, కనుకనే అతని కావ్యప్రపంచము నిండు చైతన్యముతో కదలాడుతుంది.

"నీరు నీ కాళ్ళను చుట్టుకొని బుడగలద్వారా తన రహస్యాన్ని చెపుతుంది" అన్నప్పుడు నీరు కాళ్ళను చుట్టుకొన్నట్లు అపరిస్తుంది లోతులోంచి వచ్చే బుడగలు నీటి మనసులోని రహస్యాన్ని చెప్పే నీటి చైతన్యాన్నే కవి వర్ణిస్తున్నట్లు కానవస్తుంది. "కెరటాల సముద్రము చివరకి తన ఉయ్యాలలో నిద్రపోయింది" అంటాడు. "దావాగ్ని అలిసి తన ధూళివరుపుమీద వాలింది" "కెరటాలు మునివేళ్ళమీద నిలబడి నీమెడని ముద్దిడి నీ చెవిలో రహస్యము చెప్తాయి." "పచ్చగడ్డి మీది మోహంతో ఎడారి తహతహలాడిపోతోంది." ఇది పోలిక కాదు. ఎడారిపడే నిత్య విరహము. జడ ప్రకృతి అని మనం అనుకొనే దానిలో రవీంద్రుడు చూసే చైతన్యము! "మునివేళ్ళమీద నీ ప్రక్క దగ్గరకు నడిచివచ్చి నీ కళ్ళు ముద్దుపెట్టుకొంటుంది. ప్రాతఃకాలము "తెల్లవారింది" "కళ్ళు తెరిచావు" అని కాదు రవీంద్రుడు ఇక్కడ చెప్పేది.తెల్లవారగానే కదలాడే చైతన్యాన్ని వర్ణిస్తున్నాడు, ఉక్తి వైచిత్ర్యము కోసం యత్నించే కవి కాడు అతను. వస్తుచైతన్యమే అతని లక్ష్యము.

"ప్రతిభానవనవోన్మేషశాలినీ" అన్నారు. కనుక రవీంద్రుని రచనలలో నవ్యతము ఇట్టిది అని వివరించాను. ఈ నవ్యత్వము పాండిత్యముచల్లా, వ్యుత్పత్తివల్లా సాధించినది కాదు, మరి చైతన్యము వల్లా సౌందర్య పిపాసవల్లా సాధించినది.

డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి

సిరియాలమల్లని గూడూరు సానుబంధశాసనము

చరిత్రకారులు గూడూరు శాసనమని, సాహిత్య చరిత్ర కారులు విరియాల కామసాని గూడూరు శాసనమని వ్యవహరించు నది ఒకటే. అది నిజమునకు వట్టి గూడూరు శాసనము కాదు. గట్టి విరియాల కామసాని గూడూరు శాసనము కాదు. మరి? విరియాలమల్లని గూడూరు సానుబంధ శాసనము. [అందలి కన్నడ భాగము ప్రధాన శాసనము. తెలుగు భాగము శాసనానుబంధము. కన్నడ భాగమునందు గద్యపద్యములు కలవు. తెలుగుభాగము నందు పద్యములు మాత్రమే కలవు. అందు దోషములు అధికము. అవి కవి దోషములు అగుట కంటె లేఖక దోషములు అగుటయే సహజము. లేఖక దోషములేని కావ్యమే లేదు. అట్టిది శాసనము ఉండుట అదృష్టము. లేఖకదోష బహుళమైన శాసనానుబంధములోని తెలుగు పద్యములకు సరియైన పరిష్కరణము లేదు. కనుక శాసనానుబంధములోని తెలుగు పద్యములను పరిష్కరించుట ప్రథమ కర్తవ్యము.

'అనుపమ దుర్జయాన్వయసుధాబ్ధి ననేకులు రాజనందనుల
ననిన బొటంటి వెన్నడను సంభవుడయ్యె నతి ప్రసిద్ధుడై
వినుత విరోధి మండలిక వెన్నుని వెన్నుడువోలె వానికిని
ఘనుడగు బెట్టిభూ తిజగద్వినుతుండుదయించెగీర్తిరోసు

ఇది మొదటి పద్యము. ఇందు 'బొటంటివెన్నడను సంభవుడయ్యె' అను పంక్తి అర్థరహితము కాదుగాని, అన్వయరహితము. 'బొటంటి వెన్నడన' అని వుండవలయును.

దుర్జయాన్వయము నందు పెక్కుమంది రాజులు గిట్టిన తర్వాత, వినుత విరోధిమండలికుడైన వెన్నడు విష్ణువువలె, బొటంటివెన్నడన, పుట్టెనని, అతనికి ఘనుడు, జగద్వినుతుడు అయిన ఎఱ్ఱభూపతి పుట్టెనని పద్యార్థము.

"భావితకీర్తి నాథ [ని] పాండవపద్యము భీముపోయనం
గా విరియాల భీమని నృఘస్మరుడై [యు]దయించెవానికి ను
భావినుతుండు మండలిక భూషనుడె[ఱ్ఱ]నరేంద్రుడు[ద్ర]మ
శ్రీవినుతుండు బంధుజనసేవ్యుండు దానువయించె నున్నతిని'

ఇది రెండవ పద్యము. ఇందు 'ఉదయించె' అను సమాపక క్రియ రెండుసారులు కలదు. అనగా ఇద్దరికి ఇద్దరు పుట్టిరని అర్థము. కనుక పద్యమునందు సంబంధార్థక సర్వనామములుకూడ రెండు ఉండితీరవలయును. 'వానికిను' ఒక సంబంధార్థక సర్వనామము. రెండవ సంబంధార్థక సర్వనామమునకు స్థలము పద్యము నందు 'నాథ[నికి]' అనుచోట మాత్రమే కలదు. కనుక 'నాథ' లోని 'థ' కారము లేఖకదోషము. ఇట్టి వర్ణదోషములు శాసనము లందు కొల్లలు. అది 'త' కారము కావలసిన అవశ్యకము పద్యము లోని సమాపక క్రియాద్వయమునుబట్టి కలదు. 'భావితకీర్తి' అను ఎత్తుగడయును ఉదుపబలకము. కనుక 'నాథ[నికి]' అనుచోట 'నాతనికి' అని ఉండిలీరవలయును. అప్పుడు మొదటిపద్యములోని ఎఱ్ఱభూపతికి ఒకడు పుట్టెనని, అతనికి ఎఱ్ఱనరేంద్రుడు పుట్టెనని అర్థము వచ్చును. అట్లుకాదేని అర్థరహిత మగును. కనుక 'భావిత కీర్తి నాతనికి' అననది కవి పాఠము.

ఎఱ్ఱభూపతికి పుట్టినవాడు ఎవడు?

పద్యము నందు 'విరియాల భీమనృపఘస్మరుడై యుద యించె'నని కలదు. కనుక 'విరియాల భీమ + నృపఘస్మరుడై యుదయించె'నని పదచ్ఛేదము చేసి విరియాల భీముడని చెప్పుట కలదు. అట్లు చెప్పిన కవికి శబ్దజ్ఞానములేదని అపాదింపవలయును. ఎంత శాసనపద్యమైనను, కవి ఎంత అసమర్థుడైనను, సంస్కృత భీమ శబ్దమునకు తెనుగు ప్రథమైకవచన రూపమును ఉత్వాంతజ్ఞులు రెండును లేకుండ ప్రయోగించుట అసంభవము. అంతేకాదు. అట్లు చెప్పిన, అతనికి 'నృపఘస్మరుడై' అనునది విశేషణమగును. నృపఘస్మరుడన రాజులను సంహరించినవాడని మాత్రమే అర్థము. మురఘస్మర, పురఘస్మర శబ్దములు సుప్రసిద్ధములు. మురఘస్మరు డన మురాసురుని సంహరించిన విష్ణువని అర్థము. పురఘస్మరుడన త్రిపురాసురులను సంహరించిన శివుడని అర్థము. నృపఘస్మరుడన రాజులను సంహరించిన పరశురాముడని అర్థము. నృపఘస్మరుడన శత్రునృపఘస్మరుడనుటకు శత్రుశబ్దము సమాసఘటితము కావలయును. అధ్యాహారమనుట మిథ్యావాదము. కనుక

'విరియాలు + భీమనృపఘస్మరుడై' అని పదచ్ఛేదము చేసి తీరవలయును. ఇట్లు చేసిన కవికి శబ్దజ్ఞానములేని దోషము, పాఠకునికి అర్థజ్ఞానములేని దోషము అపాదితము కాదు. భీమనృపఘస్మరుడన భీమరాజును సంహరించినవాడని అర్థము. కటుకూరు శాసనము నందు 'వీరనరేంద్రఘస్మరే' అని కలదు. వీరనరేంద్రఘస్మరుడన వీరనరేంద్రుని సంహరించినవాడని అర్థము. అట్లు భీమరాజును సంహరించినవాడు భీమనృపఘస్మరుడు. అతడు విరియాలు. విరియాలు శబ్దము నామవాచకము. అంతేకాదు. అచ్చికశబ్దము. వరహాలువలె విరియాలు అనుపేరు అసంగతముకాదు. ఉపరి, మొదటి పద్యము నందు దుర్జయాన్వయము కలదు. అది దుర్జయుడు మూలపురుషుడైన అన్వయము. కన్నడభాగములోని మొదటిపద్యము నందు విరియాలాన్వయము కలదు. ఇది విరియాలు ముఖ్యపురుషుడైన అన్వయము. కనుక విరియాలు పేరు కావలయును. దుర్జయాన్వయము నందు విరియాలాన్వయము అంతర్భాగము కావచ్చును. భరతాన్వయము నందు కౌరవాన్వయము వలె, కకుత్స్థ వంశమునందు రఘువంశము వలె. ఉకారాంతాచ్ఛిక నామవాచకము సిద్ధసమాసము నందు అకారాంతమగుట అసంగతము కాదు. వ్యవహారప్రభావము. వరహాలాన్వయము వలె విరియాలాన్వయము.

ఇటు శాసనప్రతిబింబము నందు 'విరియాలు' అనుచోట 'విరియాల' అని కలదట. 'విరియాలభీమనృపఘస్మరుడు' అనునది ఏకసమాసము కావచ్చును గాని, అప్పుడు విరియాలభీమరాజును సంహరించినవాడు అని మాత్రమే అర్థము వచ్చును. అది కవికి అభిమతమైన ఎఱ్ఱభూపతికి పుట్టినవాని పేరు పద్యము నందు మఱొకటి ఉండును. కాని లేదు. ఉత్వదుజ్ఞులు రెంటికిలేని 'విరియాల' అను విడిశబ్దము కంటె, ఉత్వమైనను కల 'విరియాలు' అనుశబ్దము లోకసహజము. కనుక 'విరియాలు భీమనృపఘస్మరుడై' అనునది కవిపాఠము.

కనుక ఎఱ్ఱభూపతికి పుట్టినవాడు విరియాలు.

వెన్నుని కొడుకైన ఎఱ్ఱభూపతికి - భీమరాజును సంహరించిన విరియాలు పుట్టెనని, భీమనృపఘస్మరుడైన విరియాలుకు - మండలిక శ్రేష్ఠుడైన ఎఱ్ఱనరేంద్రుడు పుట్టెనని పద్యార్థము.

'అతణ్డని బొట్టుబేత వసుధాధిపుజేకొని వాని పై [రి] ను
ద్ధిరితమున జంపి యకొ్కరవిదేశమునందు ప్రతిష్ఠసేసి దే
త్తనెయురు పేరు పాడగలదాయము బిట్టబి గద్యనంబు న
ప్రతిముడు వాని[చే] మొగడుగిల్లియుపంద్రడునేలునప్పుడే,'

ఇది మూడవపద్యము. ఇందు 'తత్తనెయురుపేరు పొడగల దాయము బిట్టఅగద్యనంబు నప్రతిముడు' అను పంక్తి బహుదోషబంధురము. 'తత్తనెయురు' అనుచోట ప్రాసభంగము. 'పొడగల' అనుచోట గణభంగము. 'గద్యనంబు నప్రతిముడు' అనుచోట వ్యాకరణభంగము. ఇన్ని భంగములు కవికి అపాదించుట సాహసము. ఇవి కేవలము లేఖక దోషములు.

'తత్తనెయురు' అనుచోట 'తత్తతనయు' అని ఉండవలయును. 'తత్ + తత + నయు' అని పదచ్ఛేదము. తతనయుడన విస్తృతధర్ముడని అర్థము. తత్తతనయుడన ఆ విస్తృతధర్ముడని అర్థము. తత్తతనయ సమాసార్థము తెలియని లేఖకుడు అన్ని తకారములు కవిదోషమని తలచి ఒక 'త' కారమునకు స్వస్తి చెప్పవచ్చును. అథవా, అన్ని తకారములు చెక్కినట్లు అనుకొనవచ్చును. మొదటి పక్షమున ఒక అక్షరము తక్కువైనదని చివర 'రు' వర్ణమును చేర్చవచ్చును. వాపక్షమున తరువాతి 'పేరు' చెక్కఁబోయి 'పే' మఱచిపోయి 'రు' చెక్కి మఱల 'పేరు' చెక్కవచ్చును. 'న' కారమును 'నె' వర్ణముగ చెక్కవచ్చును. ఇట్టి వర్ణవ్యత్యయములు శాసనములందు బహుళము. కనుక 'తత్తతనయు' అనునది కవి పాఠము.

'పొడగల' అనుచోట 'పోడగల' అని దిద్దిన గణభంగము తప్పును గాని శబ్దభంగము కలుగును. 'పోడ' అను శబ్దముగాని 'పోడు' అను ధాతువుగాని కానరాదు. అది 'పొడ్మగల' అగును. మకార సంయుక్తమును లేఖకుడు మఱచిపోవుట లేదా శాసనము నందు చెఱిగిపోవుట సంభవము. 'పొడమ' అను శబ్దము 'పొడ్మ' అను రూపమును పొందును. 'భోరన విస్ఫులింగములు పొడ్మఁగ నుగ్రనిషంబుఁగక్కుచున్' అని ఎఱ్ఱన ప్రయోగము (178 ప., 6 ఆ., అర.ప.) పొడ్మఁగల అనగా కలుగఁబోవు అని అర్థము. కనుక 'పొడ్మఁగల అనునది కవిపాఠము.

ఇక 'గద్యనంబు నప్రతిముడు' - ఇది కవిపాఠమైన షష్ఠీ తత్పురుషసమాసము కావలయును. కానిచో, 'అప్రతిముడు' అను శబ్దమునకు 'నప్రతిముడు' అను సంధిగతరూపము రాదు. షష్ఠీ తత్పురుషసమాసమైనచో 'గద్యనంబు నప్రతిముడు' అనగా గద్యనము యొక్క సాటిలేనివాడని అర్థమువచ్చును. అప్పుడు 'గద్యనము' అనునది దేశనామముగాని గ్రామనామముగాని కావలయును. అట్టి నామధేయము కానరాదు. అంతేకాదు. అసలు 'గద్యనము' అను శబ్దము కానరాదు. అయినను గద్యాణశబ్దమునకు వికృతి అనవచ్చును. అనిన బంగారునాణెము యొక్క సాటిలేనివాడని అర్థము వచ్చును. అతనికి పూర్వము బంగారునాణెము లేకపోయిన అటుదు బంగారునాణెము యొక్క సాటిలేనివాడని అనవచ్చును. కాని అతనికి బహుపూర్వము బంగారు నాణెములు కలవు. అతనికి

బంగారునాణెమును ముద్రించు అధికారముగాని, అవకాశముగాని వచ్చినను, బంగారునాణెము యొక్క సాటిలేనివాడని అనవచ్చును. అట్లనుటకు 'గద్యనము' అను శబ్దమునకు ప్రయోగాంతరము కావలయును. అట్టిది మృగ్యము. అంతేకాదు. గద్యాణశబ్దమునకు గద్యనమను వికృతికూడ గగనము. బంగారునాణెముయొక్క సాటిలేనివాడను అర్థము కూడ కృతకము. కనుక 'గద్యనంబు నప్రతిముడు' అనునది షష్టీతత్పురుష సమాస మగుట కవి హృదయము కాదు. కావుపక్షమునందు 'అప్రతిముడు' అను శబ్దము నకు 'నప్రతిముడు' అను సందిగతరూపము వచ్చుటకు తత్పూర్వ పదము ద్రుతాంతము కావలయును. ద్రుతాంతము కావలయునన్న తత్పూర్వపదము క్రియాపదము కాని, ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణముగాని కావలయును. అట్లు కావలయునన్న 'గద్యనంబు' లోని 'నంబు' లేఖకదోషము కావలయును. 'నంబు' అనునది లేఖకదోషమైన 'నమ్ము' అనునది కవి పాఠమగును. శాసనము లందు మకారద్విత్వమును బిందుపూర్వక మువర్ణముగ చెక్కుట గలదు. అనగా 'నమ్మ' అనుపదమునకు 'నంము' అను లేఖనము. అట్లు చెక్కునపుడు మువర్ణమును బువర్ణముగ చెక్కుట కూడ సంభవము. కనుక 'నమ్ము' అను పదము కవిప్రయుక్తము కావచ్చును. అయిన తత్పూర్వపదము గద్య. అది సంస్కృత గద్యశబ్దము కాదు. అచ్చికగద్యశబ్దము. గద్దియ అను శబ్దము ప్రసిద్ధము. అది గద్దె, గద్య అను పాంతరూరములను చెందును. గద్దియ శబ్దమునకు సింహాసనమని, బంగారు నాణెమని అర్థములు కలవు. బంగారు నాణె మను అర్థము నందు గద్య అను రూపాంతరము తొమ్మిది, పది శతాబ్దుల శాసనములందు కలదు. కనుక సింహాసనమను అర్థము నందు కూడ గద్య అను రూపాంతరము ఆ కాలమునందు ఉండ వచ్చును. 'గద్యనమ్మ నప్రతిముడు' అనగా సింహాసనము నమ్మి నట్టి సాటిలేనివాడని అర్థము. సింహాసనాధీశ్వరునియెడల సాటిలేని విశ్వాసము కలవాడని తాత్పర్యము. ఇది వ్యాకరణదోషరహితమే గాక, ప్రకరణోచితము. కనుక 'గద్యనమ్మ నప్రతిముడు' అనునది కవిపాఠము.

మొత్తముమీద 'తత్తనెయుపేరు పొడగలవాయము బిట్టబు గద్యనంబు నప్రతిముడు' అను బహుదోషబంధురమైన పంక్తి 'తత్తనయుపేరు పొడ్మగలవాయము బిట్టబు గద్యనమ్ము నప్రతి ముడు' అను దోషక్లేశరహితమైన పంక్తి కవిపాఠము.

పద్యము నందు నాల్గవపాదము నందు 'నేలునప్పుడే' అని కలదు. ఇట శాసనప్రతిబింబము నందు నేలునిప్పుడే' అని కలదట. అట్లుకలదేని దోషము లేదు. క్లేశము లేదు. కనుక 'నేలునిప్పుడే' అనునది కవిపాఠము.

ఎఱ్ఱనరేంద్రుడు యుద్ధమునందు (అనిన్) బొట్టు బేతరాజును చేకొని (చేతబట్టి), బొట్టు బేతరాజు శత్రువును చంపి, 'అక్కొరవిదేశమునందు అనగా ఆ కొరవదేశము నందు – ఏ కొరవదేశము నందు ? బొట్టు బేతరాజు శత్రువును చంపిన కొరవదేశము నందు – తత్తతనయుపేరు అనగా ఆ విస్తృతధర్ముని పేరు – ఏ విస్తృత ధర్మునిపేరు ? చంపిన బేతరాజు శత్రువు పేరు కాదు. చేకొన్న బొట్టుబేతరాజు పేరు – ప్రతిష్ఠచేసి అనగా నిలబెట్టి, పొడమగల ఆపద (దాయము) మిక్కిలి (బిట్టు) నశింపగా (అఱన్) అనగా కలుగఁబోవు ఆపద పూర్తిగా పోగా భావిప్రమాదము లేకుండ – గద్యను – ఎవని గద్దెను ? చేకొన్న బొట్టు బేతరాజు గద్దియను – నమ్మినట్టి అనగా బొట్టు బేతరాజు నెడల విశ్వాసము కలిగియుండు నట్టి అప్రతిముడు – ఎవరు, అతడు – ఎఱ్ఱనరేంద్రుడు బొట్టు బేత రాజు వలన (వాని [చే]) మొగదుపల్లి, పండ్రిడు ఇప్పుడే పరిపాలించును.

మొగదుపల్లి వలె పండ్రడు గ్రామనామము.

ఇందు బొట్టు బేతరాజు శత్రువుపేరులేదు. అయినను 'చంపి యక్కొరవి దేశము నందు' అనునెడ అంతర్యమును, "అక్కొరవి దేశము నందు" అనునెడ నిర్దేశవాచక సర్వనామమును అరసిన, బొట్టు బేతరాజు శత్రువు కొరవి దేశము వాడని, బహుశః కొరవిదేశము పాలకుడని అర్థమగును.

భీమనృపపుత్రుడైన విరియాలు కొడుకు, మండలికశ్రేష్ఠుడు అయిన ఎఱ్ఱనరేంద్రుడు బొట్టు బేతరాజును చేతఁబట్టి, బొట్టు బేతరాజు శత్రువైన కొరవిదేశము పాలకుని చంపి, బొట్టు బేత రాజు పేరు కొరవిదేశమునందు నిలబెట్టి బొట్టు బేతరాజు నెడల విశ్వాసము కలిగియుండెనని పద్యార్థము.

'అటుదగునట్టి ఎఱనృపు (నం)గన నాముపసానియొక్క(ర్క)మె
ల్గరుడని బేతభూవిభుని గాకతి పల్లభు చిన్ననాని వా
బుగగ జేతబట్టె ఘనుబల్లవరాయనియోగిజొచ్చి బొ
మ్మకొరవిభు చక్రివర్తిగని కాకతినిల్పుడ గోడసేయదే'

ఇది నాల్గవ పద్యము. ఇందు 'ఎఱ్ఱనృపు' గణభంగము. 'ఎఱ్ఱనృపు' అని ఉండవలయును. 'మెల్గరుడని' – మెల్+గరుడని. 'మెల్' శబ్దభంగము. 'మేల్' అని ఉండవలయును. మేల్గరుడని అని సాధురూపము. 'మెఘరుడని' అని సంస్కరించుట అధిక ప్రయత్నము. కృతకము. అది కవికి అభిమతమైన, 'మైగరుడని' అని కవిపాఠ మగును. అది 'మయిగరుడని' అని లేఖకదోషమగుట సావకాశము. 'మెయరుడని' అని లేఖక దోషమగుట నిరవకాశము. కనుక "మేల్గరుడని" అనునది కవిపాఠము.

గరుడని బేతరాజు అనునెడ 'గరుడని' అను ఉత్వరహిత రూపము లేఖకదోషము కావలసిన అవశ్యకము లేదు. నన్నయ భారతము తాళపత్త్రగ్రంథము లందు కొన్నిట 'గరుడని' అని ఉత్వరహితరూపము కలదు. అంతేకాదు, 'గరుడఁడు' అను ఉత్వ రహితరూపము నన్నయకాలము నందలి శాసనము నందును కలదు. ఉపరి, ఉత్వసహితమైన 'గరుడుడు' అను రూపముకంటె, ఉత్వ రహితమైన 'గరుడడు' అను రూపము శ్రుతిహితము. శ్రుతి హితత్వమును వ్యాకరణమునకు విషయము. కనుక రంగడు, లింగడు వలె గరుడడు అపవాదము కావచ్చును.

గరుడని బేతరాజు అనగా గరుడని కొడుకు బేతరాజు అని ఒక అర్థము వచ్చును. గరుడనికి సంబంధించిన బేతరాజు అని మఱొక అర్థము వచ్చును. గరుడలాంఛనము కల బేతరాజు అని కూడ అర్థము వచ్చును. గరుడలాంఛనము కల బేతరాజు గరుడ బేతరాజు అగును. గరుడని బేతరాజు అని కూడ అగును.

చొచ్చు ధాతువునకు ఆశ్రయించు అను అర్థము కలదు. "భయస్థుడై నినున్ జొచ్చినన్ వనజాక్షున్ శరణంబు వేఁడినన్" అని తిక్కన ప్రయోగము (277వ, 2ఆ, ద్రో. ప.) "ఘనుబల్లవ రాయనియోగి జొచ్చి" అనగా "ఘనుబల్లవరాయనియోగి నాశ్ర యించి" అని అర్థము. "ఘను బల్లవరాయనియోగి" అను పంక్తిని "ఘనున్ + పల్లవరాయనియోగి" అను పదచ్ఛేదము అర్థాను కూలమేగాని చరిత్రానుకూలముకాదు. అది ముందు విపరీతము. కనుక "బల్లవ" శబ్దము "బల్లహ" శబ్దమునకు లేఖకదోషము కావలయును. అయిన "ఘనున్ + బల్లహరాయనియోగి" అను పదచ్ఛేదము అర్థానుకూలమేగాక చరిత్రానుకూలము. కనుక "ఘను బల్లహరాయనియోగి" అనునది కవి పాఠము.

పద్యమునందు మూడు వాక్యములు కలవు. 1. ఎఱ్ఱనృపుని భార్య కామ్యవసానియొక్క మేలు అవదగును. 2. తాను కాకతి వల్లభుడు, చిన్నవాడును అయిన గరుడని బేతరాజును చేఁబట్టెను. 3. (తాను) ఘనుడైన బల్లహరాయనియోగిని ఆశ్రయించి, చక్రవర్తి అయిన భాస్కరవిభుని దర్శించి కాకతిని నిలుపుట కోటిసేయును.

ఇందు రెండుమూడు వాక్యములలోని తాను ఎవరు ?

బల్లహరాయనియోగిని ఆశ్రయించునది, చక్రవర్తి అయిన భాస్కరవిభుని దర్శించునది ఆ కాలము నందు స్త్రీ కాదు. కనుక "తాను" కామవసాని కాదు.

మఱి, "ఎఱ్ఱనృపునంగన కామవసాని" అను పంక్తిలోని "ఎఱ్ఱనృపు"నికి "తాను" ఏకదేశముగ అన్వయించునది కాదు. ఇక నాల్గవపద్యములోని "తాను" అను సర్వనామము, మూడవపద్యము లోని 'అతడు' అను సర్వనామమునకు మాత్రమే అన్వయించునది. మూడవపద్యములోని 'అతడు' అను సర్వనామము, రెండవ పద్యములోని "ఎఱ్ఱనరేంద్రుడు" అను నామవాచకమునకు మాత్రమే అన్వయించునది. కనుక రెండు, మూడు, నాలుగ పద్యములు కలిసి ఒక ప్రకరణము. మూడు, నాలుగు పద్యములు కలిసి ముఖ్యప్రకరణము.

ఎఱ్ఱనరేంద్రుడు కాకతివల్లభుడు, చిన్నవాడును అయిన గరుడని బేతరాజును చేఁబట్టి, బల్లహరాయనియోగిని ఆశ్రయించి చక్రవర్తి అయిన భాస్కరవిభుని దర్శించి - అనగా చక్రవర్తి సహకారమును పొంది - కాకతిని నిలుపుట కామవసానియొక్క మేలు. అనగా ఎఱ్ఱనరేంద్రుని అంత ఘనకార్యమునకు అతని భార్య కామవసాని కారణమని అర్థము.

భార్య కామివ్వసాని కారణముగ ఎఱ్ఱనరేంద్రుడు కాకతి వల్లభుడు, చిన్నవాడును అయిన గరుడని బేతరాజును చేఁబట్టి, బల్లహరాయనియోగిని ఆశ్రయించి చక్రవర్తి అయిన భాస్కర విభుని దర్శించి, అతని సహకారమునంది కాకతివంశము నిలబెట్టె నని వ్యాఖ్యార్థము.

ఎఱ్ఱనరేంద్రుడు బొట్టుబేతరాజును చేఁబట్టి, బొట్టుబేతరాజు శత్రువును చంపిన కొరవిదేశము నందు బొట్టుబేతరాజు పేరు నిలఁబెట్టెనను పూర్వవ్యాఖ్యార్థమునకు, ఎఱ్ఱనరేంద్రుడు కాకతి వల్లభుడు, చిన్నవాడును అయిన గరుడని బేతరాజును చేఁబట్టి, బల్లహరాయనియోగిని ఆశ్రయించి, చక్రవర్తి అయిన భాస్కర విభుని దర్శించి, అతని సహకారము నంది కాకతివంశమును నిలఁబెట్టెనను ఉత్తరవ్యాఖ్యార్థమునకును నడుమ, "ఎఱ్ఱనరేంద్రుని భార్య కామవసానియొక్క మేలు" దేహళీదీపన్యాయముగ కలదు. అంతేకాదు. పూర్వోత్తరపదములైన మూడునాలుగు పద్యములు కలిసి ముఖ్యప్రకరణము. ఉపరి, మూడవపద్యము నందు శత్రు సంహారము కలదు. నాల్గవపద్యమునందు అన్యసహకారము కలదు. మొత్తముమీద కారణము ఒక్క కామవసాని కార్యకర్త ఒక్క ఎఱ్ఱనరేంద్రుడు. కార్యసిద్ధుడును ఒక్క బేతరాజు. కాని బేతరాజునకు మూడవపద్యము నందు 'బొట్టు' అను విశేషణము కలదు. నాల్గవ పద్యమునందు "గరుడని" అను విశేషణము కలదు. రెండు విశేషణములు ఒక్క వ్యక్తికి ఉండుట అసంభవము కాదు. ముక్కు తిమ్మన, నంది తిమ్మనవలె. బొట్టు బేతరాజు, గరుడని బేతరాజు ఒక్క వ్యక్తి కానిచో, అన్యసహకారములేని శత్రుసంహారము మూడవపద్యము నందు అసహాయశూర లక్షణమే కాని, శత్రుసంహారములేని అన్యసహకారము నాల్గవపద్యము

నందు వ్యర్థము. పూర్వపద్యములోని యుద్ధమునకు ఉత్తరపద్యము లోని ప్రయత్నము సంబద్ధము. కనుక పూర్వోత్తరపద్యములైన మూడునాలుగు పద్యములు కలిసి ఏకప్రకరణము.

భార్య కామవ్వసాని కారణముగ, ఎఱ్ఱనరేంద్రుడు కాకతి వల్లభుడు, చిన్నవాడును అయిన బొట్టు ఉరపు గరుడని బేతరాజును చేతఁబట్టి, బల్లహరాయనియోగిని ఆశ్రయించి, చక్రవర్తి అయిన భాస్కరుని దర్శించి, అతని సహకారమును పొంది, బేతరాజు శత్రువైన కొరవిదేశము పాలకుని చంపి, బేతరాజు పేరు కొరవి దేశము నందు నిలిపి, కాకతి వంశమును నిలఁబెట్టెనని ప్రాకరణి కార్థము.

కారకకాలుడై పడసె గాడయనాయకు జంపి సూరడ
వ్వేలుపుగొండ రవ్వన్రిపు వేలుపుగొండననిల్పి వానిచే
మేలుగ మూడముప్పయిని మేలుగ నేరెడు బోటిపాడుసం
మేలుగబేకు(కు్క)మావిడ్లు మేలుగ రెండెయరాజు సంగడ్లు

ఇది అయిదవపద్యము. ఇందు "కారక" అనుచోట ప్రాస భంగము. లేఖక దోషము. 'కాలక' అనునది కవిపాఠము. 'రవ్వన్రిపు' - రవ్వనృపు, 'బేకు(కు్క)' - బెక్కు; మావిడ్లు- మామిడులు; సంగడ్లు - సంగడుల్ అని స్పష్టము.

మూడు నాలుగు పాదము లందు పడసినవానికెల్ల "మేలుగ" పొకట్టుమాట.

మూడముప్పయనికి యథాతథముగ అర్థము దురవగాహము. ముప్పది సంఖ్య ముప్పయి. కనుక మూడ అనునది మూడు కావలయును. మూడు ముప్పయి అనగా ముప్పైమూడు. ఇట్టి సంఖ్యానిర్దేశము ఇతర శాసనము లందును కలదు. అది గ్రామ విషయమని ఒక శాసనమునందు కలదు. కావ్యమునందును కలదు. అవి ప్రసిద్ధములు.

నేరెడు బోటిపాడు అనగా నేరేడుచెట్లు కల బోటిపాడు ప్రాంతము.

రెండెయరాజు సంగడులన రెండెయరాజు దోనెలు. దోనె అనగా రెండు తాటిబొందలు కలిపి కట్టిన, ప్రవాహమును దాటించు ప్రయాణసాధనము. మామిడిచెట్లు,నేరేడుచెట్లు ఏటి అవల కలవేని సంగడులు కావలయును. కనుక రెండెయరాజు సంగడుల సొంతదారు.

సూరడు కాడయనాయకుని చంపి, వేలుపుగొండ రవ్వ రాజును వేలుపు గొండలోనే నిలిపి, రవ్వరాజు వలన ముప్పయి మూడు, నేరెడు బోటిపాడు, పెక్కు మామిడులు, రెండెయరాజు సంగడులు పడసెనని పద్యార్థము.

మొదటి నాలుగుపద్యములందు వెన్ననికొడుకు ఎఱ్ఱభూపతి, ఎఱ్ఱభూపతి కొడుకు విరియాలు, విరియాలు కొడుకు ఎఱ్ఱనరేంద్రుడు అని వంశక్రమము కలదు. అయిదవ పద్యమునందు అట్టిదిలేదు.

సూరడు ఎవడు ?

నాల్గవ పద్యములోని భాస్కరుడు, అయిదవ పద్యములోని సూరడు అని ఒక అభిప్రాయము. సూర, భాస్కర శబ్దములు పర్యాయపదములు కనుక భాస్కరుడు, సూరడు కావచ్చును. కాని,

నాల్గవపద్యములోని భాస్కరుడు చక్రవర్తి. అయిదవ పద్యములోని సూరడును చక్రవర్తి అనుటకు పద్యము నందు ఆధారము లేదు. అంతేకాదు. శాసనానుబంధములోని తెలుగు పద్యములు దుర్జయాన్వయమునకు సంబంధించినవి. ప్రధాన శాసనములోని కన్నడ పద్యములు విరియాలాన్వయమునకు సంబంధించినవి. కనుక సూరడు దుర్జయాన్వయాంతర్గత విరియా లాన్వయమునకు సంబంధించినవాడు కావలయును. అతడు చక్రవర్తికాడు. మండలికుడు మాత్రమే అగును. అయిదవపద్యము నందు వంశక్రమము లేకపోయినను, నాలుగు పద్యములలోని వంశక్రమమును అయిదవ పద్యము మూదలించును.

కనుక, నాల్గవపద్యములోని ఎఱ్ఱనరేంద్రునికి అయిదవ పద్యములోని సూరడు కొడుకు. అతడు కన్నడ పద్యములలోని సూరడును అగును. కటుకూరు శాసనములోని సూరడును అగును. నామసాదృశ్యము మాత్రమే కాదు, ప్రకరణసామర్థ్యము కలదు. అంతేకాదు. కాలానుకూల్యము కలదు. ఉపరి నిష్పాదకము.

తెలుగు పద్యములలోని వంశవృక్ష మిది -

వెన్నడు
|
ఎఱ్ఱడు - I
|
విరియాలు
|
ఎఱ్ఱడు - II
|
సూరడు

కన్నడ పద్యములలోని వంశవృక్ష మిది -

- సూరడు
  - బేతడు
    - మల్లడు

తెలుగు, కన్నడ పద్యములలోని వంశవృక్ష మిది -

- వెన్నడు
  - ఎఱ్ఱడు - I
    - విరియాలు
      - ఎఱ్ఱడు - II
        - సూరడు
          - బేతడు
            - మల్లడు

కటుకూరు శాసనములోని వంశవృక్ష మిది -

- సూరడు
  - ప్రోలడు
  - మల్లడు
  - బేతడు
    - సూరడు
    - మల్లడు
      - అన్నయ
        - మైలాంబ
    - ప్రోలడు
    - కొమ్మడు

గూడూరు, కటుకూరు శాసనములలోని వంశవృక్ష మిది -

- వెన్నడు
  - ఎఱ్ఱడు - I
    - విరియాలు
      - ఎఱ్ఱడు - II
        - సూరడు
          - ప్రోలడు
          - మల్లడు
          - బేతడు
            - సూరడు
            - మల్లడు
              - అన్నయ
                - మైలాంబ
            - ప్రోలడు
            - కొమ్మడు

ఇందు కటుకూరు శాసనములోని మైలాంబ శాసనకాలము 1205వ సంవత్సరము. గూడూరు ప్రధాన శాసనములోని మల్లని శాసనకాలము 1124వ సంవత్సరము. మైలాంబ తాత మల్లడు, గూడూరు ప్రధాన శాసనములోని మల్లడు ఒకడైన, తాత మనుమ రాలు మధ్యకాలము 1205 - 1124=81 సంవత్సరములు. ఇది అసాధారణమైనను అసహజముకాదు. కనుక గూడూరు ప్రధాన శాసనములోని సూరడు, కటుకూరు శాసనములోని సూరడు ఒకడే కావచ్చును. గూడూరు శాసనానుబంధములోని సూరడును అతడే కావచ్చును. అది ముందు వివరింతును.

పయి విచారణకు ఫలితాంశములివి -

1. మొదటి ఎఱ్ఱని కొడుకైన విరియాలు భీమరాజును సంహరించుట.

2. విరియాలు కొడుకైన రెండవ ఎఱ్ఱడు, అతని భార్య కామవ్వసాని కారణముగ కాకతి వల్లభుడు, చిన్నవాడును అయిన బొట్టు ఉరపు గరుడ బేతరాజును చేతఁబట్టి, బల్లహరాయనియోగిని అశ్రయించి, చక్రవర్తి అయిన భాస్కర విభుని దర్శించి, అతని సహకారము నంది, బేతరాజు శత్రువైన కొరవి దేశము పాలకుని చంపి, కొరవిదేశము నందు బేతరాజు పేరు నిలిపి, కాకతివంశమును నిలఁబెట్టుట.

3. రెండవ ఎఱ్ఱని కొడుకైన సూరడు, కాడయనాయకుని చంపి, వేలుపుగొండ రవ్వరాజును వేలుపు గొండలోనే నిలఁబెట్టుట.

ఇందు విరియాలు సంహరించిన భీమరాజు, సూరడు సంహరించిన కాడయ నాయకుడు, నిలఁబెట్టిన రవ్వరాజు - వారి వలెనే - ఇరుగుపొరుగు మండలికులు అగుదురు. అందు భీమరాజు ప్రబలుడు, కాడయ నాయకుడు ప్రముఖుడు అగుదురు.

చిన్నవాడు, కాకతి వల్లభుడును అయిన గరుడని బేతరాజు ఉరపుబొట్టు బేతరాజు కాకతీయ రాజైన మొదటి బేతరాజే అగును.

కాకతీయ రాజైన మొదటి బేతరాజునకు గరుడ బేతరాజు అను వ్యవహారము కలదనుటకు శాసనాంతర ప్రమాణము కలదు. బొట్టు బేతరాజు అను వ్యవహారమును కలదనుటకు శాసనాంతర ప్రమాణము కానరాదు. కలదనుటకు మాత్రమే కాదు, లేదనుటకు గూడ శాసనాంతర ప్రమాణము కానరాదు. అంతేకాదు. మొదటి బేతరాజునకు సమకాలము నందుగాని, సమీప పూర్వకాలము నందు

గాని మఱొక బొట్టుబేతరాజు కలడనుటకునైన శాసనాంతర ప్రమాణము కానరాదు. కానవచ్చిన ముదిగొండచాళుక్య రాజులలోని బొట్టు బేతరాజునుబట్టి, కాకతీయరాజైన మొదటి బేతరాజునకు సమకాలము నందు మఱొక ముదిగొండ చాళుక్య రాజైన బొట్టు బేతరాజు ఉండుననుట ఊహామాత్ర శరణ్యము. అంతేకాదు. బొట్టు బేతరాజు గరుడని బేతరాజు ఒక్క-వ్యక్తి అని శాసనప్రకరణార్థము. ఉపరి, రెండవ ఎఱ్ఱడు చంపిన బొట్టు బేతరాజు శత్రువు కొరవి దేశము పాలకుడని శాసన పద్యార్థము. శాసన పద్యార్థము చరిత్ర అగును గాని, ఊహాగానము శాసన పద్యార్థము కాదు. కాకతీయ రాజైన మొదటి బేతరాజు అనుమకొండ విషయమునకు అధిపతి. అనుమకొండ విషయమునకు ప్రక్కను, తూర్పు దిక్కున, కొరవిదేశము కలదు. కాకతీయ రాజైన మొదటి బేతరాజు కాలమునందును కొరవి దేశము పాలకుడు ముదిగొండ చాళుక్యరాజులు. కనుక, అనుమకొండ విషయాధిపతి అయిన, కాకతీయ రాజైన మొదటి బేతరాజు శత్రువు, కొరవి దేశము పాలకుడైన ముదిగొండ చాళుక్యరాజు కావలయును.

కాకతీయ రాజైన మొదటి బేతరాజు కాలము 1000-1052.

రెండవ ఎఱ్ఱడు చేకొన్న, చేతఁబట్టిన సమయమునకు బొట్టు ఉరపు గరుడని బేతరాజు చిన్నవాడు మాత్రమే గాక, కాకతివల్లభుడు కూడ. కనుక రెండవ ఎఱ్ఱడు కామవ్వసాని కారణముగ మొదటి బేతరాజును చేకొన్న, చేతఁబట్టిన కాలము స్థూలముగ 1005వ సంవత్సరము.

తెలంగాణములోని మండలికులకు సంబంధించిన చక్రవర్తులు పశ్చిమ చాళుక్య రాజులు. కనుక మండలిక శ్రేష్ఠుడైన ఎఱ్ఱనరేంద్రుడు దర్శించిన, సహకారము నందిన, చక్రవర్తి అయిన భాస్కరవిభుడు పశ్చిమ చాళుక్యరాజు కావలయును. కాని, మొదటి బేతరాజుకాలము నందు భాస్కరవిభుడను పేరు కల, లేదా భాస్కరుడను పేరు కల పశ్చిమ చాళుక్యరాజు కానరాడు. అప్పటి పశ్చిమచాళుక్యరాజు అయిదవ విక్రమాదిత్యుడు నిజమునకు విక్రమాదిత్యుడు అనునది పేరుకాదు. బిరుదు. కనుక అయిదవ విక్రమాదిత్యుని అసలుపేరు భాస్కరుడు కావచ్చును. అథవా, విక్రమాదిత్య పదబంధములోని ఆదిత్య శబ్దమునకు పర్యాయ పదమైన భాస్కర శబ్దము నామైకదేశ గ్రహణ న్యాయమున కవి ప్రయోగము కావచ్చును. కనుకమండలిక శ్రేష్ఠుడైన రెండవఎఱ్ఱడు దర్శించిన, సహకారమునందిన, చక్రవర్తి అయిన భాస్కరవిభుడు పశ్చిమ చాళుక్యరాజైన అయిదవ విక్రమాదిత్యుడే అగును.

మఱి ఎఱ్ఱనరేంద్రుడు చక్రవర్తి అయిన భాస్కరవిభుని దర్శించుటకు ముందు ఒక రాయనియోగిని ఆశ్రయించినట్లు శాసన పద్యము నందు కలదు. రాయనియోగి అనగా రాజోద్యోగి. అతడు పల్లవ రాజోద్యోగి అగుట దుర్ఘటము. ఓరుగల్లు మండలములోని మండలికులకు, బళ్ళారి మండలములోని నోలంబవాడి పల్లవులకు కాలానుకూల్యము కలదుగాని, స్థలానుకూల్యములేదు. అంతేకాదు. పరస్పర సంబంధము కానరాదు. ఉపరి, రాయనియోగిని ఆశ్రయించి, చక్రవర్తిని దర్శించినట్లు శాసనపద్యమునందు కలదు. అనగా ఆశ్రయించిన రాజోద్యోగి ద్వారా చక్రవర్తిని దర్శించెనని అర్థము. చక్రవర్తి పశ్చిమచాళుక్య రాజు కావున, రాయనియోగి పశ్చిమ చాళుక్య రాజోద్యోగి కావలయును. అతడు అయిదవ విక్రమాదిత్యుని మంత్రిగాని సేనాధిపతిగాని అగును. పశ్చిమ చాళుక్య రాజోద్యోగి 'పల్లవరాయనియోగి' కాడు.' "బల్లహరాయనియోగి" అగును. వల్లభరాజశబ్దమునకు బల్లహరాయశబ్దము వికృతి. బల్లహరాయులు, వల్లభరాజులు పశ్చిమ చాళుక్య రాజులు అగుదురు.

తెలుగు పద్యములలోని రెండవ ఎఱ్ఱని కొడుకు సూరడు, కన్నడ పద్యములలోని మల్లని తాత సూరడు ఒకడైన, మల్లనికి రెండవ ఎఱ్ఱనికి నడుమ మూడు తరములు కలవు. మల్లని శాసన కాలము 1124వ సంవత్సరము. రెండవ ఎఱ్ఱని ప్రాభవకాలము 1005వ సంవత్సరము. తన్మధ్యకాలము 1124 - 1005 = 119 సంవత్సరములు. తరమునకు 40 సంవత్సరముల అంతరము, అసాధారణమైనను అసహజముకాదు. కనుక తెలుగు పద్యములలోని రెండవ ఎఱ్ఱనికొడుకు సూరడు, కన్నడ పద్యములలోని మల్లనితాత సూరడు ఒకడే కావచ్చును. అయిన, సూరడు కాడయనాయకుని చంపి, రవ్వరాజును కాపాడిన కాలము స్థూలముగ 1045వ సంవత్సరము.

1005వ సంవత్సరము నాటి చారిత్రిక సంఘటన, 045వ సంవత్సరము నాటి చారిత్రిక సంఘటన 1124వ సంవత్సరము నాటి విరియాలమల్లని గూడూరు సానుబంధశాసనమునందు కలవు. 1124వ సంవత్సరమునాటి చారిత్రిక సంఘటన కన్నడభాగము నందు కలదు. 1005, 1045 సంవత్సరములనాటి చారిత్రిక సంఘటనలు తెలుగు భాగమునందు కలవు. తెలుగు భాగము చివఱ లేఖకుని పేరు కలదు. అంతేకాదు. కన్నడభాగము లిపి, తెలుగు భాగము లిపి, సమకాలికమని లిపిజ్ఞుల అభిప్రాయము. కనుక, కన్నడభాగముతోపాటు తెలుగుభాగము లేఖనకాలమును 1124వ సంవత్సరమే. రచనాకాలమును 1124వ సంవత్సరమే అనుటకు భాషాభేదము బాధకము. ఆకృతిభేదము అటంకము. పౌర్వాపర్య విపర్యయము ప్రతిబంధకము.

విరియాలాన్వయములోని మల్లని, అతని తాతతండ్రుల విషయము కన్నడ భాషలో కలదు. విరియాలాన్వయమునకు మూలమైన దుర్జయాన్వయములోని వెన్నడు మొదలు సూరడు వఱకు అందఱి విషయము తెలుగు భాషలో కలదు. అంతేకాదు. కన్నడ భాగము శాసనము వలెనే కలదు. తెలుగుభాగము శాసనమువలె లేదు. కన్నడ శాసనమునకు తెలుగుభాగము అనుబంధమువలె కలదు. ఉపరి విరియాలాన్వయ విషయమునందు, తన్మూలమైన దుర్జయాన్వయ విషయము తర్వాతను కలదు. తన విషయమును కన్నడభాషలోను, తాత ముత్తాతల విషయము తెలుగుభాషలోను చెప్పించవలసిన అవశ్యకము మల్లనికిలేదు. ఉన్నచో, తాతముత్తాతల విషయమును కన్నడ భాషలోనే, ప్రధాన శాసనమునందే, ముందే చెప్పించుట సంభవము. చెప్పించుటకాక, చెక్కించుట మాత్రమే మల్లని అభీష్టమైన, తాతముత్తాతల విషయము తెలుగు భాషలోను, అనుబంధములోను తర్వాతను ఉండుట సంభవము. కనుక విరియాలమల్లని గూడూరు సానుబంధ శాసనములోని తెలుగు భాగము విరియాలమల్లడు చెప్పించినదికాదు. చెక్కించినది మాత్రమే. అదిపూర్వసంఘటనా పునఃప్రతిష్ఠకాదు. పూర్వపద్యముల పునరుద్ధరణము. తాతముత్తాతలకు సంబంధించిన పద్యరత్నములు తన ఇంటిలోనే ఉండును. అవి శాశ్వతముగ ఇనాలోకయోగము లేని పేటికాంతర్గత రత్నములు కాకుండ, విరియాలమల్లడు మల్లేశ్వరస్వామిని ప్రతిష్ఠించి, వావిని తటాకమును త్రవ్వించి, తదర్థమై తాను శాసనమును ప్రకటించునపుడు తాతముత్తాతల పద్య రత్నములను శాసన ఫలకస్థగితము చేయించుట సహజము. అవి ప్రధానశాసనమునకు అనుబంధముగుట అంతకంటె సహజము. కనుక విరియాలమల్లని గూడూరు సానుబంధశాసనములోని తెలుగు పద్యముల రచనాకాలము, లేఖనకాలమైన1124వసంవత్సరముకాదు.

శాసనానుబంధములోని తెలుగు పద్యముల తీరుతెన్నులు ద్వివిధము. మొదటి నాలుగు పద్యములతీరు ఒకవిధము. అయిదవ పద్యము తెన్ను మఱొక విధము. మొదటి నాలుగు పద్యము లందు వంశక్రమము కలదు. పరస్పర సంబంధము కలదు. అది వంశావళీ వైఖరి. అయిదవ పద్యము నందు వంశక్రమము వాచ్యముగ లేదు. పరస్పర సంబంధము ప్రస్ఫుటముగ లేదు. ఇది చాటుపద్య సరణి. వంశావళి యందు కాకతివంశ ప్రతిష్ఠాపన విశేషము కలదు. అది ప్రముఖ సంఘటన. అంతేకాదు. ఎఱ్ఱనరేంద్రుడు బేతరాజు వలన 'మొగడు పల్లియు బండడు నేలునిప్పుడే' అని శాసన ప్రతిబింబము కలదు. కనుక అప్పుడే చెప్పిన పద్య మది. అది కల, పరస్పర సంబంధము కల పద్యచతుష్టయమును అప్పుడు చెప్పినదే అగును. కనుక వంశావళివైఖరి కల ప్రథమ పద్యచతుష్టయ రచనాకాలము కాకతివంశ ప్రతిష్ఠాపనకాలమే. ఆకాలముస్థూలముగ 1005వ సంవత్సరము. చాటుపద్యసరణి కల అయిదవ పద్యము రచనాకాలము రవ్వరాజ ప్రతిష్ఠాపన కాలమే. ఈ కాలము స్థూలముగ 1045వ సంవత్సరము. కనుక విరియాల మల్లని గూడూరు సానుబంధ శాసనములోని మొదటి నాలుగు పద్యముల రచనా కాలము 1005 వ సంవత్సరము. అయిదవ పద్యము రచనాకాలము 1045వ సంవత్సరము.

1005వ సంవత్సరము నాటి పద్యములను 1124వ సంవత్సరము నందు చెక్కించుట వలన లేఖకదోషములు మిక్కుటమయినవి. అవి పరిష్కరించుకొనుట అవశ్య కర్తవ్యము.

పరిష్కృత శాసన పాఠము -

'అనుపమ దుర్జయాన్వయ సుధాబ్ధి ననేకులు రాజనందనుల్
పనినఁ బొఱంటి వెన్నఁడన సంభవుఁడయ్యె నతి ప్రసిద్ధుడై
వినుత విరోధిమండలిక వెన్నఁడువెన్నడు వోలె వానికిన్
ఘనుఁడగు నెఱ్ఱభూపతి జగద్వినుతుండుదయించెఁ

గీర్తితోన్ - 1

భావితకీర్తి నాతనికిఁ బాండవమధ్యము భీముడో యనం
గా విరియాలు భీమనృపు ఘస్మరుఁడై యుదయించె వానికిన్
భూవినుతుండు మండలిక భూషణుఁ డెఱ్ఱనరేంద్రుఁ డుత్తమ
శ్రీవినుతుండు బందుజనసేవ్యుఁడు దానుదయించె

నున్నతిన్ - 2

అతఁడని బొట్టు బేతవసుధాధిపుఁజేకొని వాని వైరి ను
ద్ధతముగఁ జంపి యక్కొఱవిదేశము నందుఁ బ్రతిష్ఠసేసి త
త్తనయుపేరు పొద్మఁగఁ దాయము బిట్టజ గద్యనమ్ము న
ప్రతిముఁడు వానిచే మొగడుపల్లియుఁ బండ్రిడునేలు


నిప్పుడే - 3

అరుదగునట్టి యెఱ్ఱనృపు నంగన గామనసాని యొక్క మే
ల్గపడని బేతభూవిభుఁ గాకతివల్లభుఁ జిన్నవానిఁ దాఁ
బరగఁగఁజేతఁబట్టె ఘను బల్లహరాయవియోగిఁ జొచ్చి భా
స్కరవిభుఁ జక్రవర్తిఁగని కాకతి నిల్పుట కోటిసేయదే - 4

కాలకకాలుఁడై పడకెఁ గాడయ నాయకుఁజంపి సూరఁడ
వ్వేలుపుఁగొండ రవ్వనృపు వేలుపుఁగొండన నిల్పి వానిచే
మేలుగ మూఁడుముప్పయిని మేలుగ నేరెడు బోటిపాడునుం
మేలుగఁ బెక్క మామిడులు మేలుగ రెండెయరాజు

సంగడుల్ - 5

ఇది పద్యములకు ప్రాణములైన ఛందో వాక్యరచనాదులను బట్టి, చరిత్రనుబట్టి, ఇదమిత్థమగు ఇప్పటి స్వరూపము. దేశ చరిత్రకు మాత్రమే గాక, వాఙ్మయ చరిత్రకును వాంఛనీయమైన విరియాల మల్లని గూడూరు సానుబంధశాసనములోని పద్యములను పరిష్కరించుటకు ఆధారము శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రిగారి 'గూడూరు శాసన పునర్విమర్శ' (భారతి, డిశంబరు 1981). అడిగిన వెంటనే శాసన ప్రతిబింబమును మఱల చూచి పాఠభేదములను తెలిపినవారు డాక్టర్ పి. సోమసుందరరావు గారు. ఉభయులకు కృతజ్ఞతలు.



పుప్పొడి చినుకులు

"సాంధ్యశ్రీ"

మౌనం నిద్ర కాదు ....

విప్లవ తుఫానుల్ని ఎక్కుపెట్టిన గాలి
మౌనాన్ని ఆశ్రయించినంతగా
మాటను ఆశ్రయించదు ....

మాటకు ముందు మౌనంలోని యుగ సంకేతం
బీజ రూపమైన మనో మూలిక....
చెట్లను చిగురు తొడుగుల్లో
చిద్విలాస ఋతు సంబంధిని చేసేది
మేఘాల్లో పొడికి
తొలకరి పూల పుప్పొడి చినుకుల్ని పూసేది
నిద్రా ముద్ర కాదు
మౌనసముద్ర సమాధి పరాకాష్ఠ ....

జన్మ వీర్య పతనం కాదు . .
పరాచీన ప్రతీచీన ప్రాణాలకు
పిండదశలోనే నమస్కరించే
అఖండావిర్భావం . .

ఆవిష్కరించు అంతరంగాన్ని మౌనంగా
సమీచీనంగా . . .

మృతి తరంగాల్లో తేలుతూ
సాకారంగా తపసుకు సిద్ధమైన
జీవన బీజం చేతులు జోడిస్తుంది ....

మౌన శిఖరాగ్ర బిందువులో
విస్తరించుకొని శతాబ్దాల శబ్దాల సన్నిధిగా
ఆదిమానవుని వారసులకు అందించబడిన నిధి

అందుకున్నవాడు ఋషి - (ముని)
అందుతున్నవాడు మనిషి ....

మృతికి సాకారం స్మృతి
ఇంద్రియాలు ఉపాసించే ధ్యాన మానస-సరోవరంలో
రెక్కలార్చుకుంటున్న హంస

ఆదినుండి స్మృతి పథాలవైపే దృష్టి సారించింది
మౌనంగా ....

మౌనం నిద్రకాదు
నిశ్చల సమాధి సముద్ర పరాకాష్ఠ....

2

క్రమం తప్పని ఋతువులు బానిసలు కాదు
కాలం చెక్కిన శిల్పాలు
భాషకు లొంగని బలవత్తరమైన కంఠాలు
యుగాల చరిత్రలో కాలానికి పుప్పొడి పారాణి పెట్టి
పునీతమైన నాగరికతకు
సురభిళా లద్దిన విశ్వజనీన దృక్కులు
విశ్వ శ్రేయోభా వరుక్కులు ....

ఋతువుల్ని బతుకుల్లో అతికించుకొని
బ్రతికిన క్షణాన్ని పువ్వుగా మలచుకొని
దేహాన్ని వన జ్వాలగా
దేహాంతం తపస్సిద్ధిగా
సమీకరించుకోనున్న అవకాశానికి నిద్ర దరిద్రశాపం....

ఒళ్ళంతా కళ్ళు చేసుకొని
పూలకలల్ని పంచటం తప్ప
చెట్లు
నిద్రించటం ఎరగవు ....

పరిణాహ మెంతగానో పెంచుకున్న చెట్లు
బీజంలో ఒదిగిన మహాచైతన్యం
ఈ నిత్య చైతన్య కణం
క్షణాన్ని నిద్రపోనివ్వని కాండాత్కాండ ప్రరోహం....

తల్లిగర్భం తపసు నేర్పితే
తనువు నిద్రించటం శిరసోదయంకాదు నిత్య శిశిరోదయం..

విరామ మెరుగని కాలాన్ని చేతుల్లో ధరించి
సాగిపో అభిముఖంగా
అభ్యుదయ మఖంగా ....!

శ్రీ రేకళిగెమఠం వీరయ్య

బసవేశ్వరునకు ఉపనయనమైనదా?

బసవేశ్వరుని జీవనమందలి మలుపులలో, "ఉపనయన" మొక మిక్కిలి పొగడదగిన మలుపు. అది అతని జీవనమునే మరొక విధముగా మలచినది. అతని తల్లిదండ్రులు బహుశః అతనిని వైదిక పండితునిగా జేయనెంచి యుండిరేమో, కాని ఆ మలుపు అతనినొక సంఘ సంస్కర్తగా, గొప్ప ధర్మ ప్రవర్తకునిగా, నవ సమాజ నిర్మాతగా మలచినది. అతి ప్రాముఖ్యమగు ఆ మలుపును చారిత్రిక పరిశోధకులు, విమర్శకులు వివాదాస్పదమగు సమస్యగా నొనర్చియున్నారు. అందుకు కారణము ఆ విషయమును గురించిన చారిత్రిక ఆధారములు గానరాక పోవుటయే: బసవేశ్వరాదులు ప్రశంసనుగాని, కీర్తినిగాని ఆకాంక్షించకయే తమ తమ పనులను జేయుచుండిరి. తాము జేయుచుండిన దాసోహ కార్యములను తాము బోధించుచుండిన, తాత్త్విక బోధనలను, వారు తమ కర్తవ్యము లని తలంచి, ఎట్టియుపాధిలేకయే చేయుచుండిరి. ఆ కర్తవ్యముల కీర్తి ప్రశంసలను కూడా వారెంత మాత్రమును కోరకుండిరి. కనుకనే బసవేశ్వరుడు,

"చేసితి ననునది మనసున వొడమెనా,
బసవైచి, గావించును శివుని డమరువు.
చేసితిననకున్ అంగమునకు,
చేసితి నకుము జంగమమునకు.
చేసితినను భావము మనసున లేకున్న
అడిగిన దిచ్చును, కూడల సంగమ దేవుడు."

అనెను. అంతేగాక, "పొగడువారు నన్ను పొన్ను శూలముపై నెక్కించిన వారనెద"నని, ఇతరులుకూడ తనను పొగడకూడ దనెను. అందుకనియే అతని జీవనము నందలి ముఖ్య వివరములు తెలియుట దుస్తరమగుచున్నది. బసవన్నను గురించి విపులమగు పూరాణ సాహిత్యము కన్నడమందును, తెలుగునందును ఉన్నను కొన్ని విషయములు సందిగ్ధములుగానేనున్నవి. ఆధునిక విమర్శకులు, పరిశోధకులు, తమ తమ సాంప్రదాయముల ననుసరించి, తమ తమకు తోచినటులు, ఊహాపోహలను కల్పించి, తర్క-వితర్కములను జేయుచుండుట వలన ఆ సమస్యల పరిష్కారము మరింత జటిలమగుచున్నది. అంతేగాక మరికొన్ని క్రొత్తసమస్యలు బయలు దేరుచున్నవి. అట్టి సమస్యలలోనిదే యొక సమస్య బసవేశ్వరుని జననకాల నిర్ణయము.

ఈ సమస్యను గురించి, మిత్రులు డా. బొడాల రామయ్య గారు, మహాకవి పాల్కురికి సోమనాథుని బసవ పురాణమందలి "అర్ధోదయ"మను పదమును ఆధారముగాగాని, తెలిపిన క్రొత్తజనన ముహూర్తమువలన, ఇదివరకు ఆచరింపబడుచున్న బసవని జన్మ దినము వివాదాస్పదమైనది. ఆ విషయమును గురించి, నాయభిప్రాయమును, 'ఆంధ్రపత్రిక, దుందుభి సంవత్సరాది సంచికయందు పాఠక మహాశయులు చూచియేయుందురు. ప్రస్తుత "ఉపనయన" సమస్యకూడ వివాదాస్పదమగు సమస్యయే.

బసవని గురించి కావ్యములను రచించిన వారిలో ప్రప్రథమ మహాకవులు పాల్కురికి సోమనాథుడు. మరియు హరిహరుడు. సోమనాథుడు బసవని సమకాలీనుడు కాకపోయినను, బహుదూరము వాడుకాడని, అతని రచనల యందలి అంతః సాక్ష్యమువలన తెలియుచున్నది. హరిహరుడు కాలమునందు సోమనాథునికన్న కొంతదగ్గరి వాడైనను, బసవని కార్యక్షేత్రమగు కల్యాణము, సోమనాథుని రచనకు నిలయమైన శ్రీశైల క్షేత్రమునకన్నను, హరిహరుని రచనలకు నిలయమైన పంపాక్షేత్రమునకు ఎక్కువ దూరముగానున్నది. సోమనాథుడు బసవని సంస్కరణములనుగాని, అతని జీవన విశేషములనుగాని, స్వయముగాచూచి తెలుసుకొనగలుగలేకున్నాను. కల్యాణక్రాంతి తదుపరి, శరణులకు కేంద్రము గాను ప్రభుదేవునకు అక్క మహాదేవికి ఐక్యస్థలముగా నుండి ప్రసిద్ధిగాంచిన శ్రీశైల క్షేత్రప్రాంత మందలి జనులవలన, ఆ సమాచారములను ఎక్కువ నిక్కరముగా తెలుసుకొను అవకాశము అతనికి కలిగినది. అందుకనియే సోమనాథునకు, తన బసవ పురాణమునకు కథాసామగ్రి ఎక్కువ నిష్కర్షగా తెలిసిన దనవచ్చును. హరిహరుడు సోమనాథునికన్న కొంత ముందటివాడైనను, అతడు జన్మతః శైవుడు. ఆరాధ్య సాంప్రదాయమువాడు. కల్యాణమునకు బహుదూరమునందున్న, ద్వారసముద్ర నివాసి. క్రీ. శ. 26 నందు హోయసల రాజగు వీరబల్లాళుని ఆస్థానమందొకనాడు తన చేతులతో, తనపైనున్న వస్త్రమును నలిపెనట. అప్పుడు రాజ దేమని అడుగగా, అతడు, "హంపియందు విరూపాక్షస్వామి

దేవాలయమందలి తెర మంటనంటుకొనినందున, దానిని చల్లార్పితి" నని తెలిపెనట. రాజు హరిహరుని మాటయందలి సత్యమును కనుగొని, అతడు మహా శివభక్తుడని తెలుసుకొని అతనిని హంపి క్షేత్రమునందే యుండుమని పంపెనట.

హరిహరుడు, కల్యాణమును విడిచి వచ్చి హంపియందు నిలిచిన శివశరణుల వలన బసవని దాసోహభక్తి, అతని సంస్కరణములను, వచనములను, తెలుసుకొని తానుగూడ వీరశైవుడుగా పరివర్తనమయ్యి, శివశరణుల చరిత్రలను రగడలుగా, క్రీ॥ శ॥ 1216 తర్వాతనే రచించియుండును. ఈ రగడలలో 'బసవరాజ దేవరరగడ'నే మొదటరచించి యుండునని భావించినను; ఆ రచన బసవన్న కూడలి సంగమ మందైక్యమైన తదుపరి సుమారు అర్ధ శతాబ్ది నాటికే రచించి యుండు ననవచ్చును. ఐనను అతని జన్మతః వచ్చిన శైవ సాంప్రదాయము నందలి అభిమానము అప్పటికి వదులలేరనియే అనవచ్చును. ఈ విషయము అతని 'బసవ రాజదేవర రగడ' యందలి 'ఉపనయన' సన్నివేశము సందే తెలియుచున్నది.

సోమనాథుడు జన్మతః వీరశైవుడు, వీరశైవాచార సంపన్నుడు. ఈ విషయములను, అతడు తన రచనలయందే తెలిపియున్నాడు. అంతేగాక బసవపురాణము నందలి, బసవన జనన సన్నివేశము, మరియు ఉపనయన సన్నివేశములందు అతడు తెలిపిన వివరముల మననుగూడ, అతడు వీరశైవుండనియే ధృవమగుచున్నది. శ్రీశైల క్షేత్రము నందున్న శివశరణుల వలన బసవని ధార్మిక బోధనలు, సామాజిక సంస్కరణలు, అతని వచనములను తెలుసుకొని బసవపురాణమును వ్రాసినట్లు, అతడే తెలిపియున్నాడు. అతనికి బసవనిపై గల గాఢమగు భక్తిని బసవ పురాణమునందును, పండితారాధ్య చరిత యందును, మరియు వృషాంప శతకము నందును, ఇతర లఘు కృతులయందును గాననగును. హరిహరునకును, బసవనిపై శివశరణులపై గలభక్తి అపారము, అగాధము, సోమనాథుడు బసవ పురాణము నందు బసవని కథ ముఖ్యమైనను, అంతవరకు అతనికి తెలిసిన ఇతర శివశరణుల కథలను కూడ, అందు చేర్చియున్నాడు. అటులనే పండితారాధ్య చరిత్రయందు, పండితారాధ్య చరిత్ర ముఖ్యమైనను, అందును అంతకు మొదలు తెలియని ఇతర శివశరణుల కథలను చేర్చియున్నాడు. హరిహరుడు బసవని కథతోబాటు ఇతర అనేక శివశరణుల కథలను, అక్క మహాదేవి చరిత్రను, వేరువేరుగా రగడలందు వచించి యున్నాడు. ఈ ఇద్దరును మహాకవులే, శివభక్తులే ; కాని తమ తమ ఆచార విచారముల వలన, ఈ యిద్దరి కావ్యములందు ముఖ్యముగా బసవని చరిత్రయందు సామ్యములకన్న వ్యత్యాసములే ఎక్కువగా నున్నవి. అట్టి వ్యత్యాస విషయములలో బసవని ఉపనయన విషయము కూడ నొకటి.

సోమనాథుడు బసవని జనన సందర్భముననే, లింగధారణ అయినట్లు తెలిసి ఉపనయన ప్రాముఖ్యతను తగ్గించినాడు. వీర శైవ సాంప్రదాయ ప్రకారము, బసవనికి గర్భలింగధారణ అయినట్లు చూపకున్నను, పుట్టగానే లింగధారణ అయినట్లు తెలిసి ఆ సన్నివేశమును.

"నర్ధోదయము నంద యతనిలో నున్న
యర్ధేందు మౌళి గుప్తాకృతి దాల్చి,
యంగంబుపైఁ గడుసాంగంబు గాఁగ
లింగ సాహిత్యంబు లీలనొనర్చె."

అనుచు బసవనియందుగల పరశివుడే అతనికి లింగధారణ యొనర్చి అంతర్ధాన మయ్యెనని తెలిపినాడు. అతని ప్రకారము పరశివుడే బసవనికి, లింగధారణ యొనర్చిన గురువని తెలియును. తర్వాత ఎనిమిదవ ఏట తల్లి దండ్రులు తమ ఆచార ప్రకారము బసవనికి ఉపనయనమును చేయనెంచినట్లును, బసవన్న ఇష్ట లింగ ధారియగు తనకు కర్మ బద్ధమగు ఉపనయనము వలదని వాదించి, ప్రతిఘటించి, ఇల్లు ఫణిహారి ఇంటికి పోయియున్నట్లు సోమనాథుడు తెలిపినాడు. ఈ సందర్భమున మాది రాజునకును, బసవనకును, జరిగిన వాదమును సోమనాథుడు — శాస్త్రీయముగా, సహేతుకముగా వివరించినాడు (ఆ వివాదమును చదువ దలచినవారు బసవ పురాణము పుట 40–48ను చూడవచ్చును.) అనగా బసవనకు ఉపనయనము జరుగ లేదనియే సోమనాథుడు తెలిపెను.

ఈ విషయమునందు హరిహరుడు, తాత్త్వికముగా, భిన్నాభిప్రాయమును తెలిపెను. అతడు బసవనకు, జనన సమయమునందు గాని, ఆ తర్వాతగాని లింగధారణ జరిగినటులు తెలుపలేదు. చిన్నతనమునందే అతని తల్లి దండ్రులు శివలోక ప్రాప్తులైనట్లును, శివభక్తాగ్రేసురురాలగు అతని ముత్తవ్వ ఇంట బసవన పెరిగినట్లును తెలిపినాడు. అతడు బసవనకు ఉపనయన మెప్పుడైనదను విషయమును గూడ తెలుపలేదు. సుమారు పదహారేండ్ల వయసు వచ్చిన తదుపరి" 'కర్మలతవలె నున్న జవివారమును, త్రెంచి పారవేసినా'డని, తెలిపినాడు. అందువలన బసవనికి ఉపనయనము జరిగినట్లు హరిహరుని అభిప్రాయమని మనము తెలుసు కొనవలసి యున్నది. హరిహరుని ఈ యభిప్రాయమే బసవని ఉపనయన విషయమందు జనులలో భేదాభిప్రాయమునకు కారణ మనవచ్చును.

లింగధారణ విషయమందు గూడ, హరిహరుని కల్పన వీరశైవ సాంప్రదాయమునకు విరుద్ధముగా నున్నట్లు తెలియుచున్నది.

ఈ సందర్భమునందు హరిహరుని వలన మనకు తెలియ వచ్చు విషయము లిట్లున్నవి: బసవన్న శివభక్తి యందలి తన్మయత్వము వలన జంధెమును, పదహారవ ఏట త్రెంపి పారవైచి, కప్పడి సంగమ క్షేత్రమునందిడును. అచ్చటి స్థానాధిపతియగు ఈశాన్య గురువు ఆజ్ఞచే అచ్చటి లింగమును అర్చించుచు అచ్చట కొన్నాళ్లుండును. అప్పుడు సంగమేశ్వరుని ఆదేశానుసారము దేవాలయమందలి నంది ఒకనాడు హస్త మస్తక సంయోగగవేసి మంత్రోపదేశ మొనరించి, తన నోటినుండి వెడలిన లింగమును బసవనకు ధారణజేయును. ఈ ప్రకారముగా బసవన్నకు నందీశ్వరుడు గురువగునట్లు తెలియును. హస్తమస్తక సంయోగము వీరశైవదీక్ష క్రమమునందలి యొక భాగమైనను, పదహారవ ఏట లింగధారణ జరుగుట మాత్రము వీరశైవ సాంప్రదాయమునకు విరుద్ధము. సోమనాథుడు ప్రతిపాదింప జూచిన, వీరశైవ సిద్ధాంతమునకును విరుద్ధము. నందీశ్వరుని అవతారమగు, బసవనకు పరశివుడే లింగ ధారణయొనరించిన గురువగుట మిక్కిలి సమంజసము. ఈ విషయమునందు హరిహరునికల్పన అసంగతముగా నుండును.

ఉపనయన విషయమునందు కొందరు పురాతన కవులు హరిహరుని కథనమును నమ్మి బసవనకు ఉపనయనమైనదందురు. ఆధునికులును, కొందరు బసవన్నను లింగాయత మతస్థాపకుండను వాదనను బలపరచు భ్రమతో బసవనకు మొదట ఉపనయనమైనదనియే వాదింతురు. ఇష్టలింగ జ్ఞానము అతనికి తర్వాత గలిగినందున, జంధెమును పారవైచి, తాను లింగమున ధరించి, ఇతరుల యందును లింగధారణ ప్రచారమొనరించెనందురు. ఈ విషయమునందును మిత్రులు రామయ్యగారు, హరిహరునికథనమును నమ్మి బసవనకు ఉపనయనమైనదందురు. అంతేగాక 'శృతికి మించి అలాపించి'నటులు, హరిహరుడు అనని మాటనుగూడ వారు తమ 'సమగ్ర సమీక్ష'యందు వ్రాసినారు.

సోమనాథుడు ఉపనయన సంస్కారము నందలి అనౌచిత్యమును గురించి బసవన్న, మాదిరాజుల మధ్య జరిగిన వివాదమును వివరముగా తెలిపినను, కొందరు పురాతన కవులు, హరిహరుని 'మూగ' మాటను నమ్మి బసవనకు ఉపనయనమైనదనియె, తమ కావ్యములందు తెలిపియున్నారు.

సింగిరాజు, బసవన్నకు ఎనిమిదవయేట ఉపనయనము జరిగినట్లు తెలుపును.

శరణలీలామృతమునందు బసవన ఉపనయనమును తిరస్కరించి, తల్లిదండ్రులను విడిచి సంగమేశ్వరక్షేత్రమునకు పోయినట్లు తెలుపును.

చామరసు తన (కన్నడ) ప్రభులింగలీలయందు ఉపనయనమైనదని తెలిపినట్లు తోచినను, బసవనితల్లిదండ్రులు చేయదలచిన "ఉపనయనము" జరుగలేదని అతని భావమన్నట్లు తెలియుచున్నది. ఆ సందర్భమున చామరసు వ్రాసిన వాక్యములివి:

"ఉపనయనక్కెలక్షవను ముందా
విపులమతిగె, అల్లమ తోరిసు
ఉపమెయను సూచిసువ పరియలి, బసవరాజంగె
ఉపనయన వాయత్తువిభవదె
త్రిపుర వైరియ భక్తి భావద
అపరిమిత మహిమెయనుతోరిద నా మహాత్మను"

చామరసుని ఈ పద్యమునందలి "ఉపనయనవాయత్తువిభవదె" అను వాక్యము శ్రీ రామయ్యగారికి, బసవనకి ఉపనయనమయ్యెనను నట్లు భ్రమను కలిగించినదని తెలియుచున్నది. "అల్లమనుతోరిసు ఉపమెయను సూచిసువపరియలి" అను మాటల యందలి గూఢార్థమును వారు ఆలోచించనటులు తోచుచున్నది. ఆ రెండు మాటలను కలిపినచో, 'అల్లముడు సూచించిన విధమునందు బసవనికి ఉపనయనమైన'దని, అర్థమగును. అల్లముడు సూచించునట్టి, చేయునట్టి, 'ఉపనయన' మేదీ, అను వివరణమును రామయ్యగారు ఆలోచించనటులు తోచుచున్నది.

చామరసుని 'ప్రభులింగలీల'ను తెలుగునందు అనువదించిన పిడుపర్తి సోమనాథుడు, మూలగ్రంథకర్త వాడిన 'ఉపనయన' మను శబ్దమును వాడినను, చామరసు సూత్రప్రాయముగా వ్రాసిన వాక్యమును కొంత వివరించి తెలిపినాడు. ఆ భావమును అతడు తనద్విపదలందు ఇటులు ధ్వనింప జేసియున్నాడు.

"గర్భాష్టకమునందు, గాంతయుఁబతియు
నర్భకునకు వడుగతి సంభ్రమమున
దక్కక జేయంపఁ దలంచుట యెఱిఁగి,
యక్కనాగమ్మతో నరయె, నా కోజ్జ
యల్లమ ప్రభురాయుఁడ తనిచేఁగాని,
యెల్లనన్యులచేత, నుపనయనంబు,
పడపోదమనుచు, నా భామయును దాను
గదలి యేతెంచి యాకప్పడి సంగ
మందు సంగయదేవు నర్చించుకొనుచు,
గొందటి భక్తుల గూడికయుండె." (ప్రభులింగలీల-71)

పిడుపర్తి సోమనాథుని ఈ వివరము వలననుకూడ శ్రీ రామయ్యగారు "ఈ కావ్యమున బసవనకు ఉపనయనము జరిగినట్లుకలద"ని గ్రహించి వ్రాయుట విచిత్రముగా నున్నది. అంతేగాక "పిడుపర్తి సోమనయొక్క పై ద్విపదలనుబట్టి చూడగా బసవనకు ఉపనయనముపై ద్వేషభావము లేద"ని, తమ తీర్పును చెప్పుట యింకను విచిత్రముగా నున్నది. "అల్లమ ప్రభునిచెంత ఉపనయన సంస్కారమును పొందుటకని, అక్క నాగమ్మతో గలసి అచటికి వెడలిపోవు"నని కూడ రామయ్యగారు వ్రాసినారు.

ఉపనయనముపై బసవనకు ద్వేషభావమే లేకుండినచో, తల్లిదండ్రులు అతివైభవముతో చేయదలచిన ఉపనయనమును నిరాకరించి, తల్లిదండ్రుల విడిచి, అక్క నాగమ్మతో కప్పడి సంగమ క్షేత్రమునకు పోయి సంగమేశ్వరు నర్చించుకొనుచు కొందరు భక్తుల కూడుకొని యుండవలసిన అగత్యము బసవనకెందుకు గలిగెనో? రామయ్యగారు ఆలోచించనటులున్నది. అల్లమ ప్రభువు చేయునది, చేసినది, కర్మకాండకు సంబంధించిన 'ఉపనయనము' గాదనియు, ఇష్టలింగ దీక్ష సంస్కారమనునది, శ్రీ రామయ్యగారికి తెలియలేదా? తాము ఉటంకించిన 'ప్రభులింగ లీల'ను మరొకసారి సావధానముగా చదివిన, అందు ప్రభువు జడమతులకు తెలిపిన సూక్తులే 'ఉపనయనమును' సమర్థించునో తెలియగలదు.

పిడుపర్తి సోమనాథుడు, చామరసుని 'ప్రభులింగలీల'ను మాత్రమే తెలుగునందు అనువదించలేదు. అతడు స్వయముగా, బసవపురాణమును (పద్యకావ్యము) రచించినాడు. పితృయాజ్ఞ ప్రకారము పాల్కురికి సోమనాథుని ద్విపద కావ్యమును పద్య కావ్యముగ వ్రాసినాడు. ఆ గ్రంథము నతనికే అంకిత మొనరించినాడు. పాల్కురికి సోమనాథుని శిష్య ప్రశిష్యుడనని చెప్పుకొన్నాడు. పిడుపర్తి సోమనాథుడు, ఆ గ్రంథము నందును బసవనికి ఉపనయనమైనదనిగాని, అతనికి ఉపనయనముపై ద్వేషభావము లేకుండెననిగాని వ్రాయలేదు. ఇది శ్రీ రామయ్యగారి ఊహయే అనవచ్చును. పిడుపర్తి సోమనాథుడు తన బసవపురాణమందలి ప్రథమాశ్వాసమునందు, "బసవేశ్వరుడు ఉపనయన మక్కరలేదనుట." అను శీర్షిక క్రింద బసవనకును, అతని తండ్రి మండెగ మాదిరాజునకును జరిగిన తాత్త్విక వివాదమును, (పు. 32-36) వివరముగా తెలిపినాడు. ఆ వివరమును చదివినచో బసవనకు ఉపనయనమైన సంగతి, అతనికి ఉపనయనముపై ద్వేషబుద్ధి లేకుండెనను సంగతి తెలియగలదు. అంతదూరమక్కరలేకనే, ఆ విషయము గురించి, అతడు పేరిడిన శీర్షికవలననే తెలియగలదు. క్రింది పద్యముల వలన విషయము విదితము అగును.

"ఉ॥ శిష్ట విచారసారగతిఁ జెందెను మండెగ మాదిరాజు గ
ర్భాష్టకమందుఁ బుత్రువడు గాప్తులు, మిత్రులు, మెచ్చఁగోవిదో
ద్దిష్ట వరిష్ట లగ్నమునఁ దీర్పఁగ నున్నెడఁ దండ్రి గాంచి వి
స్పష్టవచోమచర్చికల బాలుఁడుపల్కెను, భక్తిశీలుఁడై" (120)

"కం॥ మృడుఁ గొల్చియు జడనుతిపై,
వడుగని చిడిముడిపడంగవచ్చునే గురుగా
మృడుని ననిశంబు గోరియు,
నెడఁగు నరుల గురుని జేయ వినియముగాదే" (121)

తెనుగులో ఉత్తమ గ్రంథములు

1. సాహిత్యసౌందర్య దర్శనము 800 పుటలు డెమ్మి (సమగ్ర ధ్వని,రస,కావ్య,నాటకాలంకార శాస్త్రము) 35-00
2. రఘువంశలహరి కాళిదాసుది-పద్యకావ్యము 280 ,, 10-00
3. కుమారస్వామిజయము ,, పద్యగద్యకావ్యము 96 ,, 4-00
4. శాకుంతలనాటకము ,, అనువాదరీతులతో 162 ,, 6-00
5. ఉత్తరరామ ప్రణయచరిత నాటకము ,, 180 5-00
6. న్యాయదర్శనం మూల తాత్పర్యములతో 160 4-00
7. వైశేషికదర్శనము (కణాదుడు) ,, 88 3-00
8. సాంఖ్యదర్శనము (కపిలుడు) ,, 120 6-00
9. బ్రహ్మసూత్రములు (టీకానువాదవిశేషములతో) 300 10-00
10. ఉపనిత్సుధ I (ఈశకేనకఠప్రశ్నోపనిషత్తులు) 150 5-00 మూల తాత్పర్య పద్యానువాద సహితము
11. ,, II ముండ మాండూక్య తైత్తిరీయైతరేయములు,, 150 5-00
12. ,, III ఛాందోగ్యము ,, 500 30-00
13. ,, IV బృహదారణ్యకము ,, 350 20-00
14. గణపతి రామాయణ సుధ (బాలకాండ) 300 15-00 (వాల్మీకి రామాయణమునకు సరియైన సరసమైన తెనుగు కావ్యము. పద్యగద్యములు. చర్చనీయములు. అనువాదరీతులు. వనవాసకాలము, లంకామార్గము చిత్రపటమును-గాయత్రీబీజాక్షర రామాయణములతో)

చర్ల గణపతిశాస్త్రి, విజ్ఞాన కేంద్రము, కురుపాం మార్కెట్టు, టౌను హాలు రోడ్డు, విశాఖపట్నం - 1

ఈ రెండు పద్యముల వలననే, బసవని తండ్రి అతనికి ఉపనయనమును జేయదలచినట్లును, అతడు నిరాకరించినట్లును తెలియుచున్నది. ఈ వివాదమునే, తర్వాత పుటలందు సోమన వ్రాసినాడు. ఐనను బసవనికి ఉపనయనమైనదని సోమనాథుని ప్రభులింగలీల యందు తెలియుచున్నదను శ్రీ రామయ్యగారి వాదన సరిగాదని తెలియుచున్నది. ప్రభులింగలీలయందు పిడుపర్తి సోమనాథుని వ్రాతవలన బసవనికి ఉపనయనముపై ద్వేషభావము లేకుండెనని తెలియుచున్నదను రామయ్యగారి వాదనకూడ సత్యమారమనియును పిడుపర్తి సోమన బసవ పురాణమందలి క్రింది ఉద్ధరణము వలన వివరముగా తెలియుచున్నది.

"వ॥ ఇట్టి విప్రత్వంబు జనకుం బుట్టియుండెదవేని, మీరు మీయంత నుండుండ యేను నాయంత నుండెదనని, సహోదరియగు నాగాంబయుం దాపసు నరికట నుండరాదని, కదలి యపుడ, గమనంబున ఫణిహారమందిరంబునకు నపులు వెఱగంద నరుదెంచె నంత." (417)

సోమనాథుడు ప్రభులింగలీల (అనువాదము) యందును, బసవన, అక్క నాగమ్మతో సహ తల్లిదండ్రుల విడిచి కప్పడి సంగమమునకు పోయినాడని తెలిపెనేగాని, వేరు విధముగాదు. శ్రీ రామయ్యగారు పిడుపర్తి సోమనాథుని బసవపురాణమును చూచి నటులు తెలిపినను, అందలి ఈ విషయములను పూర్తిగా విడిచి, ఇతర విషయముల వివరములు అవసరము లేకున్నను వానిని అతి విపులముగా వ్రాసి, వీరశైవ మతతత్త్వముల గురించి తమకు గల విశాల పరిజ్ఞానమును తెలిపియున్నారు. అది మెచ్చదగినవిషయమే; కాని ఉపనయన విషయమునందలి భేదాభిప్రాయమును (వివాదమును) మరింత పెంచి పరాకాష్ఠాయికి చేర్చిరేగాని, ఆ వివాదమందలి సత్యాంశమును తెలుపు ప్రయత్నము నెందుకు జేయరైరో, రామయ్యగారు!

శ్రీ రామయ్యగారు అంతటితో విడువక, సింగిరాజు పురాణమునందు, బసవనికి ఎనిమిదవ ఏట ఉపనయనమైనట్లు చదువగనే, 'బసవన యసాధారణ భక్తుండగుటచే, సంధ్యాది కర్మములు చేయకపోయినను, లోపములేదని, బ్రాహ్మలు బసవని మన్నింతురని' బ్రాహ్మల 'ఉదారబుద్ధిని,' 'ఉన్నత స్వభావము'ను వారు వెలిబుచ్చినారు. 'బసవన లాంఛనప్రాయముగా, యజ్ఞోపవీతమును ధరించె' ననుటలో, 'బసవని త్రికరణశుద్ధికి' రామయ్యగారు గొడ్డలి పెట్టు పెట్టినటులు గాదా?

శ్రీ రామయ్యగారు బసవనివచనమును ఉటంకించి, 'బ్రాహ్మణులే తనను బహిష్కరించి జంధెమును పెరికికొని నీరు కూడ ఇయ్యక వెలివేసినారని బసవన తెలిపినట్లు ఆ వచనమున కర్థము చేసి, బసవనికి ఉపనయనమైనట్లు బసవనిచే పలికించు విఫల ప్రయత్నమును (వారు) చేసియున్నారు. ఆ వచనమునకు కన్నడ మూలమిట్లున్నది. (భక్తమహేశ స్థలము - వ 448)

"ఒడెయరు బందరెగుడి తోరణ వకట్టి
నంటరు బందరె సమయ విల్లెన్ని!
అందేకె బారరు, నీరింగె, నేణింగె హొరగాదందు?
సమయా చారక్కొళగాదందు?
పరుష ముట్టలు కబ్బున సవర్ణవా యత్తు
బళిక బందుగళుంటె, కూడల సంగమ దేవా!"

ఈ వచనమునకు రామయ్యగారిట్లు అనువదించి యున్నారు.

"ఒడయలు రాగ గుడి తోరణముకట్టి,
చుట్టములు రాగవిడువు లేవనుడో?
నీటికి త్రాటికి వెలియైనవేళ
సమయాచారమునకు వెలియైనవేళ
వీరేటికిరారో? స్పర్శవేదిసోక
లోహము సువర్ణమైపోవ, యిక
చుట్టములెవరో కూడల సంగమ దేవా" (అ. వ. 449)

రామయ్యగారి అనువాదమేమో ఇంచు మించుగా సరిగానే యున్నది. 'సమయాచారమునకు లోనైనవేళ' అనుటకు బదులు 'సమయాచారమునకు వెలియైనవేళ' అని రామయ్యగారి అనువాదము. ఐనను ఈ వ్యత్యాసము వలన మూల వచన మందలి భావము మారదు. "నీటికి త్రాటికి వెలియైనవేళ" అను అనువాదము కూడ మూల వచనమునకు అనుకూలముగానే నున్నది. కాని దాని భావమును మాత్రము రామయ్యగారు విరుద్ధముగా గ్రహించినటులు తోచుచున్నది. 'వెలియైనవేళ' అనగా తానే వెలియైనవేళ, అని వచనకర్త భావముండునని నాకు తోచుచున్నది. కాని రామయ్యగారు వచనకర్తను ఇతరులు వెలివేసినట్లు, అని వచన భావమని

గ్రహించి అతనిని (బసవని) బ్రాహ్మలు బహిష్కరించి జంధె మును పెరికికొని నీకునుకూడా యివ్వలేదని బసవన్న అన్నట్లు ఆ వచనమునకు అర్థమని రామయ్యగారు తెలిపినారు. మూల వచన మందలి భావము అదిగాదని, తన వాదన కనుకూలమగు రీతి రామయ్యగారు ఆ అర్థమును కల్పించినారని, పాఠకులకు తెలియక పోదని నా విశ్వాసము. ఐనను, రామయ్యగారే, 'బసవన అసాధారణభక్తుండగుటచే, సంధ్యాది కర్మలు చేయకున్నను లోపము లేదని మన్నించినారని' అన్నారె ! బ్రాహ్మల యందున్న ఆ విశాల భావము ఇప్పుడెందుకు లోపించినదో, రామయ్యగారి పైవాక్యము వలన తెలియదు.

బసవన్ననే ఉపనయనమును నిరాకరించి తమ యింటియందు నీరైను త్రాగక అక్క నాగమ్మ తన వెంబడిరాగ ఫణిహరి యింటియందున్నటులు, పాల్కురికి సోమనాథుని కథ ముగలదు. ఆ కథనమునే ఈ వచనము సమర్థించు చున్నది. గాని వేరుగాదు. అందుకు విరుద్ధముగా, బసవనకు వడుగైనట్లు, అతడు పదహారేండ్ల వరకు జంధె మునుంచుకొని (అప్పుడు అతనికది కర్మలతగా నున్న దని తెలిసినందున, ఆ జంధెమును త్రెంచి పారవేసినాడను, హరి హరుని కథనము సత్యదూరమని, శ్రీ రామయ్యగారు ఉటంకించిన బసవని వచనమె రుజువు చేయుచున్నది.

'చిన్నతనముననందే బసవని తల్లిదండ్రులు శివలోక ప్రాప్తు లయ్యి' రను హరిహరుని కథనమును నమ్మి 'చక్కగా తీర్చి దిద్దెడి తల్లిదండ్రులు బసవనికి లేనిలోపమే బసవనిని సమాజము నకు, చిన్నతనమందే దూరము చేసినదని చెప్పవచ్చు'నని శ్రీ రామయ్యగారు తమ యభిప్రాయమును వ్యక్తపరచినారు ! వారి దృష్టియందు 'సమాజము'నగా బ్రాహ్మణ సమాజమని అర్థమేమో? 'సింగిరాజు' బసవని తల్లిదండ్రులు పదహారవ సంవత్సరము వరకు బ్రదికి యుండినటులు చెప్పుట సరిగాలే'దని తెలుపుచు, 'అదివరకే తల్లిదండ్రులు బ్రతికి యున్నచో, బసవని జీవితమే మరొక రీతి మారియుండెడి'దని రామయ్యగారు తమ తీర్పు నిచ్చినారు ! కాని ఆ "మరొక రీతి" యెటులుండెడిదో తెలుపలేదు. బహుశః బసవన్న వేదశాస్త్రములందు ఉద్దండ పండితుండై స్వర్గసుఖ భోగముల నాశించి, హింసాత్మకమగు క్రతువుల నాచరించి, నాచ రింపంజేసి, కుల మతత్త్వముల ననుసరించి, మానవ మానవు లందు ఉచ్చనీచ తారతమ్యములను బలపరచునట్టి, వైదిక పండితోత్త ముండుగా వర్ధిల్లుచుండెనని వారి భావమేమో, మరి ! తద్విరుద్ధ ముగా, బసవన వచించి, ఆచరించినందులకు, ఆ లక్షణములు అతని యందుండుటకు, అతడు 'అర్ధోదయ'మునందు పుట్టుటయే కారణమని' తెలిసి, ఆ సందర్భమున బసవన్నను ఘనముగా పొగడిన రామయ్యగారికి, బసవని తల్లిదండ్రులు బ్రతికి యుండినచో, ఆ ముహూర్తఫలము అసత్యమగుచుండెనని వారికి తర్వాత తెలిసినదేమో ! లేక, బసవన అర్ధోదయ ముహూర్తమున బుట్టినది వారికే అవమానముగా తోచినదేమో ? తెలియదు !

'పాల్కురికి సోమనాథాదులు, బసవని తత్త్వమును ప్రచారము చేయనెంచిరి కనుక, కొన్ని వాస్తవికాంశములను మరుగు పరచియుందురని చెప్పవచ్చు'నని మిత్రులు శ్రీ రామయ్య గారు, 'సర్వరోగ రోగనివారిణి' యనునట్లు, ఒక విసరును విసరి నారు ! వారి ఈ వాదము నంగీకరించినచో, ఈ వాదమునకు ఇక అంతేయుండదు. ప్రతివాడును, తమ వాదన కెదురుదిరుగు మాటల నన్నింటిని, కాదనుటకు ఈ విసరునే విసరవచ్చును గదా !

బసవని ఉపనయన సందర్భమున మిత్రులు డా. బొడాల రామయ్యగారి వాదన యందలి ఔచిత్య నిర్ణయమును పాఠక మహా శయులకే వదలుచున్నాను. తమ 'సమగ్ర సమీక్ష' యందు నాకు అనుమానముగా తోచిన విషయముల గురించి నేను తెలిపినందుకు, వారు నన్ను మన్నించెదరని నమ్ముచున్నాను.



రుసి.... రుసి.... అంతా రుసే....

శ్రీ రంధి సోమరాజు

యెయ్యేంత గేనమున్నోడి మాటేన
ఎయ్యాలకొయాలకి యిస్రిపారేసే ఎంగిలాకేన్రోరే....
అయిన్స్టీన్ బాబే ఇసకరేణువైపోతాడు !
మరి అదేటొ
యేప్పు పచ్చడొక్కటే నిండైంది
య్యెప్పుడూ, అది రుసులు నూపిచ్చే రుసులదేవుడు !

య్యెన్నెన్నో తేగాలు సేసి
యేడేడి కూడెట్టేసే నికార్సైనోడి
మాటకెప్పుడూ ఇలువే !

వుత్తుత్తి, వూసులికి
కాయితాలమీద వూహల బాసలమీద
బలే బలే అందాలుసిందే
వో వుసారెక్కించీసే ....
వుద్దిరేకం పుట్టించీసే....
సారా యీటెల వూపుడు మాటలకి
కిందడి మీదడి ఆపసోపాలడి పోకు
నిలకడ నేర్సుకో
సెర్మాల సెప్పుదండాలెట్టేత్తు నొంగిపోకు
ఆలోసిత్తే అంతా బానిసలే .. !

సినేమాలు తీసేసోట సూడ్రోరే . ఆలసోకు ——
అదేన్రోరే .. తెలివైనోలు సాకిరీ చేసేపదేశం
కడుపు కక్కుర్తి మరేటి సేత్తాం అంటారు
కక్కుర్తోలు
అలంతా గొప్ప గొప్పోలె
కూటికాడి కొచ్చీ తలకి అంతా కూలోలె .. !

మెయ్యాబోతే యెద్దు దున్నబోతె దూడలు
సొమ్మునీది సోకునాది
అస్సలామాత్తరం వోడికేన వుసారుండాల్లే ..
బూతు వుసారు !

ఏడుపొత్తాది య్యాబలమున్నోల డబ్బున్నోల తెలివున్నోల
సవారి .. సి .. సే ..

సీకదేటొ య్యేటీ సేతకాదు
తిట్టినా పడ్తావు కొట్టినా పడ్తావు
అస్సలు పడ్డవోడెప్పుడూ సెడ్డోడు కాడ్నే ..
అందుకే నోఇవ ..

యియ్యాల ఆలు అంతా వోటాలేసీను కోడమే ..
బలే బలే వోటాల సంబడం !

ఆల్ని సూసి యేప్పావంతా మింగిసి
సే దెన్నెల మొగాల మీద వూసేత్తోంది సందమామ !

వుప్పు కొటూరాలు పొట్ట నెట్టీసుకోని
సిటపట సిర్రెత్తించేత్తున్నాడు సూరీడుబాబు !

పేట్రీల్లో యిసపు గాలుల్ని పీల్సేసి
పొల్యూసన్ పులుపుల్ని యెలర్జీ పుళ్ళనీ
వో పులిమేత్తున్నాడు గాలి సిన్నోడు !

సీములికి కూడేటి ? సీపురుకట్ట సాలంటూ
రాతిదేవుడి మీద బెల్లప్పానకం దిమ్మరించేత్తోంది నోకం !

వోర్రంతా మింగి నాలిక సాపేసి
సొంగ కార్సేత్తోంది కాలం ...!

పచ్చి కాయల్ని పసిగుడ్డుల్ని
కసాబసా నమిలేసి
వొగరు రంగుల్లో మొగం ఇకారంగ ఎట్టింది ఆకాశెం !

య్యా బూతాలన్నీ ; మా గొప్పవే ...
ఆటికివన్నీ సిన్నిసిన్ని తప్పులు ...
మనకవేసంద్రాల లోతులు ...
గాదికింది పందికొక్కువో సీమవో అయి బతికెయ్ ...
వోడికేన ముందల బతుకు రా ... !
బతకడానికి కొంచెం కొంచెం నాగీసుకో ...

అదంతా సమపాలంగ కలిపేసుకో ..
కలుపు కుంటేనే బతు కొరే ...
అడ్సులో తొక్కిసినా పువ్వునా పుట్టుకొచ్చీరా ...
అదేటొ; యెలర్జీ ముద్దులికి జడ్సి మామిడి పూత
ముందే రాలి పోనాది
తిండి నేకపొడం కోకి లెండి పోనాది
తిండి పాటలు మర్సి య్యేండ పాటలు పాడగలదేటి ?
బూతాల గొదాముల్లో తిండి గింజలు
వురేసేసే సెవాల కంపు —
యినక స్త్రీ పట్టినా కంపే... నల్లగమాడి పోనాయ్...
జుత్తుంటేసాలు నెత్తికెక్కిసే మల్లెపూలని సూసి,
ఆ జుత్తునుసూసి
యీదులోనే సినిమా రేపులు
ఇయ్యన్నీ నీతి రంకులు
నాయానికి సాచ్చీకం నేదు
అంతా పెద్దోలె ..
డబ్బు మూత లెడ్తారు
వొజ్రాల దుప్పట్లు దూరుతారు
యీ తప్పుల్ని మేసి మేసి మేఁ ..
సొరగాని కెల్లి పో ...
సొరగంలో సిన్ని సిన్ని పూలమీద
బత్తాడు బత్తాడు పుత్తకాలు
యెసికి మోల బతుకు
ఆలు పెద్దోలు కాంగానె
అన్నీ అన్నీ పట్టు గలానులె ...
సూత్తే గలానుల్లో య్యేటీ అపద్దు
గుంజు లేని గుంజు
ఈలె ఇయ్యాల డాకటేరులూ ఇంజనీరులూ
నీరు లేనోలు ! యింక నారు పొయ్యికు ..
ఈలకి మనం ఎసికిమోల మొరే ..
యీకన్ను కాకన్ను ఆ కన్నుకీకన్ను—
అన్నీ తిరకాసు గుండీలు.. ఈదుల్నిండ గుడ్లోలే ..
పునాదులకింద ఆకాసమంతేసి కోడిగుడ్డు గుల్లలు
య్యేగుల్ల ఇంజనీరుకు సిటికెనేలు దేముళ్ళనుకో ..
అదేటొ రైలు బుల్లెమ్మలికి రోజూ వొంతులే....
పెమాదాల్ని పందుల్లా ఈనాయి....
అలాగని సావకు బతకరా దేముడూ....
అమ్మవుందిగా అడుకోనివ్వదు.... !

యిదేం ఏడుపు బతుకో.... య్యేటొ....
య్యేమూల సూసినా....
పాటకసేరీలే.... జయమాల సూపులే....
ఆటికి య్యేట పోతుల బలి....
డబ్బు పెవాహం
అప్పుడే గుండె క్లీనవుద్ది
రేపు నెగ్గిన రేసు గుర్రాల సుకం !
అప్పుడే అప్పుడే బగమంతుడు నెగ్సి నీకోపని సెప్తాడు
అదేటో నీకు తెల్దు ఆ బాబుకీ తెల్దు....
పోనీ తెలుత్తాదనుకో నువ్వేటీ సెయ్యిగూడదు
ముందల నీకు తెలీడం తప్పు
తెలీకుండ వుండడమూ తప్పే....
ఎల్లికుండలో వూగే నీలనా వూగి పోతావు
నీ పేనం లెగ్సి పోద్ది !
నీటి సుక్కంత సొతంతరం నీకుండ గూడదు
అస్సలు సొతంతరం నాది
నేకపోతే నీ యబ్బ సొమ్మా....
అదెప్పుడూ మాదే....
మా బాబుది మా తాతది....
అందుకే నీ నోటిలో మాట,
నా నోటిలో మూట
యియ్యాల మరి యీ నానుడి కంపుకి లొంగి పొవాల్రోరే.
ముందల తెలివైనోలె కంపుకి బెమ్మదేముళ్ళు !
య్యిన్ని సిలకొక్కట్లు సూపిచ్చీసి
బత్తాడు బత్తాడు పూల్దండ లేసీసుకుంటారు
అప్ప డంటారు....
య్యీ బూమినాది య్యీ సూరీడు నావోడు
య్యీ సందమామా నాదే య్యీ గాలి య్యీ ఆకాశెం....
అన్నీ అన్నీ నాయే.... అంటారు
అప్పుడు మనం తలలిచ్చీయాల
తల లొగ్గిసినా వొంటి పేనాలుంటాయిగా....
అయ్యో యిచ్చెయ్యాల
పేనాలు నేకుండ సేసుకోర, య్యేప్పు పచ్చడి
సొరగం నాగుంటది....
ఆ సొరగం గుంట తెయ్యిన గెంతుద్ది
గోసీ యిప్పుద్ది
గోప్ప గోసీ పులి.... లే.... లే....
సీ సీ.... సాల్సాలు
సీకటి నో కెల్లిపోకు

వోడి కేన వుంటాయి లోపాలు తాపాలు పాపాలు శాపాలు
అన్నీ పాలే కదా....
అంతా గోప్ప పాల యేరు
అందుకే నువ్వు పాలేరు
మంచినీల యేరూ.... మొక్కలడుగున యేరూనువ్వే....
నువ్వే నువ్వే.... అన్నీ....
అందరి కాడ్నించి అన్నీ
వుప్పూ, పులుపూ వొగైరా.... వొగైరా....
సల్లంగ వాగేసుకో...
దెబ్బకొట్టకు.... దిగాలు పడకు
అప్పుడే వొరే నీకు వుగాది
అయ్యేల నీ నోట్లో సొతంతరం సుట్ట !
యియ్యాల మనలోని తెల్వి బొగ్గై పోనాది
అందులోంచి మానికెక్కంనా పుట్టుకొచ్చేసి
రాబట్టువైపో కంపూటరువైపో....
కూకోపెట్టి అన్నిపన్లూ సేసెయ్....
మరి తిరకాసు డాకటేర్లూ గుడ్డుగులక యింజినీర్లూ....
గోవిందా....
పొలం దున్నడం కలం పట్టడం మర్నేదు
వోడికీ ఎక్కాల గొడవే వుండదు
ఎలుగూ అంటేసాలు గుప్పునెలుగుద్ది లైటు
అన్నం పట్రా అంటే సెనంలో సేతికాడ
నుప్పేత్తావుంటే ఆటంతటవే.... తలుపులు,
తెల్లేనుగులంతేసి తెర్సుకుంటాయి
యివాళ పెతీ వోడూ సెక్కరవొర్తి
దొంగతనాలు దొంగబుద్ధులూ మరినేవు
మరి పిల్లల్ని కనే తల్లులు సుట్టం సూపే ....
అస్సలు మొగుళ్ళూ ఉండరు పెల్లాలూ ఉండరు ....
కాని ఆలు ఉంటారు !
ఎలా కావాలంటే అలాగే బతుకు
సత్తె కాలం అంటే అదే....న్రోరే ....

ఇరోదం తెలీని సేయితులు
కుతి తీర యెదిగే తుప్తి —
బలం మే ఆలు
మావోడే సెక్కర వొర్తి కావాలని కోరుకోరు
అందరూ రాజూ అబ్బాయిలే ....
ఎవరు ఎవరబ్బాయి ? సెప్పుకో ....
నచ్చిత్రాల దూరంనుంచి సెవాలమీద యిక్కడ
సుక్కల్ని సూరీడ్ని కంపూటరు కంట్రోలు సేత్తాది
అన్ని పనులూ రాబొట్టు బొట్టులే —
అప్పుడు యిజాలు గిజాలు గోయిందా ....
మతాలు గితాలు గోయిందా
గొప్పొ పేదా గోయిందా ....
రేపు పుట్టుకొచ్చే పెపంచం ఇదే వ్రోరే ....
వొకొక్కడికీ వొకొక్క సుక్కే యిల్లు
సలీ యేడీ మరి జంతానై
య్యెప్పుడూ సుకంగా కాలం
అమ్మలూ, అమ్మమ్మలూ తాతలూ తాతయ్యలూ మరి
అపద్రా
వోడికీ జబ్బంటేయ్యేటో తెలీదు పెపంచం వో పూలవోనం..
మనసేతిలో కాలం పిలక
సూరీడు సెందురుడూ యిప్పుడొక్కొక్కరే ....
రేపు కోట్లాది సూరీడ్లు, సెంద్రుళ్ళు
నువ్వు మహామహా మడ్సివి ....
నీకు దావత దావత
అదే అదే గేనం
అంతటా నీ యెలుగే ....
నువ్వే దేవుడు
రుసి.. రుసి....అంతా రుసే ....
ఆదే.. అదే.. యేపూ .. పచ్చడి ....!
య్యెప్పుడూ వుంటాది !



కలగూరగంప

మరో గోపాలగోస్వామి

1982 జూలై నెల భారతిలో శ్రీ జమదగ్నిగారు వ్రాసిన గోపాల గోస్వామిగారి ఉదంతం చదివిన తరువాత ఇది వ్రాయవలెనని తోచింది.

పోతనగారు భాగవతంలో భగవంతుడైన ఋషభుని చరితలో అతని అవధూత లక్షణాలను వర్ణిస్తూ 'మేహన నిష్ఠీవన పాషాణశకృద్రజః ప్రక్షేపణ పూతివాత దురుక్తులన్ పరిభూతుండయ్యె'— అని స్వభావోక్తిగా వర్ణించెను. అది పాఠకులకు కొంత విస్మయకరంగా ఉన్నా అట్టి వారుండక పోరనటానికి పూర్వోక్త స్వామిగారొక నిదర్శనం. జమదగ్నిగారు చెప్పినట్లు వారి బాహ్యవర్తనమనేది శరీరానికి సంబంధించిందే కాబట్టి ముక్త జీవుడు ఎట్టి ఉపాధిలోనైనా ఉండవచ్చు.

జలపాత్ర నేలపై ఉన్నంతసేపే ఒరగిల్లినా బోరగిలినా నీరు తొలుకుతుంది వొలుకుతుందనే భయంగాని అది నిండుతొట్టెలోనే మునిగి ఉన్నపుడిక ఆ సందేహానికి స్థానంలేదు గాబట్టి ఆచార విధుల విషయంలో అవధూతల స్థితిగూడ అంతేననిపిస్తుంది.

గోపాలస్వామివంటి వ్యక్తి మా తాలూకాలో గూడ ఒకాయన ఉండేవాడు. అతడు గూడ దేశకాలాతీతుడు. ఎక్కడి వాడో! ఏ కులమో! ఏ పేరో తెలియదు. దిగంబరిగనే ఉండేవాడు. మొదలతడు తాళ్ళపల్లెలో ఇమ్మడిశెట్టి వారి యింటి ముందుండే ఓ కంబాన్నానుకొని తాను మరో స్థాణువులాగ నిలిచేవాడట! ఆ విధంగా అక్కడ ఎంతకాలమున్నాడో తెలీదు.

క్రీ. శ. 1908 కీలక సంవత్సరంలో విపరీతమైన వర్షాల చేత మూసీనదికి వరదలువచ్చి హైదరాబాదులో కొంతభాగం కొట్టుకుపోయింది. అప్పుడు మా ప్రాంతంలోగూడ చెరువులు కుంటలు అన్నీ తెగినవి. వానలు వెలసి వాగులు తీసిన తరువాత ఒకనాడు తెలకపల్లెవాగులో కొందరు బండ్లవారికి ఇసుకలో అరకొరగా తేలిన మానవాకారం ఒకటి కనిపించింది. వారదిచూచి ఏదో అనాథప్రేతమనుకొని జాగ్రత్తగా ఇసుక తొలగించి అప్పటికే బరాన్ని నిలిపి పట్టుకొని యిసుకనంతా దులిపినారు. ఆ విధంగా దులుపుతుండగానే ఆ దేహం అకస్మాత్తుగా చైతన్యవంతమై కల కల నవ్వుతు వారిచేతులనుండి దూసుకొని వాగువెంట పరుగెత్తింది. వారాశ్చర్యంలో అతని వెంటపడి పరుగెత్తి చిక్కించుకొని, ఏలాగో గ్రామంలోనికి పట్టుకువచ్చినారు.

అప్పటికా గ్రామానికి శిష్య సంచారార్థం సుల్తాను పాషావారు వచ్చినారు. వారు అతని పట్టుకొని ఆయన ముందు నిలిపి జరిగిన విషయం చెప్పినారు. అది విని ఆయన అతని వాలకం చూసి ఈయన 'అల్లాజీ' అయ్యా! అన్నాడు. 'అల్లాజీ' అంటే తురకంలో 'దేవుడు గారు' అని అర్థం. ఆనాటి నుండి యిక జనం ఆయన్ని 'అల్లాజీ' అని పిలిచినారు.

అతడు తెలకపల్లెలో కోటవెనుక గల కోనేటిముందు ఓ వేపచెట్టుక్రింద బసపెట్టినాడు. దాని ఎదురుగా జూలూరువారు, ఇరువెంటివారు అనే వైశ్యుల యిండ్లుండేవి. ఆ యిండ్లవారే అతనికి వేళకింత అన్నం పడవేసేవారు. అతడు ఎంత అన్నం తినగలడో ఎవరికీ తెలియదుకాబట్టి ఆ వీధిలో అతనికి అన్నం పెట్టటానికి ఎవరికైనా సందేహంగానే ఉండేది. అట్లే అతడు ఎక్కడ ఎంత మేర ఖరాబు చేస్తాడో తెలిసేదికాదు.

కావాలని అతడెవరితో మాట్లాడడుగాని ఎవరైనా పలుకరిస్తే ఏం అల్లాజీ! అంటే ఏం అల్లాజీ! అన్నం తింటావా అల్లాజీ అంటే అన్నం తింటావా అల్లాజీ! చాలా అల్లాజీ! అంటే చాలా అల్లాజీ! అని ఈ విధంగా మాయాసంభవమై అప్రతి వచనాలుగా పలికేవాడు కాబట్టి ఆ కిటుకు తెలిసిన కొందరతనికి మోతాదుగా ఇంత అన్నం పెట్టి అది అయిపోగానే 'చాలా అల్లాజీ!' అనేవారు. అతడదే ప్రతివచనంగా పలికి యిక అన్నం నుంచి లేచేవాడు. అతడు ఓ మట్టిచిప్పలో అన్నం తినేవాడు. ఆ చిప్పలో అక్కడి వారెవరైనా అన్నం పెట్టగానే ఆ వీధిని కనిపెట్టుకొని ఉండే గుడ్డి కుక్క ఒకటి వచ్చి అతని చిప్పలో మూతిపెట్టి పొత్తుగలిసేది. ఇక ఆ అన్నంలో అదే ఎక్కువ తినేదో తానే ఎక్కువగా తినేవాడో ఆ దేవునికే ఎరుక. అన్నంతిన్న తరువాత అతడు అక్కడే చెట్టుక్రింద కూర్చునిగాని లేదా ఎదురుగా ఉండే భ్రమరాంబ గుడి అరుగుమీదగాని ఓ పిట్టకునుకు తీసేవాడు. ఒకోకనాడు సాయంకాలందాకా అలాగే పండేవాడు.

అతడు అపుడపుడు తనంతట తానే చిన్నపిల్లవానివలె కల కలమని నవ్వుకొనేవాడు. ఎవరిపైనైనా అనుగ్రహం కలిగిందంటె కూడా వారినిచూసి అలాగే నవ్వేవాడు. ఆయన ఎవరినిచూసి నవ్వితె ఆనాడు వారి పనులన్నీ సఫలమయ్యేవి.

అపుడు తెలకపల్లెలో ఉస్మాన్ అనే ఓ గుమాస్తా పట్వారి ఉన్నాడు. అతడు వసంతాపుర నివాసి. కొంత వేదాంతం పిచ్చి, సాధనల పిచ్చి గలవాడు. అల్లాజీని బాగా కనిపెట్టినాడు. అతన్ని ఏలాగైనా తమ ఊరికి తీసుకొనివెళ్ళి తాను ఏదో పొందాలనే కోరిక కలిగింది. ఒకనాడు అతడు తినేవేళకు అక్కడొక బండిని సిద్ధపరచి దానిలో గడ్డిని పరచి ఉంచినాడు. అల్లాజీ అన్నం తిన్న తరువాత ఆనాడు దానిపైకి ఎక్కి పండుకున్నాడు. అది చూచి ఉస్మాన్ వేగంగల ఎద్దులను బండికి కట్టుకొని తమ ఊరి ముఖం పట్టినాడు. అతడు నిద్రలేచేవరకు బండి తమ ఊరిలో ఉండాలని అతని యిష్టం. ఎద్లు అలుపు సొలుపు లేకుండ పరుగెత్తుతున్నవి. బండి నల్లవాగు జేరింది. అంతవరకతడు దానిలో నిద్రపోతున్నాడో మెలకువతోనే ఉన్నాడో తెలియదుగాని చెంగున బండినుండి దూకి వాగువెంట పరుగెత్తినాడు. ఉస్మాన్ బండి ఆపుకొని అతని వెనుక పరుగెత్తి పట్టుకొని తమ ఊరికి రావలసిందని ప్రాధేయపడ్డాడు. ఆ మాటలు విని అతని ప్రయత్నం చూసి అల్లాజి కతనిపై జాలి కలిగిందో లేదా నిశ్చయించుకున్నాడోగాని అతని వెంటవచ్చి మళ్ళీ బండి యెక్కి వసంతాపురంలో దిగినాడు.

ఊరికి తెచ్చుకున్న తరువాత ఉస్మాన్ అతనికి ఓ గది ఏర్పాటుచేసి వేళకు అక్కడికి అన్నం పంపసాగినాడు. అతనికి ఎంతసేపు అల్లాజికి బట్టలు తొడగటం, కాళ్ళు చేతులు కడగటం వంటి లౌకిక కార్యాలలో ప్రవృత్తిని చేయటానికే సరిపోయింది గాని అతని చెంతగల వస్తువును గ్రహించే బుద్ధిపుట్టలేదు-ఎందుకో!

అల్లాజీ తన కేర్పాటు చేసిన గదిలో ఉండేవాడు గాదు. ఎక్కడెక్కడనో ఉండేవాడు. రాత్రి పగలు అతని పట్టుకొని అన్నం పెట్టడం ఉస్మాన్‌కో సమస్య అయింది. పోతేపోనీ అని ఊరకున్న నాడతడు ఎపుడో యింట్లోదూరి ఎదురుగా వేళకు ఏ పదార్థం కనపిస్తే అది అంటే మిర్యపు పొడియైనా, ఉల్లిపాయనైనా, ఉలవలదాణాయైనా ఉన్న మొత్తాన్నంతా మిగుల మెక్కేసి వెళ్ళేవాడు. అందువల్ల అతడు వేళ కతన్ని ఊళ్ళో ఎక్కడున్నది కని పెట్టి అన్నం పట్టుకవెళ్ళి పెట్టే పని తన పదేండ్ల కుఱ్ఱవానికి అప్పగించినాడు. ఆ పిల్లవాని పేరు అహమ్మద్. అతడు అల్లాజీనెపుడు కనిపెడుతు ఓ నాటిరాత్రి అతడెక్కడికి వెళతాడో చూడాలని వెనక వెళ్ళినాడట. అల్లాజీ ఆ రాత్రి కుమ్మెర గుట్టలకేసి వెళ్ళినాడట మార్గమధ్యంలో ఎందుకో వెనుదిరిగి తన వెనుక నిర్భయంగా వస్తున్న అహమ్మదును చూసి అనుకంపగలిగి అనుగ్రహించినాడని చెబుతారు. అపుడేమి జరిగింది. అహమ్మదు చెప్ప లేదుకాబట్టి ఏం జరిగింది ఎవరికి తెలియదుగాని తండ్రి పొందలేక పోయిన దానిని కొడుకు పొందినాడంటారు. ఈనాడు అల్లాజీలేడు ఆయన సమాధి పాలెం సమీపంలోని వసంతాపురంలో ఉంది. (నాగర్ కర్నూలుతాలూకా, మహబూబునగరంజిల్లా) అహ్మదొద్దీను గూడాలేడు ఆయన సమాధి అల్లాజీ పాదాలదగ్గర ఉంది.

ఇట్టివాడే మా ప్రాంతంలోని మరొక మహనీయుడు కందూరప్ప. ఆయన సమాధి రేమద్దులలో ఉంది (కొల్లాపురం తాలూకా, మహబూబునగరంజిల్లా) అతడు గూడా దేశకాలాతీతుడే. ఎక్కడివాడో తెలియదుగాని కందూరునుండి అక్కడికి వచ్చినాడు గాబట్టి కందూరప్ప అన్నారు. అతనిపేరు గూడ ఏదో తెలియదు. ఇట్టివారిని మనమే ఏదో తోచిన పేరున పిలుచుకోవలసి ఉంటుంది. ఇతని మహిమలు గూడ ఆ ప్రాంతంవారు చాలా చెబుతారు. ఆయన దేనికైనా 'లోపలివాడు అంటున్నాడు' అనేవాడు. ఎప్పుడు ఎడమచేతిలో తల అనించి రెండు పెడగాళ్ళపై కూచునేవాడు.

అల్లాజీని ఉస్మాన్ వలెనే కందూరప్పను ఓ కమ్మరి సేవించినాడు. మహనీయులు తమ దగ్గరుండే వస్తువును పొందటానికి ఆశ్రయించిన వారికెటువంటి పరీక్షలు పెడతారో ఏ విధంగా అనుగ్రహిస్తారో తెలియదు. చిక్లిత మహర్షి శృతివిద్యలకై పేద పురుషుల నాశ్రయించి వారు కక్కిన పదార్థాన్ని పక్షిరూపం ధరించి భక్షించినాడు గదా!

కందూరప్ప ఒక శివరాత్రినాడు రాత్రివేళ తనను సేవించే కమ్మరి యింట కూర్చొని ఉన్నట్టుండి ఏమితోచిందో 'లోపలివాడు అంటున్నాడురా' అని నోటిముందు దోసిలి పట్టుకొని దానిలోనికి వేడి వేడి పాలు గ్రక్కి పటురా'! అన్నాడట గాని అతడు సందేహించినాడట. ఓ అరనిముషంచూచి ఆయనే వాటిని మళ్ళీ చేతులకు ఆ ఎంగిలి తడిగూడ కనిపించకుండా లోనికి పీల్చుకొని లేచి వెళ్ళినాడట.

ఈయన నీటిలో మునిగి గంటల తరబడి ఉండేవాడు. ఒకనాడు స్నానంకోసం దినంవలెనే కోనేటికివచ్చి నీటిలో కూర్చున్నాడు. అంతే ఎంతకూ ఇక లేవలేదు. శరీరాన్నిపట్టి చూచి జనులాయన్ని తీసుకొనివెళ్ళి సమాధిచేసి గుడి గట్టినారు. అది రేమద్దులలో ఊరి వెలుపలఉంది. దానిలో ఆయన సిమెంటు బొమ్మగూడ ఉంది.

బాణాల కోట కందుకూరు సీమలో లేదు

జూన్ నెల భారతిలో శ్రీ కొమాండూరి రామానుజాచార్యుల వారు విశ్వబ్రాహ్మణ కవులకు సవరణ వ్రాయుచు బాణాల కోట కందుకూరు సీమలో లేదు. ఎక్కడ నున్నదో అను సందేహము వెలిబుచ్చిరి. కనుక దానిని గురించి తెలుపుచున్నాము.

బాణాలకోట కందుకూరిసీమలో లేదు. అది మలక సీమలో నున్నది.

శా. శ. 1412లో సాళువ శ్రీ నరసింగరాయల అయ్యగారు ద్రోణాచలం భూమి అశ్వంపురి భూమి అరణ్యమై యుండగాను ఇందుకు గ్రామాలు అకారం అయ్యేందుకు, ఏయే స్థలాలనుండి యెవరెవరు వచ్చినా ఆ గ్రామాదులు అకారం చేస్తున్నారో వారిది కాణియాచ్చి మిరాసులని రాసులు చెల్లించగల వారమని కవులు వ్రాయించి యిచ్చి పంపిస్తేను మలక సీమలోను గోరంట్ల సీమ లోను బిల్లకల్లు, బాణాల, అమరవాలు, శాతనకోట ద్యావన కొండ .... మొదలైన గ్రామాలనుండి వచ్చిన అష్టాదశ వర్గాలవారు వ్రాయిలున్న .... (కర్నూలు జిల్లాలోని అవ్వరి గ్రామ కరణంవద్ద నుండు తామ్రశాసనపాఠం) (అంధ్రుల సాంఘిక చరిత్ర-పుట 354)

పై శాసనంలో పేర్కొన్న బిల్లకల్లు, బాణాల రెండు నేడు సమీప గ్రామాలు. ఇవి నేడు పాలమూరి జిల్లాలోని అచ్చంపేట తాలూకాలో నున్నవి. "అమరవాలు" గూడా అదే తాలూకాలోని గ్రామము. దానిని శాసన లేఖకులో పాఠకులోఅమరవాది అనుటకు బదులు తప్పుగా చదివిరి. పూర్వము నేటి పాలమూరు అనగా మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతమును మలక సీమ అని పిలుచుచుండిరి. ఇక శాతనకోట, ద్యావనకోట, గోరంట్ల నేడలంపూరు తాలూకాలో నున్నవి. అనాడు బహుశః దానిని "గోరంట్ల సీమ" యని పిలుచు చుండిరేమో!

బాణాలకోట పూర్వము కాకతీయుల అయుధాగారమని చెప్పుదురు. బిల్లకల్లునకు ఖిల్లగడమని పేరు. అక్కడ అటవిక యోధులుండిరి. పూర్వము వీనికి సమీపమునగల బలుమూరు గుట్టలలో యినుప ఖనిజము దొరుకుచు డును. దానిని ఆ సమీపమునగల అనంతవరము ఉరఫ్ మోదుగులపేటలో కరిగించి యినుము చేయుచుండిరి. దానితో తయారైన అయుధములు బాణాల కోటలో భద్రపరుచుచుండిరి. అనంతవరము పూర్వ మా ప్రాంతమున గొప్ప అయోక్షేత్రము. అచట నందరు కమ్మరులే నివసించుచుండిరి. సుమారు పదేండ్ల నాటి వరకు అనాటి బూడిద గుట్ట లక్కడ నుండెను. అవి యన్ని యిటీవల ఎరువు క్రింద రైతులు పొలాలకు తోలుకొనిరి. ఇప్పటికి నక్కడ ఊరి తూర్పున నొక చెలుకలో చిలుపు ముద్దలు దొరుకును.

ఈ కోటపై క్రీ. శ. 15వ శతాబ్దమున దేవరకొండను పాలించు లింగమనేడు దండెత్తి కాల్చెను. ఈ విషయము వెలుగోటి వారి వంశావళియందు జెప్పబడినది. అనాటి నుండి యిక దాని వైభవము తగ్గినది. ఆ పిమ్మట నొకప్పుడచట భయంకరమైన మారి మసగి దిన దినము వందలకొలది జనులు మరణించిరట. అపుడు చావగా మిగిలిన వారది విడిచి లేచిపోయి నేటి కొండ నాగుల గ్రామమును గట్టుకొనిరని ప్రాచీనులు చెప్పుచుండిరి.

బాణాల వీరశరభ, శంభుదాస కవుల యొక్క కుటుంబములు మొదట నీ గ్రామమునకు జెందినవి. వీరశరభకవి కాళహస్తి శతకము రచించెను. ఆతడు సేక్కోటి లింగాలను పూజ చేసితినని చెప్పుకొనెను. ఇందత్యుక్తి యున్నను అబద్ధము మాత్రముండదు. బాణాల సమీపమున నేడు "లింగాల" యను గ్రామముండును. ఇది పూర్వము పెద్ద శైవక్షేత్రము. లెక్కకు మించిన శివలింగము లిక్కడ నుండెనట. అందుచేతనే దానిని "లింగాల" యనిరి. ఇది కృష్ణాతీర గ్రామము. అనది ఈ గ్రామమునకు పైన పెద్ద మలుపు తిరుగును. అచటి నీటి యొరిపిడికి ప్రతిరాయి లింగాకార మందును కనుక ఆ ప్రదేశమునకు శ్రీశైలమున "లింగాల గట్టు" అని పేరు. వీరశరభకవి యిచటి శివలింగములను పూజించి యుండును.

లింగాల, బిల్లకల్లు ఈ ప్రాంతమున మిక్కిలి ప్రాచీన గ్రామములు. లింగాలలో గోకర్ణ చోడుని బిల్లకల్లున ఉదయ చోడుని శాసనములున్నవి.

ఈ గ్రామమునుండి లింగమనేని దండయాత్ర జరిగినపుడు ఆ పిమ్మట మారి వ్యాపించినపుడు పెక్కు కుటుంబముల వారు వలస వెళ్ళిరి కనుక ఆ సందర్భమున బాణాల కవుల కుటుంబము లిక్కడ నుండి వెళ్ళి యుండును.

విశ్వబ్రాహ్మణులందు వీరేగాక యింకను ఖడ్గలక్షణ శిరోమణి కర్త నవనప్ప, అత్మ మెలుక కర్త అత్తలూరి పిచ్చన, ధీర జనమనోవిరాజిత కర్త తెనాలి రామలింగము, ఇంకను శతక కవులలో మల్లయోగి, దేవాదుల పెద్దన, మీసరగండమునిస్వామి, సీతా రామకవి, భృంగిరిటి బసవలింగయ మున్నగు స్మరణీయు లనేకు లున్నారు. ఈ యుగమున త్ర్యర్థి కావ్య నిర్మాతయగు పోకూరి కాశీపతిగారు. అందుడయ్యు అవధానమున నసమానప్రజ్ఞను ప్రదర్శించిన పోకూరి బాల బ్రహ్మాచార్యులు సకలాంధ్ర దేశమున ప్రసిద్ధులు. కనుక ఈ జాతికి సంబంధించిన చరిత్రపై జిజ్ఞాసులెవరైన పరిశోధించిన యెడల నది ఒక పట్టమునకు సరిపోగలదు.

శ్రీ కే. కిశోరుబాబు, శ్రీ కే. అశోకుబాబు
నాగర్ కర్నూల్

అరవము

శ్రీ శంకర గంటి రంగాచార్యులు 'అఱవ' శబ్దం గురించి అడిగినారు. (భారతి : జూలై 1982)

1. అఱవపిల్ల కించపఱచినట్లు కనబడు శ్రీనాథుని దను కొను చాటువును ఇచ్చినారు. శ్రీనాథుని ఖచ్చిత మైన రచనలో అఱవ వనితలను బాగుగనే పొగడినాడు. 'కంచి యఱవతలనమాస్తు్రి ఖడ్గలతలు' (కాశీఖండము)

2. "అఱవ" అంటే అఱ + వాయి అని శబ్దరత్నాకరము. వాయి అంటే నోరులేక భాషఅని అర్థము. అఱవాయి అంటే అర్థ భాష అని అర్థము వచ్చును. దీని అంతర్యం అంతుపట్టుట లేదు.

3. శబ్దము "అఱవము" అనికాక "అరవము" అని ఉండ వలెనని కొందరి మతము. రవము లేనిది అరవము. రవము అనిన శబ్దము. అది లేనిది అరవము. ఆ భాషలో 'హ' శబ్దము (ఆస్పిరేటు) లేకుండుట, మహా ప్రాణాక్షరాలు లేకుండుట కారణములు కావచ్చును. - బిషప్ కాల్డ్‌వెల్ ఈ లాగన్నాడని తెలియుచున్నది.

4. ఈభాషలో 'ర' శబ్దముతో సాధారణముగా మొదలిడు పదములముందు 'అకారము' కలుపబడును. 'రంగము' 'అరంగం' అగుచున్నది. ఇంకా "అరిసి" మొ॥ ఈ లాగుననే 'ఇ' 'ఉ' లు వచ్చును. 'ఇలంక,' 'ఉలగం' (లంక, లోకం అనుటకు) ఇత్యాది. ఈ 'అచ్'ల ప్రాబల్యం వలన 'అరవ' అనే పేరువచ్చి యుండ వచ్చును.

5. 'తమిళ' అనుపదము 'ద్రమిళ, ద్రవిడ" నుండి వచ్చినది. ప్రాచీనకాలములో ఐర్లాండులో 'డ్రూయిడ్లు' అనబడే మత గురువులుండెడివారు. వీరి పూజావిధులు మనవి మాదిరే వుండును. డ్రూయిడులు ద్రావిడులు కావచ్చును. ఇది ఒక తెగ వారికి వర్తించును. అనగా 'తమిళ' పదము, 'ఆంధ్ర' పదమువలె, జనమునకు అన్వయించును. ఆంధ్రుల భాష తెలుగు, తెనుగు అయినట్లు, తమిళుల భాష అరవం అయినది. 'ద్రావిడ' అనగానే 'అర్యులు' అనుపదము పోటీకి వచ్చును. 'ద్రావిడులు' కూడా 'ఆర్యులే' ద్రావిడులు, ఆర్యులనే వారితోబాటు భారతదేశమంతయు నివసించినవారు. బెలూచి స్థానములో, నాగాలాండులో, బిహారులో మన ద్రావిడభాషా ప్రభావమున్నది. ద్రావిడులపై సంస్కృత ప్రభావమున్నట్లు. ద్రావిడ-ఆర్య విభేదం బిషప్‌కాల్వెల్ వంటివారు సృష్టించినది. ఏబది ఏండ్లక్రితః కీ. శే. అర్. స్వామినాథ అయ్యరు తన 'ద్రావిడ సిద్ధాంతములు' అను భాషాశాస్త్ర గ్రంథములో అరవభాషవైదిక ప్రాకృత భాషయొక్క శిథిలావశేషమే (ఆయన 'డెబ్రిస్' అనే పదము వాడినాడు) కాని ప్రత్యేకమేమీ కాదని క్షుణ్ణముగా చర్చించినాడు. శ్రీ అరవిందులు కూడా "ఆన్ ది వేదాస్" అను గ్రంథములో ఇటువంటి అభిప్రాయమే వెలిబుచ్చినాడు. ఇవన్నీ ఆవేశాలకు, ఆగ్రహాలకు, అపార్థాలకు దారితీయు విషయమని తెలిసియుచర్చా సౌకర్యార్థము వ్రాసితిని.

6. దీనివలన 'అరవము' అనిన న్యూనార్థకముకాదు అని స్పష్టము. తెనుగు తేనె, కన్నడ కస్తూరివలె అరవామృతం ('అరవాముదం, అరవ + అముదము) అని ప్రసిద్ధి. 'తిరువాయ్‌మొళి' లాంటివి చదివితే ఇది నిజమే అనిపించక మానదు.

"త్రి"

సైకోట్రానిక్స్ - కొన్ని సందేహాలు

1982 ఏప్రియల్ "భారతి" సంచికలో శ్రీ వసంతరావు వేంకటరావు గారి రచన "సైకోట్రానిక్స్" రావడం ఒక విశేషం. తక్కువగానే రాసినా "సైకోటానిక్స్"కు సంబంధించిన పూర్తి విషయాలను అరకొరగానైనా చర్చించడం చెప్పుకోవలసిన విషయం. వ్యాసకర్తకు అభినందనలు. ఆ వ్యాసంలోని కొన్ని అంశాలు సందేహాస్పదంగా ఉండటం వలన, వివరణ కోసం నేను ఇది రాస్తున్నాను.

"సైకాలజీలో మనస్సు గురించి మాత్రమే ప్రస్తావనఉంటే, సైకీ, సైకిక్ పదాలలో ఆత్మగురించి, మనః ప్రక్రియలను అధిగమించే ప్రక్రియలు గురించి ప్రస్తావన ఉంది"- అని వ్యాఖ్య. మనస్సు, ఆత్మ అనే వాటిని - ఒకదాని నుంచి మరొక దానిని విడదీసి, విడమరచి, విశదీకరించే అవకాశం సిద్ధాంత పరంగా ఉందేమో

కాని, వైజ్ఞానిక పరిధిలో ప్రయోగాత్మకంగా వాటికి నిర్దుష్టమైన భేదాన్ని స్పష్టంగా చెప్పగలిగే అవకాశం మాత్రం లేదనే చాల మంది భావిస్తున్నారు. పైగా మనస్సును, ఆత్మను యిది అదని, అది యిదని, స్ఫురణకు వచ్చేలా శాస్త్రీయపరంగా పరిశోధనల ద్వారా తేలి చెప్పడం సులభసాధ్యం కాదు. అంతేకాకుండా మనస్సు, ఆత్మ అనేవి విజ్ఞాన పరిభాషలో ఒకే విధమైన శక్తి రూపంగా ప్రస్తావించబడుతూ ఉంటాయి. ఇటువంటి పరిస్థితులలో మనస్సు, ఆత్మ అని వేరుచేయడం కష్టం. అంటే "సైకాలజీ"కి "సైకోట్రానిక్స్" అనేది క్రొత్త పేరేగాని యింకేమీ కాదని నా అభిప్రాయం. రచయిత తీర్పు చెప్పేదరుగాక!

మనశ్శక్తిని మించిన శక్తి మానవునిలో ఉందని, ఉందీ అని అంగీకరించబడిందని తెలియజేస్తూ, అటువంటి శక్తులను చర్చించే శాస్త్రభాగం "పేరా సైకాలజీ" అని వ్యాసంలో తెలియ జేసి ఉన్నారు. అంతేకాకుండా "పేరా సైకాలజీ"లో జరిగే పరి శోధనలు మనశ్శక్తికి సంబంధించిన విషయాలపైన కానేకాదని వివరించి ఉన్నారు. ఈ అవగాహన సరియైనది కాదని నా భావన. మనశ్శక్తికి మించిన శక్తి వేరే ఉందని భావించడం మున్నాటికీ సబబుకాదు. అతీంద్రియ అభౌతిక దృగ్విషయాలుగా చలామణీలో ఉన్న 'క్లెయిర్ వోయిన్స్', 'టెలిపతీ', చివరికి 'బ్లాక్ మ్యాజిక్'లు (చేతబడి, వగైరాలు....) కూడ మనస్సును కేంద్రీకృతం చేసుకొని మనశ్శక్తిపైన ప్రభావాన్ని కలుగజేసేవే. అంతేకాని మనశ్శక్తికి మించిన మరోశక్తితో అవి ముడిపడి ఉన్నాయంటే నమ్మడంకష్టం. పైగా దీనికి "సైంటిఫిక్ ఎక్స్‌ప్లనేషన్" యివ్వడం చాలాక్లిష్టతతో కూడుకొన్నపని. మనస్సుకు సంబంధించనిది వేరే ఉన్నదని అను కోవడంలో వివేకం ఏ మాత్రమూలేదనే తెలుసుకొనవలెను. "ఇంట్యూషన్" అనేది మనస్సుకు సంబంధించినదే. ఏకాగ్రత మనస్సుకే పరిమితం. ఈ స్థితిలో "పేరా సైకాలజీ" కాని "సైకో ట్రానిక్స్" కాని కొత్తపదాలుగా మిగులుతాయే తప్ప విజ్ఞానశాస్త్ర విభాగాలుగా విరాజిల్లలేవు. ఈ సందేహాన్ని మనశ్శాస్త్రజ్ఞులు తీర్చ వలసి ఉన్నది.

నేను నాకు అనుభవమైన కొన్ని సంఘటనలు చెబుతాను. వీటిద్వారా "సైకోట్రానిక్స్"లో మనస్సుయొక్క ప్రభావంకూడ పెద్దగా ఉండదేమోనని తెలియవస్తుంది. కొన్ని ఉదాహరణలు.

ఒక ఆరేళ్ళ అమ్మాయిని నాకు చూపించి, "చూడుబాబూ! ఈ అమ్మాయి ఒళ్ళు ఎప్పుడు ఎలా కాగుతూ ఉంటుందో" అని అన్నప్పుడు నాకెందుకోమరి ఆ అమ్మాయిక ఎక్కువరోజులు బ్రతికదనిపించింది. (ఈ విషయాన్ని యిద్దరు, ముగ్గురికి చెప్పాను కూడ) అనుకొన్నట్లుగానే ఆ అమ్మాయి [illegible] ఆశ్చర్యాన్ని, ఆందోళనాన్ని కలిగించింది. [illegible] నాపై ఏ ప్రభావమూ పనిచేయలేదు. [illegible] ముందు నిలిచిన ఆలోచనది. అప్రియ[illegible] మనశ్శక్తికి అందని మరోశక్తి కాని [illegible] లేదు. మరి దీనికెలా సమాధానం చెప్పుకో[illegible]

ఒక నాగుపామును త్రొక్కినట్లు [illegible] సంఘటన మరుసటిరోజు ఉదయమే జరిగిన[illegible] భూతికి లోనైనాను. శరీరధార్మిక ప్రక్రియ[illegible] కొనసాగుతాయి. నియంత్రిత చర్యలు [illegible] అనియంత్రిత చర్యలు యాదృచ్ఛికంగా [illegible] కలగనడం అనేది శారీరక క్రియనాకాక [illegible] యీ నాటికీ ఒక సవాల్‌గానే నిలిచిపోయి [illegible] మెదడు పాత్ర ఉంటే ఉండేదేమోకాని, మన[illegible] అంటే అనుమానించవలసి వస్తుంది. ఇటువ[illegible] బోయే కార్యానికి ఊహామాత్రపు సూచన అం[illegible] ఎందువల్ల అన్న ప్రశ్నకు సమాధానం చె[illegible]

ఒక అబ్బాయిని చూచిన వెంటనే అతని [illegible] అనుమానం కలిగింది. అదినిజమేనని తెలిసిన[illegible] కలిగింది. "ఫేస్ రీడింగ్" ద్వారా మనోభావా[illegible] గాని, శారీరిక రుగ్మతలను బయట పెట్టడం [illegible] తంగా అనిపించిన ఆ ఊహకు కారణం [illegible] కష్టం. ఇక్కడ మనస్సు ప్రభావము [illegible] లేదు. దీనికి "సైకోట్రానిక్స్" లో ఏవిధమైన [illegible]

ఇటువంటి సంఘటనలే యింకా ఎన్నో [illegible] సారి భయంకూడ వేస్తుంది. కాబట్టి యిలాంటి [illegible] వెదకడం చాల అవసరం. ఆత్మగతమైనద[illegible] పూని చెప్పుకొన్నంత మాత్రాన ఒరిగేదేమి ఉం[illegible] పరిశోధించడానికి వైజ్ఞానికంగా విస్తరి[illegible] ఉన్నదా? శాస్త్రగతమైన నిర్దిష్ట ఆధారం [illegible] వాటిని వివరించి చెప్పడం వీలుకాదు. [illegible] రక్ష్యుక్తాగరక విద్యుత్ విచలిత ద్వంద్వ స్వ[illegible] తరంగ ధర్మం) ఆవేశ పరమాణు అంతర [illegible] మని నిర్ధారించు కొన్నా, పరిసరాలలోని ప్రభా[illegible] మైన పాత్రవహించవు అని చెప్పడానికి సం[illegible]

డాక్టర్ గుమ్మనూరు [illegible]

అప్సరస్త్రీల జాతులు

దుత్తలూరి వాస్తవ్యులు శ్రీ సూర్యదేవర రవికుమార్ భారతి జూన్ మాసపత్రికలో పై అంశముపై కొన్ని వివరణలు కోరిరి.

"జలజ సంభవు మానసంబు" అను సీసములో శ్రీనాథుడు బాణుని కాదంబరిలోని "పవమాన" పదమునకు 'దక్ష ప్రజాపతి' నుంచిరని వ్రాసినారు.

దక్ష ప్రజాపతి అల్లుడైన కశ్యపబ్రహ్మ వలన మునికి అరిష్టాదేవికి సంభవించిన "దివ్య గంధర్వ జాతిద్వయము"డగా దక్ష ప్రజాపతిని పేర్కొనుట అనుచితము. పైగా కాదంబరిలో "అన్యద్భూమేరుద్భూతం" అనుదానికి రామకృష్ణకవి 'క్ష్మా' అని అనువదించగా శ్రీనాథుడు దానిని వదలినట్లు కన్పించుచున్నది. దక్ష ప్రజాపతికి బదులు శ్రీనాథుడు 'దాక్షాయణీదేవి' అని వ్రాసి ఉండనోపు. తాళపత్ర ప్రతిలో కొంతభాగము శిథిలముకాగా అంతగా విజ్ఞానములేని లేఖకుని పూరణ ప్రమాదము కానోపు. అట్లే 'సప్త జిహ్వాజ్వాల సప్తకంబు'లో 'సప్తకంబు' పదము అనవసరము. దానికి బదులు 'స్పర్శనుండు' అను పూరణము సమంజసము. ఈ పూరణముతో శ్రీనాథుని 14 జాతుల త్రిదశాంగనల వివరములు సమగ్రము. శివరాత్రి మాహాత్మ్యములో యథాతథముగా శ్రీనాథుని సీసపద్యము తీసుకొన్నచో 13 జాతుల అప్సరసలే కానగును. కావున పై విధముగ ప్రతిపాదించిన పాఠాంతరములే స్వీకరించుట సముచితము.

అదే శ్రీనాథుని సీసములో "పదియు నాల్గుకోట్ల నప్సరసలు" అనుట పొరబాటు. పదియునాల్గు జాత్యప్సరసలు అని ఉండవలెను.

శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్య వ్రాతప్రతి చెదలు పరము కాగా లేఖక పూరణ ప్రమాదమువలన కొల్లలు కొల్లలు తప్పు పాఠములు వచ్చినవి. వాటికి ప్రత్యేక వ్యాస మవసరమైయుండును.

అప్సరసలందరు త్రిదశాంగనలు కావున 'దేవేభ్యో' పాఠాంతరముకన్న శ్రీనాథుడు గైకొన్న 'వేదేభ్యో' పాఠాంతరమే మెఱుగని నా అభిప్రాయము.

ఈ దేవ, వేదపాఠాంతరములు తప్పితే బాణుని కాదంబరి, రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్యము, శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యము పై సవరణలతో '14 జాతుల త్రిదశాంగనల' వివరములలో భేదమేమియులేదు.

పచ్చమట్ల కృష్ణ సూర్య నారాయణరాజు

సత్తెంపాడు

లేఖలు

సమీక్షా ప్రభంజనం!

ఏప్రిల్ భారతిలో జాతశ్రీ 'ప్రభంజనం' కథల సంపుటి మీద శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావుగారి సమీక్ష చూశాక ఈ లేఖ రాస్తున్నాను.

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావుగారు ఏ ప్రామాణిక సూత్రాల ననుసరించి 'ప్రభంజనం' కథల సంపుటి గుణదోష నిర్ణయం గావించారో అవగతం కాలేదు.

అభ్యుదయ సాహిత్యం మీద పాలడుగు వారు అకారణంగా ధ్వజమెత్తినట్టు వారి వుపోద్ఘాతంలో స్పష్టమవుతున్నది. అభ్యుదయ సాహిత్యం వారి ఒంటికి సరిపడకపోతే అది వేరే విషయం.

వైయక్తిక రాగద్వేషాలకు గురి అయినప్పుడు గుణాలు దోషాలుగా, దోషాలు గుణాలుగా కనిపించే ప్రమాదమున్నది. పాలడుగువారు ఆ ప్రమాదానికే లోనయ్యారని వారి సమీక్షచదివిన వారెవరైనా ఒప్పుకుంటారు.

దేశకాలాదుల్నీ - రచయితమీద వాటి ప్రభావాన్నీ విస్మరించి, స్వీయాభిరుచి రచయితకు లేదని విరుచుకుపడ్డం భావ్యం కాదు.

ఎ. సి. వార్డ్ అనే విమర్శకుడు క్రీస్తు ద్వారా మోక్షం, పాపం ద్వారా 'నరకం' అని జాన్‌డాన్ వంటివారు అనుకున్నట్లు మార్క్స్ ద్వారా మోక్షం, పెట్టుబడి వ్యవస్థ ద్వారా 'నరకం' అని 20వ శతాబ్దపువారు అనుకుంటున్నారు - అని రాశాడు.

ఇది పాలడుగువారి బోంట్లకు అంగీకార యోగ్యం కాకపోవచ్చును.

ఈ విషయంలో శ్రీ శ్రీ అభిప్రాయం చూడండి. 'తాను యే సాంఘిక దురన్యాయాలను నిర్మూలించాలని ఆవేదన పడుతున్నాడో, వాటి నిర్మూలనకే ఒక రాజకీయ పక్షంగూడా ప్రచారం సాగిస్తే కవి తన శిల్పాన్ని తప్పకుండా ఆ పక్షానికి అంకితం చేసి తీరుతాడు.' (తెలుగు తల్లి-పుట. 15)

జాతశ్రీ అభ్యుదయ సాహిత్యోద్యమానికి అంకితం అయిన రచయిత. ఓ రచయిత తాను నమ్మిన సిద్ధాంతాలను చిత్తశుద్ధితో కళాత్మకంగా ఆవిష్కరించడం నినాదప్రాయమవుతుందా? 'ప్రభంజనం'లోని కథల్లో సాహితీ విలువలేవీ లేకుండా శుష్క నినాదాలు నిండిపున్నాయని పాలడుగువారు నిరూపించగలరా?

ఇప్పట్ల డా. కేతు విశ్వనాథరెడ్డిగారి మాటలు అవశ్యం జ్ఞాపకం చేసుకోదగినవి.

'మనుషులు కోల్పోయిన మానవత్వాన్ని తిరిగి రాబట్టుకొనే మంచి కాలం కోసం తపించే వుద్యమాలను ఆహ్వానించే స్థితికి, ఆదరించే ఎత్తుకు సమష్టిగా యెదగడం మొత్తంగా చేయాల్సిన'ని' (అభ్యుదయ పుట. 38)

పాలడుగు వారు రచయితల్నేగాక పత్రికా సంపాదకుల్ని కూడా తమ ఆగ్రహానికి గురిచేశారు. 'ప్రభంజనం'లోని కథలు భారతి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. పాలడుగువారు ఆరోపించినట్లు యీ పేర్కొనబడిన పత్రికా సంపాదకుల్లో, మందులోపడి దొర్లేవారెవరు ? ద్వంద్వ విధానం కలవారెవరు ? పెట్టుబడి దారుల మోచేతుల నీళ్లతాగే వారెవరు ? కిరాయి సంపాదకులెవరు ? ఆధునిక సాహిత్యాన్ని చిందర వందర చేస్తున్న వారెవరు ! ఇది తేల్చుకోవలసిన విషయం. ఒకవేళ వీరిని తాము అనలేదని పాలడుగువారంటారేమో. ఇతరుల ప్రసక్తికి ఇది సందర్భంకాదు కదా ? దుందుడుకు తనంతో బాధ్యతారహితంగా విమర్శించడం విజ్ఞత అనిపించుకోదు.

'నవయుగ సాహిత్య పండిట్‌లమనీ, సాహిత్య విప్లవ కారులమనీ ఒక వయిపు గొప్పలు చెప్పుకుంటూనే, సర్క్యులేషన్ పెరుగుదల కోసం, యజమానుల మెప్పుదల కోసం క్షుద్రసాహిత్యాన్ని, నీచ సాహిత్యాన్ని, రేప్‌సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ....' అంటూ గొప్ప ఆవేశాన్ని వెలిగ్రక్కారు పాలడుగువారు.

జాతశ్రీ కథలు క్షుద్ర సాహిత్యానికి చెందినవా ? నీచ సాహిత్యానికి చెందినవా ? రేప్ సాహిత్యానికి చెందినవా ? సహేతుకంగా వివరిస్తే మీ అభిప్రాయాన్ని తప్పక గౌరవిస్తాము.

ఇక పాఠకుడి గురించి పాలడుగువారి ద్వంద్వ వైఖరి చూడండి. సెక్సు, సాడిజం, జుగుప్సాకరమైన వర్ణన సామాన్య పాఠకుడ్ని ఆకర్షిస్తాయట ! 'సాడిజం' అన్నది పాఠకుని బలహీనత అట ! అట్లాంటి బలహీన పాఠకుడు అవసరమైతే (పాలడుగువారికి) హఠాత్తుగా యెదిగిపోయి "ఆలోచన కరువయి, ఫయిటింగుల్లో నలుగుతూవున్న ఈ కుహనా సాహిత్య సేవకులను కాలరు పట్టుకొని 'ఏమిటిదంతా' అని అడుగుతాడు" అట ! ఔరా! ఏమి చమత్కారం!

మొత్తం పుస్తకంలో పాలడుగువారికి ఒకటి రెండు జుగుప్సాకరమైన వర్ణనలు తప్ప మరేమీ కనిపించలేదు. ఆ ఒకటి రెండు వర్ణనల ఆధారంగా మొత్తం పుస్తకాన్ని వెలకట్టడం సహృదయ విమర్శక లక్షణం కాదు.

పాలడుగువారి దృష్టిలో పుస్తకాన్ని సమీక్షకు పంపుకోవడం కూడా విచిత్రమే ! డప్పులు కొట్టుకోవడమే ? స్వకుచమర్దనమే !

'ఏ సాహితీ వేత్తో కితాబుయిస్తే నాకు అభినందనలో, ఆ పరమైన అవార్డులో మిగులొచ్చు. కాని జనం మిగుల్తారనేది అబద్ధం' అని జాతశ్రీ అనడంలో - పుస్తకాన్ని సమీక్షకూ కూడా పంపించను అనే అర్థం ధ్వని మాత్రంగా కూడా స్ఫురించడంలేదే ? ఏ సాహితీ వేత్తో కితాబు యిస్తే అక్కరలేదన్నాడు కానీ తన కథల్ని జనం దగ్గరకు చేర్చే సమీక్షలక్కరలేదనలేదే ?

ఉన్నవీ, లేనివీ - దోషాలనెన్నిటినో ఏకరువు పెట్టిన విమర్శకుల వారికి గుణాలు మాత్రం అసలు కనిపించనేలేదు. ఒక్క ముఖచిత్రం మాత్రం బావుందట. అదీ వీరి గుణం !

విధ్వంసనాత్మక విమర్శకాదు కావలసింది. నిర్మాణాత్మ కంగా వుండటం ప్రయోజనకారి.

కేవలం రంధ్రాన్వేషణే ప్రధాన లక్ష్యంగా, గుణ నిరూపణ లేకుండా, నిగ్రహం లేకుండా, అసమగ్రంగా, అస్తవ్యస్తంగా వున్న ఇలాంటి విమర్శలను సహృదయులెవరూ హర్షించరు.

విమర్శకులు రాగద్వేషాలకు లోనుగాక సమదర్శనులై వుండాలని మనవిచేస్తున్నాను.

దిలావర్
పందిళ్ళపల్లి

చరబండరాజుపై ప్రత్యేక సంచిక

తాను నమ్మిన సిద్ధాంతాల్ని ఊపిరిగా పీల్చి, పోరుపాటలి జెండాలుగా ఎగురవేసి, జాన పదుల గుండెల్లో స్పందనా ధమ ధ్వనులను మ్రోగించిన ప్రముఖ విప్లవ కవి కీ॥ శే॥ చెరబం రాజుపై 'ఎక్స్‌రే' ప్రత్యేక సంచిక వెలువరించనున్నది.

కావున రచయితలు చెరబండరాజుపై తమ తమ రచనల అగష్టు నెలాఖరులోగా 'ఎక్స్‌రే' కార్యాలయానికి పంపవలసింది కోరుతున్నాం-


'ఎక్స్‌రే
కొల్లూరి హౌస్, అమలాపురం - 533 20

జ్యోతిష్య మీమాంస - ఒక సూచన

"జ్యోతిష్య మీమాంస - ఒక సూచన" అను శీర్షికతో 1981 ఫిబ్రవరి "భారతి" కలగూరగంపలో, నేను ఒక జాతక ప్రతిని యిచ్చి, ఆ జాతకుని మానసిక శారీరక వివరములను, కౌటుంబిక సాంఘిక విషయములను అరకొరిగానైనా ఉజ్జాయింపుగానైనా, జ్యోతిష్య శాస్త్రముద్వారా నిర్ధారించి తెలుపవలసినదిగా, జ్యోతిష్యము తెలిసినవారికి విజ్ఞప్తిచేసి ఉంటిని. కేవలమది ప్రయోగాత్మకమైనదనియు, సామాజిక ప్రయోజనము నాశించి ఉద్దేశ్యించి నట్టిదియే అనియు, మనవి చేసుకొని ఉంటిని. దాదాపు ఒకటిన్నర సంవత్సరములు గడచిననూ నా వినతికెట్టి ప్రోత్సాహము కాని, సహకారముకాని లభించలేదు. కేవలము నామమాత్ర మనదగిన ఒకే ఒక స్పందన ధ్వనించినది. కాని ఆ స్పందనలో వెలువడ్డ వివరణలు, జాతకుని యదార్థ స్థితిగతులకు బహుదూరములో ఉన్నది. ఏ ఒక్క అంశముకూడ ఏకీభవించలేదు. ఈ ఒక్కరి సమాధానాన్నే ఆధారంగా తీసుకొని జ్యోతిష్య శాస్త్రంపై వ్యాఖ్యానించాలను కోవడం అవివేకం. అనుచితంకూడ. అందుకే యీ ప్రయోగము పూర్తి కాలేదనే చెబుతాను కాని, విజయవంతం కాలేదని మాత్రం చెప్పలేను. నేనులేవనెత్తిన విషయం కనుక 'భారతి' పాఠకలోకానికి సమాధానం చెప్పుకోవలసిన నైతిక బాధ్యత నాకున్నది. అందుకే నా కర్తవ్యాన్ని నేను నిర్వహిస్తున్నాను. మనవారిలో ఉత్సాహము లోపించినందుకూ, 'మనకెందుకులెద్దూ' అనే పనికి మాలిన పాలమారిన తనం నిండుకొన్నందుకూ, ఎంతగానో, బాధపడుతున్నాను. పాఠకవర్గం మన్నించాలి.

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

తిరుపతి



గ్రంథ విమర్శలు

జీవ పరిణామం

[రచన: ప్రొ యలమంచి రాధాకృష్ణ, 'యుగసృష్టి' ప్రచురించిన ప్రథమ గ్రంథం జీవ పరిణామం. చూడగానే ఎవరికైనా ముందుగా స్ఫురించేది మన తెలుగులోకూడా ఉన్నత ప్రమాణాలతో వైజ్ఞానిక గ్రంథాలు రాగల్గుతున్నాయా అని. ఆఫ్ సెట్ ముద్రణతో అనేక బొమ్మలతో మంచి కాగితంమీద, అన్నిటికి మించి ఆకర్షణీయమైన అట్టతో వెలువడిన ఈ పుస్తకం తదితర అనేక ప్రమాణ శాస్త్రీయ గ్రంథాలకు నాంది అని ఆశిద్దాము. పుస్తకం చిన్నదయినా (96 పేజీలు) ధర (రు 10/-) ఎక్కువ అనిపించదు.]

జీవపరిణామం చాలా ఆసక్తికరమైన విషయం. డార్వినిజమ్ (పరిణామ వాదంకాదు) గడ్డురోజుల్లో పడబోతున్న సమయంలో ఇది సందర్భాను సారంగా ఉంది.

పుస్తకం రచనలో మరికొంత శ్రద్ధవహిస్తే బాగుండును అనిపించింది. అంశాల విభజనలో వాటికి శీర్షికలుంటే చదువరులకు సులభంగా ఉండి ఉండేది. బొమ్మలు ఆర్టిస్టిక్‌గా ఉన్నాయి కాని శాస్త్రీయపరంగా అక్కడక్కడ చిన్న చిన్న పొరపాట్లు కనిపిస్తాయి. పేర్లు రాయడంలో కూడా కొన్ని లోపాలు సరిచేసుకొని ఉండవలసింది. అనవసర విషయాల ప్రాధాన్యం తగ్గించి కొన్ని ముఖ్యవిషయాలను మరింత విపులం చేస్తే బాగుండి ఉండేది.

తెలుగు అకాడమీ రూపొందించిన పదాలు ఉన్నా అనేక సందర్భాలలో వాటిని వినియోగించుకోవడం జరగలేదు. అచ్చులో తప్పులు కూడా చాలా సందర్భాలలో దొర్లాయి. దీని సందర్భంగా పట్టిక కూడా అవసరమే.

కొన్ని ముఖ్య పొరపాట్లు నాకు తోచినవి ఇస్తున్నాను.

1. 13వ పేజీ. ఎష్కిరిషియాకోలై ఇన్‌సులిన్ — బాక్టీరియమ్‌నే సరాసరి మానవునిలోకి ప్రవేశపెట్టడం జరగదు అనుకొంటాను.
2. 18వ పేజీ — యుగాల కాలాలు ఇవ్వడంలో పొరపాటు జరిగింది.
3. 19వ పేజీ — సరీసృపాలకు పాముజాతి అనడం సరికాదు (పాము సరీసృపం సరిగా ఉంటుంది.)
4. 22వ పేజీ — సాలీడు బొమ్మ నిజానికి క్రేబ్ ది.
5. 36వ పేజీ — హోలార్కిటిక్–నియార్కిటిక్ అనాలి.
6. 40వ పేజీ — టాడ్‌పోల్ దశలో కప్పకు కాళ్లుండవు అంటూ బొమ్మలో కాళ్ళు చూపించారు.
7. 42వ పేజీ — సెరటోడస్, నియోకెరటోడస్ పదాల ఉపయోగంలో లోపం ఉంది.
8. 43వ పేజీ — పారలలిజమ్ నిజానికి కన్‌వర్జెన్స్ భావంలోరాయాలి.
9. 44వ పేజీ — శాకాహారం అని చాలా సందర్భాలలో పొరపాటుగా రాసారు.
10. 45వ పేజీ — పరిగెత్తే జంతువులకు కాళ్లు పొడవు అవుతాయి అంటూ పాములను (హైడా) ఉదహరించారు.
11. 46వ పేజీ — సెసిలియన్స్ గురించి ఉదహరిస్తూ ముందు కాళ్ళు భూమిని తొలచడానికి అతి ముఖ్యము ఎక్కువగా ఉపయోగపడతాయి అన్నారు. నిజానికి వీటికి కాళ్లుండవు కదా)
12. 47వ పేజీ — ఎడ్‌హెసివ్‌పాడ్స్ వాక్యూమ్ డెవలప్‌మెంట్ ఉదహరించిన జంతువులకు వర్తించదు.

13. 49వ పేజీ

పాముజాతిలో పటాజియమ్ ఉండదు.

14. 56వ పేజీ

మమ్మాలియా విభాగంగా మానవజాతినిగుర్తించడానికి ఫేరింక్స్ ఒక లక్షణం అన్నారు.

15. 59వ పేజీ

ఆస్ట్రిలాయిడ్, మంగొలాయిడ్ అనడానికి ఆస్ట్రేలియన్, మంగోలియన్ అనడం సరికాదు.

16. 68వ పేజీ

పిలికా, ట్రోపస్, సైనాంత్రోపస్ అనేవి సుమారు 20, 30 సం. నుంచి హోమోఎరక్టస్ గా భావిస్తున్నారు.

17. 69వ పేజీ

1000 సం. మాత్రమేనా నియాండర్తల్ మానవుడు జీవితకాలం ?

18. 69వ పేజీ

పిల్డ్‌డౌన్ మానవుడు అని చెప్పబడేది మోసం అని చాలాకాలం కింద తెలిసింది.

19. 75వ పేజీ

పాండురోగం (బొల్లి), అల్బనిజమ్ (శ్వేతవర్ణం) ఈ రెండూ ఒకటికాదు

20. 77వ పేజీ.

కంచరగాడిద ఈ సందర్భంగా సరియైన ఉదాహరణ కాదు.

21. 78వ పేజీ.

కొన్ని అవయవాలు మగవాటిలోనూ, ఆడవాటిలోనూ ఎదుగుతాయి అంటూ, మగవాటిలో ఉన్నవాటి ఉదాహరణలే చెప్పారు.

శ్రీ జమ్మి కోనేటిరావు

భారతనామానుక్రమణిక

[రచన : శ్రీ పురాణపండ శ్రీచిత్ర. క్రౌను సైజు 114 పుటలు. వెల రు. 6 లు. ప్రకాశకులు - అధ్యాత్మ ప్రచారక సంఘం, అలమూరు. ప్రాప్తిస్థానం - శ్రీమతి పురాణపండ కమలాదేవి, అధ్యాత్మ ప్రచారక సంఘం, అలమూరు, తూర్పు గోదావరి జిల్లా.]

మన పూర్వులు చెప్పిన పురాణేతిహాసాలలో స్థలాల పేర్లూ, నదీనదాల పేర్లూ, వ్యక్తుల పేర్లూ మొదలైనవి అసంఖ్యాకంగా వస్తాయి. వ్యక్తుల వంశ పరంపరలు ఎన్నో వస్తాయి. అవన్నీ విన్నప్పుడేగాని తర్వాత జ్ఞప్తికి రావు. తిరిగి ఎవర్నిగురించి అయినా తెలుసుకోవాలంటే ఆయా గ్రంథాలు తిరగ వెయ్యవలసి వుంటుంది, కొంతవరకూ వాటిని గురించి తెలుసుకొనుటకు పూర్వగాథాలహరి చాలావరకూ ఉపయోగ పడవచ్చును. కాని ఆ గ్రంథం కూడా ఇప్పుడు అందుబాటులోలేదు. పురాణాలన్నింటిలోనూ వచ్చే పేర్లకు వివరణతో కూడా అనుక్రమణికను తయారు చెయ్యడం సులభం కాదు. ఒక వ్యక్తికాక విద్వాంసుల సంఘం చెయ్యవలసిన పని. ఒక్కొక్కరూ ఒక్కొక్క గ్రంథానికి దాన్ని తయారు చెయ్యడం కొంత సులభం. దీన్ని గ్రహించేరచయిత శ్రీచిత్ర భారతంలోని వచ్చిన పేర్లకు అనుక్రమణికను తయారుచేసి ప్రకటించడానికి పూనుకొన్నారు. అకారాది క్రమంలో ఉన్న యీ అనుక్రమణికలో ప్రధానమైన నామాలకు విపులంగానూ, అప్రధానమైన వాటికి సంగ్రహంగానూ వివరణ కూడా ఉన్నది.

ఒక్క నామమే వేర్వేరు సందర్భాలలో చాలాచోట్ల వస్తూ వుంటుంది. ఆ సందర్భాలలోని వివరణలన్నింటినీ సేకరించి ఒకచోట చేర్చడం శ్రమసాధ్యమైనది. దానికి ఎంతో ఓపికఉండాలి, ఎంతో శక్తిసామర్థ్యాలున్నవారికే ఇది సాధ్యపడుతుంది. పురాణపండవారు దీనికి అన్నివిధాలా అర్హులు. ఈ కుటుంబంవారు తరతరాలనుంచి సంస్కృత పాండిత్యంలోను, పురాణాలలోనూ పేరుబడి తమ గృహనామాన్ని సార్థక పరచు కొంటున్నారు. శ్రీచిత్రగారి జనకులు రామమూర్తిగారు ఎన్నో పురాణ గ్రంథాలను ప్రకటించారు. రాధాకృష్ణమూర్తిగారు మున్నగువారి రచనలు ప్రసిద్ధాలే. ఉషశ్రీగారి భారతప్రవచన, ధర్మసందేహాల జవాబులు అందరూ ఎరిగినవే. శ్రీచిత్రగారి భారతనామానుక్రమణికలో ఇది రెండవ భాగం. అకారాది క్రమంలో ప్రారంభమైన యీ అనుక్రమణికలో - ఈ పుస్తకంలో పట్టిక కకారంతో ప్రారంభమయింది. 'కంసుడు'తో ప్రారంభమై 'ఘోరక'తో పూర్తి అవు

తున్నది. మొదటి భాగంలో అజంతనామల అనుక్రమణిక ఉండి ఉంటుంది. దీన్నిబట్టిచూస్తే చాలా పుస్తకాలు రావలసినట్లున్నది.

"మహాభారత గ్రంథమందువచ్చిన లోకములు, ద్వీపములు, దేశములు, నగరములు, జనపదములు, సముద్రములు, నదములు, నదులు, సరోవరములు, కుండములు, తీర్థములు, వనములు, పర్వతములు, దేవతలు,మాతృకలు, యక్షులు, గంధర్వులు, నాగములు, నక్షత్రములు, అప్సరసలు, రాక్షసులు, అసురులు, దైత్యులు, దానవులు, ఋషులు, మునులు, రాజులు, మనుష్యులు, స్థానములు, వస్తువులు, పర్వములు మొదలైన వాటిపేర్లూ, వాటి సంక్షిప్త వివరణతోకూడిన అనుక్రమణిక" ఇది అంటూ రచయితయే చెప్పియున్నారు. దీనినిబట్టి ఇందులో ఏటి నామములు, వివరణ ఉండునో తెలుస్తూ ఉన్నది. ఇది చాలా ఉపయుక్తమైన రచన. ఇట్టి రచనకు పూనుకొన్న శ్రీచిత్రగారు అభినందనీయులు.

దీని ముద్రణకు తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్థిక సహాయం చెయ్యడం సముచితంగా ఉన్నది.

శ్రీ బులుసు వేంకట రమణయ్య

హఠరత్నావళి

[శ్రీ శ్రీనివాసభట్ట మహాయోగీంద్ర విరచితము. ఆంగ్ల వివరణముతోకూడ దేవ నాగరిలిపిలో ముద్రితము. సంపాదకులు, ఆంగ్ల వివరణకర్త: శ్రీ మేడపాటి వెంకటరెడ్డి, ఎం. ఏ. (ఆంధ్ర) డిప్లొమా ఇన్‌యోగ (కైవల్యధామ), టి. ఎమ్. & ఎస్. సి. ఐ. (ఋషీకేష్). డెమ్మీ సైజు 68 + 176 పుటలు. వెల : సాదా ప్రతి రూ. 35 (యు. కె. £ 6 $ 8) బైండు చేసిన ప్రతి రూ. 50. (యు. కె. £ 8 $ 8) ప్రతులకు : శ్రీ మేడపాటి రామకృష్ణారెడ్డి, అర్తమూరు, PIN 533 351 తూర్పుగోదావరిజిల్లా. (ఆంధ్ర)]

బ్రహ్మానుభూతికీ, ముక్తికీ ప్రధానములైన మార్గాలలో యోగమార్గం ముఖ్యమైనది. ఇతర మార్గాలు దీని తర్వాతివే ; అందువల్లనే మహామునులు ప్రశాంతమైన అరణ్య ప్రదేశానికి పోయి యోగ సాధనచేసి తమ లక్ష్యాన్ని అధిగమించేవారు. ఆ యోగాలలో రాజయోగం, హఠయోగం మొదలైన కొన్ని భేదాలున్నవి. యోగం పరతత్త్వావగతికి మాత్రమే కాకుండా మానవుల ఆరోగ్యానికీ, రోగ నివారణకూ కూడా మిక్కిలి ఉపయుక్తమైనది. చికిత్సకు లొంగని రోగాలు కూడా యోగాభ్యాసంవల్లనూ, యమ, నియమాసన ప్రాణాయామాదులవల్లనే కుదురుతూఉన్నవి. ఔషధ రహిత రాజయోగంవల్ల ఆ యోగ నిష్ణాతులు ఇతరులకు ఉన్మార్గంగా చికిత్సచేసి రోగనివారణ చెయ్యడం చాలామంది ఎరుగుదురు. ఏ యోగమార్గానికయినా ఈ ద్వివిధ ప్రయోజనాలూఉన్నవి. అట్టి యోగములలో ఒకటియైన హఠయోగాన్ని గురించి ఈ "హఠరత్నావళి" వివరిస్తున్నది.

ఏతద్ గ్రంథ సంపాదకులైన వెంకటరెడ్డిగారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించి 1971లో ఎం. ఏ. పట్టభద్రులైనారు. ఆయన దృష్టి యోగ విద్యమీదికి ప్రసరించింది. ఆయన జనకులు శ్రీ సుబ్బిరెడ్డిగారికిని యోగ విద్యపయి అనక్తి ఉధిరం. అదే కుమారునికీ సంక్రమించింది. వెంకటరెడ్డిగారు "కైవల్యధామ"లో గవిద్య నభ్యసించి డిప్లొమా సంపాదించారు. తర్వాత హృషీకేష్‌లోని యోగ పరిశోధన కేంద్రంలో పరిశోధనలు చేశాడు. వారి పరిశోధనలను వ్యాసరూపంగా చాలా పత్రికలలో ప్రకటించి ఎంతో అనుభవం గడించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న సికిందాబాదులోని వేమన యోగ రిసెర్చి ఇన్‌స్టిట్యూటులో యోగ సూపర్‌వైజర్‌గా పెక్కుమంది విద్యార్థులకు శిక్షణ నిస్తున్నారు. యోగవిద్యలో ఆయనకుగల ప్రగాఢ గౌరవమే వ్యయప్రయాసలతో కూడిన యీ గ్రంథ ప్రచురణకు కారణమైనట్లు గ్రహించవచ్చును.

సంపాదకులు ఎంతో శ్రమకోర్చి తంజావూరు, మదరాసు, హైదరాబాదు మున్నగుచోట్లగల ప్రసిద్ధ ప్రాచ్యలిఖిత గ్రంథాలయాలలోని ప్రతులను పరిశీలించి, యోగ రిసెర్చి సెంటర్లలోని గ్రంథాలనుచూచి, యోగ విద్యావేత్తలను సంప్రతించి యీ గ్రంథాన్ని అత్యుత్తమ రీతిని తమ ఆంగ్ల వివరణంతో కూడా ముద్రింపించారు. ఆయన 68 పుటల తమ విపుల పీఠికలో హఠయోగాన్ని గురించీ, ఆ యోగానికి సంబంధించిన హఠప్రదీపిక మున్నగు గ్రంథాలను గురించీ, వివరంగా చెప్పారు. హఠయోగం యోగాల్లో అత్యుత్తమమనీ, బౌద్ధమతంలోకూడా దీని ప్రాధాన్యం తెలుస్తున్నదనీ, హ - ఠ అనే రెండక్షరాలూ, సూర్యచంద్రుల సాంగత్యాన్ని తెలుపుతున్నవనీ, శివభక్తుల సాంగత్యానికివి సూచకాలని కూడా అంటారనీ చెప్పారు. ఈ యోగానికి ఆంధ్రదేశంలో ఎక్కువ ప్రచారం ఉండేదన్నారు. హఠరత్నావళి కర్త శ్రీనివాస భట్ట మహా యోగీంద్రుడు పెక్కు శాస్త్రాలలో గొప్ప విద్వాంసు

డనీ, కృష్ణానదీ తీర వాసియై ఉండవచ్చుననీ, అతనికి ఆత్మారాము డనే పేరుకూడా ఉన్నట్లు తెలుస్తున్నదనీ అన్నారు. యోగసాధన చేసి సమర్థులైనవారు తమ పేరుతోపాటు దీక్షానామాన్నికూడా పెట్టుకోవడం సంప్రదాయం. ఆత్మారామ, స్వాత్మారామ దీక్షానామం కలవారు శ్రీనివాస మహాయోగివలెనే మరికొందరుకూడా ఉన్నారు. ఒక ఆత్మారామ యోగికి - కుంభిళా పురాన్ని (నేటి కుమిలెను) పాలిస్తూ వుండిన గజపతిరాజులు ఒక అగ్రహారాన్నిచ్చారు. అది యిప్పటికీ ఆత్మారాముని అగ్రహారం పేరుతో ఉన్నది. ఈ చరిత్రాంశం ఈ పీఠికవల్లనే తెలుస్తున్నది. నేటి విజయనగరం ఏర్పడక మునుపు గజపతి రాజులకు దాని సమీపంలోని కుంభిళా పురమే (కుమిలియే) రాజధానిగా ఉండినది. అక్కడ పెద్దమట్టి కోటకూడా ఉండేది. హఠరత్నావళీకర్త 15వ శతాబ్ది మధ్యభాగానికి పూర్వమే ఉండి ఉండవచ్చునని తెలుస్తున్నది.

ఈ పీఠికలో యోగ విద్యకు సంబంధించిన అనేకాంశాలు వివరించబడినవి. గ్రంథం చివర అనుబంధాలు అయిదు చేర్చబడినవి. వాటిలో ప్రత్యంతరాల్లోని పాఠాంతరాలు, యోగాసనాలకు సంబంధించిన మాన ప్రమాణాల పట్టికలు, పదాను క్రమణిక ఈయబడినవి. మూల గ్రంథంలో నాలుగు ఉపదేశాలు (పాఠాలు) ఉన్నవి. వాటిలో సంగ్రహంగా ఈ యోగాంగాలను గురించిన వివరణ ఉన్నది. దాని వివరణ ఆంగ్లంలో చాలా సులభ భాషలో సంగ్రహించబడినది. దీనికి మున్నుడి వ్రాసిన శ్రీ రామానందయోగి (డైరెక్టర్, వేమన యోగ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్, సికిందరాబాదు) దీని ప్రశస్తిని వెల్లడించారు. యోగసాధకులకు, హఠ యోగజిజ్ఞాసులకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగకరంగా ఉన్నదని చెప్పవలసి ఉన్నది.

మూలాన్ని తెలుగు లిపిలోనూ, వివరణను తెలుగులోనూ ప్రచురించి వుంటే దీని ప్రయోజనం తెలుగు చదివి, అర్థం చేసుకొనే వారికే పరిమితమై ఉండేది. సంపాదకులు అలా చెయ్యకుండా మూలాన్ని దేవనాగరి లిపిలోను, వివరణాన్ని సులభమైన ఆంగ్ల భాషలోనూ ఇచ్చి ముద్రించడంవల్ల - వ్యయ ప్రయాసలు అధికమైనా - ఈ గ్రంథం యావద్భారతీయులకే కాక యోగాసక్తి కల ఖండాంతర వాసులకు కూడా మహోపకారం చేసినట్లు తెలుసుకోవాలి. ఇట్టి ఉత్తమ గ్రంథానికి తగిన ఆదరం లభించగలదని నా విశ్వాసం.

"ఆంగీరస"

భావ విప్లవకారుడు - కొడవటిగంటి సాహిత్య సమాలోచన

[సంపాదకుడు : టంకశాల అశోక్. ప్రచురణ : ప్రగతి సాహితి, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ. ప్రతులకు : బి. బి. జి. తిలక్, 102-పూర్వాంచల్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ, న్యూఢిల్లీ - 67, వెల : రు. 10]

తమ ఊహకందిన ప్రతివిషయాన్నీ వైజ్ఞానిక దృక్పథంతో పరిశీలించి అభ్యుదయ పంథాలో ఆలోచించి, జటిలమైన విషయాలను సైతం సూటిగా, నిర్మొహమాటంగా, నిరాడంబరమైన శైలిలో రచించి, ఆధునిక వచన రచనా ప్రక్రియలో అగ్రగణ్యుడనిపించుకొన్న భావ విప్లవకారుడు కొడవటిగంటి కుటుంబరావుగారు.

ఈ పుస్తకంలోని వ్యాసాలు, వివేచన, రచన, సాహిత్య జీవితం - అని మూడు భాగాలుగా విభజింపబడ్డాయి.

సంపాదకులైన శ్రీ టంకశాల అశోక్ 'ఎందుకీ పుస్తకం?' అన్న తమ మాటల్లో కుటుంబరావుపై చర్చ, ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రపై, చర్చ వివిధ సమకాలీన విషయాలపై ఆయనంతటి విస్తృత పరిశీలన మరే తెలుగు రచయిత చేయలేదు గనుక ఆ పరిస్థితులు కొనసాగినంతమేరకు ఆయన భవిష్యత్తులోనూ జీవిస్తాడు. ఆయనపై జరిగే చర్చ అంతకాలం జీవిస్తుంది. అయితే అట్టి చర్చకు ఈ పుస్తకం సమగ్ర రూపంకాదు - ప్రాతి పదిక మాత్రమే అన్నారు.

కుటుంబరావుగారి రచనలన్నిటిపై విపులమైన అధ్యయనం అవసరం. ఆ మహోద్యమానికిది తొలిమెట్టు కాగలదని విశ్వసింపవచ్చు.

'రచనా రణ రంగంలో కాకలు తీరినయోధుడు' అను వ్యాసంలో కె. వి. రమణారెడ్డిగారు "కొ. కు. గారి వచన రచన తేదేకాదు లోతు కూడా అంటూ, కొ. కు. వ్యక్తివాదిగా మొదలై సమష్టివాదిగా ఎదిగిన తీరును, శ్రీ శ్రీ., కొ. కు గార్ల వ్యక్తిత్వాల వివేచనను విశ్లేషించి శ్రీ శ్రీ కంటె ఇనుమిక్కిలిగా విప్లవశాస్త్రమైన మార్క్సిజాన్ని అధ్యయనం చేయడంతోపాటు, స్వయంగా కార్మిక సమస్యల అనుభూతి పొంది శ్రీ శ్రీ ని మించిపోయే వివేచననీ, పరిజ్ఞానాన్నీ పెంచుకోగలిగాడు" అన్నారు.

త్రిపురనేని మధుసూదనరావుగారు 'విప్లవాత్మక సాహిత్య దృక్పథం' అన్న వ్యాసంలో కుటుంబరావుగారు దేవుణ్ణి గురించి,

సామాజిక వ్యవస్థను గురించి, సాహిత్య విమర్శనారీతులను గురించి, అసాధారణ శక్తుల మీద చూపించిన ఆసక్తిని గురించి వెలువరించిన అభిప్రాయాలను వివరణాత్మకంగా విశ్లేషించారు.

వరవరరావుగారు 'దేశకాలావసరాలకు అనుగుణంగా ఎంచుకున్న రచనా ప్రక్రియలు' అన్న వ్యాసంలో జ్ఞానరహస్యం ప్రశ్నించడంలో వుందని తెలుసుకున్న చాల కొద్దిమంది రచయితలలో ఆయన ఒకరని, అరుదైన ఆలోచనాపరుడని పేర్కొన్నారు.

కొ. కు. గారి కథలలోని వైవిధ్యాన్నీ, వస్తు పరంగా చేసిన వర్గీకరణను వివరిస్తూ సామాజిక శ్రేయస్సే ప్రధానంగా కుటుంబరావుగారు రచించిన కథలను చక్కగా విశ్లేషించారు. ఇటీవలనే కన్నుమూసిన కొ. కు. గారు దాదాపు 500 కథలు వ్రాశారని, వాటిలో ఇప్పటికే 200 కథలు వరకు కన్పించకుండా పోయాయని పేర్కొన్నారు.

కె. వి. ఆర్‌గారు. కొ. కు. గారి నవలల్లోని విశిష్టతను వివరిస్తూ ముఖ్యంగా 'చదువు', 'అరుణోదయం', 'వారసత్వం' 'కురూపి' 'పంచకల్యాణి' నవలల్లోని ఇతివృత్తాన్ని విశదీకరిస్తూ, నిరంతరాయంగా సంఘ జీవితాన్ని ఇంతటి చిత్తశుద్ధితో, సమర్థతతో నవలీకరించినవారు ఒక్కరుకూడా తెలుగులో నాకు కానరారు అన్నారు. ఇది కె. వి.ఆర్. గారు 1966లో రచించిన వ్యాసంయొక్క పునర్ముద్రణ.

కె. రామమోహన్ రాయ్‌గారు తమ వ్యాసంలో కుటుంబరావుగారు తమవ్యంగ్య రచనాశక్తితో 'దిబ్బరాజ్యం', 'బకాసురుడు' 'అశోకవనం' వంటి వ్యంగ్య కథలను మలచిన తీరును విపులించారు.

వైవాహిక వ్యవస్థ రుగ్మతలనెత్తి చూపిన కుటుంబరావుగారి నాటికలలోని ప్రత్యేకతను శ్రీ వాడ్రేవు పతంజలి తమ వ్యాసంలో వివరించారు.

ఓల్గా, కుటుంబరావుగారి అనువాద రీతినీ, టి. కృష్ణాబాయి, చలసాని ప్రసాద్‌గార్లు తమ వ్యాసంలో కుటుంబరావుగారు స్త్రీల మనస్తత్వాలను వివరించిన తీరును తెలిపారు.

కుటుంబరావుగారు బాల సాహిత్యానికి ఒరవడి దిద్దినవ్యక్తి అనీ, బాలల సాహిత్యం పిల్లలలో మానవ ప్రయత్నాన్ని సద్బుద్ధిని పెంపొందించే విధంగా కొ. కు. గారు రూపొందించారనీ దాసరి సుబ్రహ్మణ్యంగారు తమ వ్యాసంలో పేర్కొన్నారు.

బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావుగారు కొ. కు. గారి రచనా శిల్పంలోని విశేషాలను విశ్లేషిస్తూ నిజాయితీ, నిష్కాపట్యం, కుటుంబరావుగారి వ్యక్తిత్వాన్ని మలచినట్లుగానే ఆయన రచనలను కూడా తీర్చిదిద్దాయన్నారు.

1950 తరువాత కుటుంబరావుగారు కథానికా శిల్పంపట్ల శ్రద్ధతీసుకున్నట్లు కనబడదన్నారు. అందుకుకారణం సాహిత్యంలో ప్రధానంగా వుండవలసిన హృదయ ధర్మంపట్ల ఆయనకు అంతగా నమ్మకం లేకపోవడం, బుద్ధి వ్యాపారం, శాస్త్ర పరిజ్ఞానం ఆయన రచనలలో పై చేయి కావడం పాఠకులలో ఆలోచనరేపే గుణం సాహిత్యానికి ముఖ్యమని భావించడం ప్రముఖ కారణాలు కావచ్చునని సూర్యారావుగారన్నారు.

బి. బి. జి. తిలక్, 'సినిమా రచన' అనే తమ వ్యాసంలో కుటుంబరావుగారు సినిమాకళపై వందలాది వ్యాసాలు, సమీక్షలు వ్రాశారని వాటిలో అయిదోవంతు కూడా లభించటం లేదన్నారు. కుటుంబరావుగారు సినిమా మీద వాద వివాదాలు రేపిన మొదటి విమర్శకునిగా, మార్గదర్శకునిగా గుర్తు పెట్టుకోవలసినవారన్నారు.

జె. మనోహరరావుగారు తమ వ్యాసంలో శాస్త్రవిజ్ఞానాన్ని తెలుగు పాఠకలోకానికి శాస్త్రీయ దృక్పథంతో అందించుటకు రావుగారు అనన్యమైన కృషి చేశారన్నారు.

శ్రీ సూరంపూడి సీతారామ్, కొ. కు. గారు జర్నలిస్టుగా వార, మాసపత్రికలకు, సినిమా పత్రికలకు కొత్త స్వరూపాన్నిచ్చిన వారన్నారు.

'విమర్శ శాస్త్ర శస్త్రకారుడు' అన్నవ్యాసంలో వి. చెంచయ్యగారు కుటుంబరావుగారి విమర్శనా వైఖరినివివరించారు. 'సాహిత్య సాంస్కృతిక విమర్శ కావలి కుక్కలాగా పని చెయ్యందే సాహిత్యానికి వర్తమానంగాని, భవిష్యత్తుగాని లేదు' అన్న కొ.కు. గారి వాక్యాలను వుటంకించారు.

మూడవ భాగంలోని వ్యాసాలన్నీ కుటుంబరావుగారితో అతి సన్నిహితం గలవారు వ్రాసినవి.

మా గోఖలేగారు కొ. కు. గారి జీవిత విశేషాలను, వారి స్వతంత్ర భావాలను వివరించారు. కుటుంబరావుగారి కుమారుడు రోహిణీ ప్రసాద్ తమ నాన్నగారి అభిరుచులను, శాస్త్రీయ దృక్పథాన్ని, తోటపని, ఫొటోగ్రఫీపట్ల వారికున్న ఆసక్తిని వివరించారు. కుటుంబరావుగారు వ్రాసినదానికి చిత్తుప్రతి అనేది తయారు చేసుకునేవారుకారనీ, ఏది వ్రాసినా ఒకేసారి వ్రాసేవారనీ, వ్రాసినదాన్ని దిద్దటంగాని, తిరిగి రాయటంగాని చేసేవారుకాదనీ రాశారు. ఇదెలా సాధ్యమని ప్రశ్నించినపుడు, రావుగారు రాసే

వేగము, ఆలోచించే వేగము సమానంగా వుండాలనీ, ఏది ఎక్కువైనా కష్టమనేవారనీ, అది తాను అభ్యాసంతో సాధించిన ప్రజ్ఞ అని చెప్పేవారన్నారు. ఏదైనా రాసేటప్పుడు మంచం మీద బోర్లాపడుకుని వ్రాసేవారన్నారు.

'చందమామ' మేనేజర్ రామారావుగారు కొ. కు. గారితో తమ సన్నిహిత పరిచయాన్ని వివరిస్తూ చనిపోవటానికి ముందు అరగంటవరకు రాస్తూనే వుండిపోయారని. రావుగారిలో తమకు ప్రాక్పశ్చిమాల సంఘర్షణలు కన్పించేవని పేర్కొన్నారు.

బి. విశ్వనాథరెడ్డిగారు కుటుంబరావుగారికి క్రమశిక్షణపట్ల గల ప్రీతిని గురించివ్రాశారు.

కె. జి. కృష్ణమూర్తిగారు సినిమాల పట్ల, చైనాలో మావో తదనంతర పరిణామాలపట్ల రావుగారు వెలువరించిన అభిప్రాయాలను పేర్కొన్నారు.

రావి కొండలరావుగారు కొ. కు. గారు తన స్థాయికి వుండవలసిన కనీస అహంకారం కూడా లేని నిగర్వి అని, ఎందరో రచయితలను తీర్చిదిద్దినవారని పేర్కొన్నారు.

బొలాంత్రపు రజనీ కాంతరావుగారు కొ. కు. గారు ఆంధ్ర వారపత్రికలో పనిచేసేటపుడు కొద్దు కథలు, గల్పికలు వ్రాసి మార్గదర్శకులయ్యారని 'గల్పిక' అనేపేరు వారే పెట్టారని వ్రాశారు.

కుటుంబరావుగారు సంగీతమంటే చెవికోసుకునేవారు. "తమ అమ్మాయి వివాహానికి రిసెప్షన్‌లో, నా కచేరీ పెట్టారు. మరి అప్పుడు పెండ్లి కుమార్తెగా అందరినీ ఆహ్వానిస్తూ అటు వుండాలి కదా, హాయిగా వేదిక దగ్గరగా ఇంకొంతమంది అభిమానులతో కలసి నా వీణ వింటూ ఇటు వుండిపోయారు. భార్య శ్రీమతి వరూధిని వచ్చి 'మీ కళారసన బంగారంగానూ మీరీ వేళ కూడ చిట్టిబాబుగారి వీణ వింటూ కచేరీకి వెళ్ళిన శ్రోతలాగా ఇక్కడే కూర్చుండిపోతే ఎలా ? అతిథులను ఆహ్వానించవద్దు !' అని బుజ్జగించి తీసికెళ్ళేదాకా వెళ్ళలేదు. అటువంటి కళారసన కొడవటిగంటిది.' అని వైణిక విద్వాన్ చిట్టిబాబుగారు తమ వ్యాసంలో వివరిస్తూ కృష్ణశాస్త్రి కవితను సన్నాయి వాయిద్యానికీ, శ్రీ శ్రీ కవితను డోలు వాద్యానికి సంగీత పరంగా పోల్చారన్నారు.

పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు కొ. కు. గారి లేఖలను పేర్కొంటూ వారి ఉత్తరాలలోని కొన్ని అంశాలను మచ్చుతునకలుగా తమ వ్యాసంలో అందించారు.

నండూరి రామమోహన్‌రావుగారు తమ వ్యాసంలో కొ. కు. గారు గొప్ప తెలుగు వచనం వ్రాస్తున్నట్లు పైకి కనిపించకుండా తెలుగు వచనశైలిని తీర్చిదిద్దిన మన అగ్రరచయితలలోఒకరన్నారు.

ఎస్వీ. ఎస్. రావుగారు కుటుంబరావు గారి పరిశీలనాశక్తిని తమ వ్యాసంలో విశ్లేషించారు.

బహుముఖంగా సాగిన కుటుంబరావుగారి సాహిత్య ప్రక్రియలలో వారు వ్రాసిన సాహిత్య వ్యాసాలను గురించిన విపులమైన విశ్లేషణ, పరిశోధన జరగాలి. కుటుంబరావుగారి లేఖలను, డైరీలను సేకరించి వారి సమగ్ర జీవిత చరిత్రను వెలువరించటం ఎంతైనా అవసరం. కుటుంబరావుగారి రచనలను సంపుటాలుగా వెలువరించే కృషికి పూనుకొన్న విశాలాంధ్ర ప్రచురణాలయం వారే ఈ పనికి పూనుకోవటం సమంజసంగా వుంటుంది.

పుస్తకాన్ని గురించి ఒకమాట చెప్పక తప్పదు. పాలమీగడలాంటి కాగితంపై అందమైన ముద్రణతో బాపూగీచిన కొ. కు. ముఖచిత్రంతో అచ్చు తప్పులు దాదాపు లేకుండ ఆకర్షణీయంగా వెలువరించిన 200 పేజీలుగల పుస్తకాన్ని కేవలం పదిరూపాయలకు అందజేస్తున్న టంకశాల అశోక్‌గారిని ఉత్తమ సాహిత్యాభిరుచి గల వారందరూ అభినందించి తీరాలి.

సాహిత్యావలోకనం

(సాహిత్య వ్యాస సంపుటి)

[రచన : శ్రీ పేర్వారం జగన్నాథం. ప్రచురణ : చైతన్య సాహితి, హనుమకొండ, వరంగల్. ప్రతులకు : ఆంధ్ర సారస్వత పరిషత్, బొగ్గులకుంట, తిలక్‌రోడ్, హైదరాబాద్ - 1 (లేదా) పేర్వారం అమృతాబాయి 1-7-5-5-1-సి. మిథిలానగర్, హనుమకొండ, వరంగల్. పుటలు : XX+ 132. వెల : రు. 15]

శ్రీ పేర్వారం జగన్నాథంగారు వ్రాసిన పన్నెండుసాహిత్య వ్యాసాల సంపుటమే ఈ 'సాహిత్యావలోకనం. ఆ యా ప్రత్యేక సందర్భాలనేకాక తమను ఆయా వ్యాస రచనకు ప్రేరేపించిన పెద్దలను మిత్రులనుకూడ 'రథచక్రాలు', రచనలో జగన్నాథంగారు వివరించారు. ఈ వ్యాసాలన్నీ ఇదివరకే వివిధ పత్రికలలో ప్రచురింపబడినవి.

'తెలుగు నవలపై జాతీయోద్యమ ప్రభావం' అన్న మొదటి వ్యాసంలో ఆంగ్లభాషా సాహిత్యాల అధ్యయనం తెలుగు నవలా ప్రక్రియను రూపొందించిన తీరును తెలుపుతూ జాతీయోద్యమానికి

దోహదం చేసే నవలలు, సాంఘిక దురన్యాయాలు చిత్రించే నవలలు, ఆంధ్రుల పురావైభవాన్ని చాటే నవలలు, ఈ విధంగా తెలుగు నవల విభిన్న రూపాలలో పరివ్యాప్తి చెందిన తీరును ఈ వ్యాసంలో చక్కగా చిత్రించారు.

ఆ నాటి బ్రిటిష్ ఇండియాలో సాగిన స్వాతంత్ర్యోద్యమ ప్రభావం తెలంగాణంపై పడింది. నాందీ వాచకంగా 1900లో తెలంగాణా గ్రంథాలయోద్యమము, 1901లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం మున్నగు గ్రంథాలయాలు జాతీయ చైతన్యాన్ని రగుల్కొలిపాయి. 1922లో ఆంధ్ర జనసంఘం స్థాపింపబడింది. పైశాచిక నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ మున్నగు సంస్థలు ప్రజల పోరాటానికి సారథ్యం వహించాయి.

ప్రజాకవి కాళోజీ,

"మన కొంపలార్చి మన స్త్రీల చెరిచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచిపోకుండగ గురుతుంచుకోవాలె
కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె
కాలంబు రాగానె కాటేసి తీరాలె

అంటూ కర్తవ్యాన్ని బోధించారు.

మహాకవి దాశరథి,

"ఓ నిజాం పిశాచమా ! కానరాదు
నిన్ను బోలిన రాజు మాకెన్నడేని
తీగలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రత్నాల వీణ

అంటూ నిజాం ప్రభుత్వాన్ని దుయ్యబట్టాడు.

రజాకార్లు ఉపాధ్యాయుడైన గానుగపాటు నారాయణరెడ్డిని వ్యూహం పన్ని కాల్చి చంపినపుడు ఒక కవి :

"మండ నైజామోడు నీ ముందు నిలువలేక
చాటుమాటున నిన్ను చంపించుటకు గాను
కుట్రలెన్నో పన్నెరా క్రామేడ్ ! కుటిల ప్రభుత్వమ్మురా
నారాయణరెడ్డి నీ లక్ష్యసిద్ధికై !

అంటూ హృదయం తల్లడిల్లేట్లుగా రచించారు.

మరో పల్లెటూరు కష్టజీవి,

"నైజాం సర్కరోడా, నాజీల మించినోడా
నీ గోరి కడుతం కొడుకో నైజాము సర్కరోడ"

అంటూ స్వాతంత్ర్య సమరోత్సాహాన్ని ప్రజ్వలింప చేశాడు.

తెలంగాణ విమోచనోద్యమ కాలంలో ప్రజా సాహిత్యం వెల్లువికిన తీరును "ప్రజాసాహిత్యం - తెలంగాణా విమోచనోద్యమం" అన్న రెండో వ్యాసంలో చిత్రించారు.

"తెలుగుపై ఉర్దూ భాషా ప్రభావం" అన్న వ్యాసంలో 'ఉర్దూ' పదం టర్కీ భాషనుండి గ్రహింప బడిందని ఉర్దూ భాష హైందవ ఆర్య భాషా కుటుంబానికి చెందినదేనని అన్నారు. శ్రీనాథుడు 'హరవిలాసం' అవతారికలో 'ఖుసిమీరన్ సురధాణ నిండుకొలువుపై హర్షిన్నచో' అన్నాడు ఖుసి (సంతోషము) 'సురధాణ' (సుల్తాన్ పదానికి తద్భవము). 16వ శతాబ్దిలోని పొన్నెకంటి తెలగనార్యుడు 'ఎట్టి వజీర్లు వెన్నంగ నీకుగారు' (యయాతి చరిత్ర 1-15) 'వజీరు' అనే ఉర్దూ పదాన్ని ప్రయోగించారు. యయాతి చరిత్రను అమీరుఖానుకు (మల్కిభరాముడు) అంకితమివ్వబడింది. తెలుగు కావ్యాన్ని కృతిగొనడంలో మొదటి మహమ్మదీయుడు మల్కిభ రాముడే. పింగళి సూరన కళాపూర్ణోదయములో 'అదె ఘృత తండుల ప్రకరమిల్లవె చీరలు భూషణాది సంపదల వెరాజు రాక ఉలుపా యొనగూర్పి నయెట్లు మిరెడున్ (కళా6-133) ఇందలి 'ఉలుపా' ఉర్దూ పదము. దిట్టకవి నారాయణకవి (18వ శతాబ్ది) తన 'రంగరాయ చరిత్రములో' హాజరు, మెహర్బాన్, గరీబ్-పర్వర్, మున్నగు పదాలను విరివిగా ప్రయోగించారు. 19వ శతాబ్దికి చెందిన రంగరాజు కేశవరావు తన ఇంద్రద్యుమ్నీయము అనే ప్రబంధంలో పెక్కు ఉర్దూ అరబీ పదాలను ప్రయోగించారు. ఆధునికులైన శ్రీశ్రీ, నారాయణరెడ్డి, సోమసుందర్ మొదలగువారు తమ రచనలలో ఉర్దూ పదాలను ప్రయోగించిన తీరును చూపించారు.

"యయాతి చరిత్ర - కావ్యావలోకనం అన్న వ్యాసంలో పొన్నెకంటి తెలగనార్యుని యయాతి చరిత్ర కావ్య విశేషాలను, కృతికర్త మల్కిభరాముని ఔదార్యాన్ని వివరించి తెలగనార్యుని యయాతి చరిత్ర అచ్చ తెనుగులో వ్రాయబడిన కావ్యాలలో అమూల్యమైనదని పేర్కొన్నారు.

తెలంగాణంలో ఎందరో అజ్ఞాత కవులున్నారు. 19వ శతాబ్దికి చెందిన 'రంగరాజు కేశవరావు - జీవితం-సాహిత్యం' అన్న వ్యాసంలో కేశవరావుగారి బహుముఖ ప్రతిభను వారి 'ఇంద్రద్యు

మీన్నియము' అన్న ప్రౌఢ ప్రబంధము యొక్క వైశిష్ట్యాన్ని విపులంగా చిత్రించారు జగన్నాథంగారు. బహు భాషా వేత్తలు, బహు గ్రంథకర్తలైన రంగరాజు కేశవరావుగారి రచనలపై విపులమైన పరిశోధనకు ఈ వ్యాసం ప్రేరకం కాగలదు. కేశవరావుగారి కావ్యాలు వెలుగులోకి రావటానికి, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి సంయుక్త కార్యదర్శిగానున్న జగన్నాథంగారు పూనుకోవటం సముచితం.

ఈ సాహిత్య వ్యాస సంకలనంలోని 'సర్దారు సర్వాయి పాపడు - జానపద సాహిత్య గాథలు', జగన్నాథంగారి పరిశోధనా కృషికి నిదర్శనం. సర్వాయి పాపన్న జన్మించిన ఖిలాషాహాపురం గ్రామానికి చెందిన వారే జగన్నాథంగారు. 18వ శతాబ్దిలో ఢిల్లీ పాదుషాల నెదిరించిన స్వాతంత్ర్య వీరుడు సర్దారు పాపారాయుడు. పాపన్న చరిత్ర జానపద వీరగాథల్లో బాగా వ్యాప్తి పొందింది. జె. యె. బోయల్ అనే ఆంగ్లేయుడు బళ్ళారిలో ఒక బోయవాడు పాడుతుండగా వ్రాసుకొని 'ఇండియన్ అంటిక్వెరీ' పత్రిక (1874) లో ప్రచురించాడు. కీ. శే. మల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆదిరాజు వీరభద్రరావు, చొల్లేటి నృసింహ శర్మ మొదలగువారు కొన్ని వ్యాసాలద్వారా ఈ వీరుని చరిత్రను వెలువరించారు. ఆచార్య బి. రామరాజుగారు తమ 'తెలుగు జానపద గేయ సాహిత్యం'లో మరికొన్ని విశేషాలు వెలువరించారు. జగన్నాథంగారు సర్దారు పాపారాయుని జీవిత విశేషాలను అతని సమకాలికురాలైన ఎరుకల నాంచారికథను పెక్కు వివరములతో ఈ వ్యాసాన్ని రచించారు.

"ఆరె భాష - పుట్టుపూర్వోత్తరాలు – ఒక పరిశీలన" అన్న వ్యాసంలో మరాఠీ మాండలికవగు ఆరె భాష వికాసాన్నిఆరె మరాఠీలఆచార వ్యవహారాలను వివరించడం జరిగింది. 'ఆరె' పదము ఆర్యపదం యొక్క రూపాంతరమన్నారు. ఆరె భాషాసంస్కృతుల కూర్చిన పరిశోధనావశ్యకత ఈ వ్యాసంలో నొక్కి చెప్పారు.

'జాషువాపై జాతీయోద్యమ ప్రభావం' అన్న వ్యాసంలో మహాకవి జాషువా రచనలలోని వైశిష్ట్యాన్ని వారి రచనలలో అంత ర్వాహినిగావున్న మానవతావాదాన్ని సోదాహరణంగా వివరించారు.

"తిమిరంతో సమరం – దాశరథి కవితాతత్వం" అన్న వ్యాసంలో తెలంగాణా పోరాటానికి ఊపిరిపోసి 'మూడుకోటుల నొక్కడే మడిబిగించాలని అరిచిన దాశరథి గారి తిమిరంతో సమరం కావ్య విశేషాలను సోదాహరణంగా చూపారు.

"అధిక్షేప కావ్యాలు - నారాయణరెడ్డి సమదర్శనం" అన్న వ్యాసంలో సి. నా. రె గారు సామాజిక దురాచారాలను మానవ మన స్వభావాలను 'గుండియ జమ్మని స్పందనము పొందినపుడెల్ల వెలిసుబికిన చమత్కార లలిత ముక్తికమ్మ లివ్వి' అంటూ చిత్రించిన తీరును వివరించారు.

"వచనకవిత్వం - శీలా వీర్రాజు - కొడిగట్టిన సూర్యుడు" అన్న వ్యాసంలో శీలా వీర్రాజుగారి కథాకావ్యాలను చక్కని వచన కవితలలో రూపొందించిన తీరును చిత్రించారు.

'యుగకర్త గురజాడ-ఆధునికత" అన్నది చివరి వ్యాసం. రాయప్రోలు వారు నవ్య కవితాచార్యుడు కావచ్చు. కాని "ఆధునిక కవి"గా గుర్తింపదగినవారు గురజాడ అప్పారావుగారేనని పేర్వారం వారి అభిప్రాయం.

జగన్నాథంగారి పరిశోధనాదృష్టిని, అభిరుచి వైవిధ్యాన్ని, అభ్యుదయ దృక్పథాన్ని నిరూపించు ఈ వ్యాస సంపుటాన్ని ఆంధ్ర పితామహులు మాడపాటి హనుమంతరావుగారి కంకిత మివ్వడం అభినందనీయం. సాహిత్యాభిమానులు తప్పక చదవ వలసిన పుస్తకం.

'మాతృదేవోభవ'

(వ్యాస - కథా సంకలనం)

[సంపాదకులు: ముళ్ళపూడి సూర్యనారాయణ మూర్తి సి. హెచ్. లక్ష్మీనాథాచార్యులు, పగడాల లక్ష్మీనారాయణ. ప్రచురణ - సాహితీ సమితి, రంగారెడ్డి జిల్లా రచయితల సంఘం. వికారాబాద్, వెల : రు. 5/-]

1973లో సాహితీ సమితి అన్న పేరుతో ప్రారంభింపబడిన సంస్థ 1977లో రంగారెడ్డి జిల్లా రచయితల సంఘంగా విస్తరించింది. ఉత్తమ సాహిత్యాన్ని ఆదరించి రంగారెడ్డి జిల్లాలోని రచయితలను ప్రోత్సహింపవలెనన్న ఆశయంతో జిల్లా రచయితల మహాసభల సందర్భంగా ప్రచురించిన ఈ సాహిత్య వ్యాసాల సంపుటిలో మాతృదేవోభవ, జీతాలొచ్చాయి జాగ్రత్త, మానవత్వం మేల్కొంది నిష్క్రమణ అనే నాలుగు కథలు. పది వ్యాసాలు వున్నాయి. డా. ఇలపావులూరి పాండురంగారావుగారి "పరమ భాగవత శిఖామణి పోతన" అన్న వ్యాసం కూడా వీటిలో వుంది.

'కాళిదాస కవితా సౌందర్యం' అన్న వ్యాసంలో కాళిదాసు కావ్యాలలోని ఉపమాలంకార వైచిత్రిని, 'విద్యకూ - నీతి నిజాయితీలకు సంబంధం లేదా ?' అన్న వ్యాసంలో నేటి విద్యా విధానంలో కొరవడుతున్న నైతిక విలువల తీరును, 'సహజ మార్గము రాజ

హగ సాధన' అన్న వ్యాసంలో ప్రాణాహుతి ద్వారా యోగ సాధనారీతిని, 'భారతీయుల స్వజాతీయత - భారతీయత' అనే వ్యాసంలో జాతీయ భావాలను పెంపొందించుకొనవలసిన ఆవశ్యకతను, 'విశ్వప్రేమకు మూలం తల్లి' అనే వ్యాసంలో తల్లి త్యాగనిరతినీ, పిల్లలను పెంచే తీరును గురించి వ్రాశారు. 'భగవద్గీత నేటి కాలమునకిచ్చు సందేశము' అనే వ్యాసంలో 'భగవద్గీత సార్వకాలిక సత్యాలను ప్రవచించిన తీరును పేర్కొన్నారు. నన్నయ కవిత్వంలో నాటకీయత' భారతీయత - సామాజిక జీవనము 'సాహిత్యము - శాశ్వత విలువలు' అనే వ్యాసాలు ఉన్నాయి. జిల్లా రచయితల సంఘ సభ్యుల రచనలను గ్రంథ రూపంలో వెలువరించిన సాహితీ సమితి కృషి అభినందనీయం.

వ్యాస విపంచి

[రచన : శ్రీ వట్టిపల్లె సుబ్బరాయుడు. ప్రచురణ : రచన, సాహిత్య వేదిక - కడప. ప్రతులకు, రచన, సాహిత్యవేదిక, 2/194 నాగరాజుపేట, కడప(లేదా)శ్రీ ఎస్. రామయ్య. 1/125-ఇ. సున్నపు రాళ్ళపల్లె, కడప - 2]

శ్రీ వట్టిపల్లె సుబ్బరాయుడు కీ.శే. డా. గడియారం వేంకట శేషశాస్త్రి, డా. పుట్టపర్తి వారి శిష్యులుగ సాహిత్యాభిరుచిని పెంపొందించుకొన్నవారు. నీటిపారుదల, విద్యుచ్ఛక్తి శాఖలో ఉద్యోగం చేస్తూ ప్రాచీన సాహిత్యాధ్యయనం చేస్తూ వివిధ విషయాలపై అప్పుడప్పుడు వ్రాసిన వ్యాసాలను ఈ వ్యాస విపంచిలో వెలువరించారు. రచయిత రెండవ ప్రపంచయుద్ధ కాలంలో దేశంలోని పలుచోట్ల పనిచేశారు. విషయ వైవిధ్యంతో కూడిన వ్యాసాలు ఇదివరకే వివిధ ప్రతికలలో ప్రచురింపబడినవి. సుబ్బరాయుడు గారికి భారతీయ సంస్కృతి పట్లగల విశేష అభిమానం ఈ సంపుటిలోని వేద ప్రాశస్త్యము, భారతీయ సంస్కృతీ స్రవంతి, భారతనారి, కర్మజ్ఞాన, భక్తి వైరాగ్యము, ఓంకార ప్రాశస్త్యము అన్న వ్యాసాలలో స్పష్టమవుతుంది. అంబరీషుడు అన్న వ్యాసంలో విష్ణువుయొక్క అవతార రహస్యం చక్కగా నిరూపించబడింది. సంస్కృత ప్రాభవము నేటి శాస్త్ర విజ్ఞానము, నైతిక ప్రమాణములు, పురుషార్థములు, లోకపు పోకడ, మద్యపానము, అన్న వ్యాసాలు విషయ వైవిధ్యముతో రచయిత అధ్యయనాసక్తిని తెలుపుతున్నాయి. సరళ గ్రాంథికంలో రచింపబడిన ఈ వ్యాసాలు సుప్రసిద్ధులైన డా. దివకర్ల వేంకటావధాని, డా. పుట్టపర్తి, డా. అమరేశం రాజేశ్వరశర్మ, కరుణశ్రీ, డా. తుమ్మపూడి కోటేశ్వరరావు, డా. శలాక రఘునాథశర్మగార్ల ప్రశంసలందుకున్నాయి డా. పుట్టపర్తిగారు తమ "అభిప్రాయంలో ప్రముఖ తత్వవేత్త శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారన్న 'ఏడునూర్ల సంవత్సరముల ముస్లిం ప్రభుత్వంకాని మూడు నూర్ల సం॥ రాల బ్రిటిష్ ప్రభుత్వంకాని పాడుచేయని భారతీయ సంస్కృతిని మూడున్నర దశాబ్దాలలో కాంగ్రెస్ ప్రభుత్వం పోగొట్టింది' అన్న వాక్యాలను ఉటంకించారు. ఈ సంపుటి ప్రచురణకు ఆం. ప్ర. సాహిత్య అకాడమి ఆర్థిక సహాయం అందజేసింది.

శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

కొమ్మలు చీల్చుకుని వస్తున్నపూలు

[కవిసేన కవితా సంకలనమ్. వెల: రు. 2-50 లు. ప్రతులకు : 1) విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్, విజయవాడ. 2) నవోదయపబ్లిషర్సు, ఏలూరురోడ్డు, విజయవాడ. 3) పి.ఎల్.ఎస్. బుక్‌షాపు, నాంపల్లి స్టేషన్‌రోడ్డు, హైదరాబాదు. 4) ఎ. పి. బుక్ డిస్ట్రిబ్యూటర్సు, రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాద్.]

ఇది కవి సేన కవితా సంకలనం. శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మ నాయకత్వంలో ఈ కవిసేన ఉద్భవించింది. శేషేంద్ర శర్మగారు తెలుగు దేశంలోని వర్తమాన కవుల్లో ఒకరు. వీరిని ఆదర్శంగా తీసికొని కొందరు కవులు కవిత్వాన్నిరాశారు. అంచేత శేషేంద్ర శర్మగారు 'యుగకవి' అయ్యారని కొంతమంది భావన. ఈ కవితా సంకలనానికి జువ్వాడి గౌతమరావుగారు పెద్ద పరిచయం రాశారు. 'బాహోచ్ఛిష్ట మిదమ్ జగత్' అన్నట్లుగా శేషేంద్రశర్మగారి నోట్లోనుంచి ఊడిపడ్డారు గౌతమరావుగారు. వారి అధ్యక్ష వచనంలో శర్మగారి కార్బన్ కాపీ కనబడిందేగాని గౌతమరావుగారి వ్యక్తిత్వం కనబడలేదు. సమీక్షా పరిధిని అధిగమించి ఈ పుస్తకానికి, అంతకంటె దీని పీఠికకు జ్ఞానబోధ చెయ్యవలసిన అవసరం ఏర్పడినందుకు తెలుగు కవితాభిమానులు క్షమింతురు గాక !

ముందర పీఠికా కర్తలు మరొకరి అజ్ఞానంమీద నమ్మకాన్ని విసర్జించడం మంచిది. రావుగారు వారి స్థాయిని అధిగమించి శబ్దాలను దొర్లించడం మాత్రిభవించిన అహంకారానికి నిదర్శనం. "ఒలచీసి నాలుగు ప్రశ్నలు వేస్తే ఒక్కదానికైనా . సమాధానం చెప్పలేని 'విద్యా విహీనులు' మాత్రమే వాళ్ళ సహోదరులైన కొందరు పత్రికాధిపతుల ధర్మమా అని కవిసేన మీద తను మొండి కత్తులు ఝుళిపించే అదృష్టం పొందారు." ఇది గౌతమరావుగారి ఒక అభియోగం. కవిసేన మేనిఫెస్టోరాసిన వారు శేషేంద్ర

శర్మగారు. వారి వైయక్తిక అహంకారం. ఇతర కవుల దూషణ ఏ మేరకు హద్దు మీరిందో తెలుగు పాఠకుల కందరకూ తెలిసిందే. మరొకరిని విద్యావిహీనులు అని పేర్కొనే సంస్కారం వెనుక ఏ సంస్కృతి దాగుందో వేరే చెప్పనక్కరలేదు. కవిసేనను అంగీకరిస్తే సంస్కారవంతుడు; లేకపోతే అక్షరజ్ఞానం లేని వివేక శూన్యుడు. ఇది గౌతమరావుగారి వాదం. కవిసేన మానిఫెస్టోలో దేశానికి కవి నాయకత్వం అత్యంత అవశ్యకమని శేషేంద్రశర్మ గారు నొక్కి చెప్పారు. ఆ నాయకత్వానికి తామే అర్హులమని కూడా అన్యాపదేశంగా చెప్పడం జరిగింది. తనకు ముందున్న కవుల్ని, కవితా ప్రక్రియల్ని ఎంత దారుణంగా దూషించారో కవిసేన మానిఫెస్టో చదివిన వారికి తెలుస్తుంది. "కవిసేన కమిట్మెంటు ఏమిటో కవిసేన తన మానిఫెస్టోలో విపులంగా చర్చించింది. చదవండి. అయినప్పటికీ కవిసేనను విమర్శిస్తున్న వాళ్ల సాహిత్య ముఖ కుక్షింభరులే అనుకోవాలి, వారికి విమర్శలు కేవలం ఆత్మ సంరక్షణార్థం అన్నదీ అందరికీ స్పష్టమే" అని తీర్పు ప్రకటించారు గౌతమరావుగారు. ఈ మాటల్లోనే వారి సాహిత్యగత సంస్కారం అర్థం అవుతోంది గదా! పోగా అ కవిత్వాన్ని రూపు మాపడానికి ఒక ఉద్యమం అవసరమా? అన్నది చర్చ. నిజంగా అ కవిత్వం అయింది, తాత్కాలికంగా ప్రబలమైనా దానంతటదే చస్తుంది. దానిని అంత మొందించడానికి మరొక ఉద్యమం ఆవిర్భవించిందని చెప్పుకొనడం హాస్యాస్పదంకాదా? శూన్యంలో కత్తి త్రిప్పిన వాడు వీరుడవుతాడా?' శబ్ద చమత్కారాలు కవిత్వమని జనాన్ని భ్రమింప జేసే కుహనా మహాకవులమీద ఎగరేసిన ఎర్రజెండా కవిసేన" అంటున్నారు గౌతమరావుగారు. మంచిది వారి నెత్తిమీద వారే జెండా ఎగరేసుకుంటే కాదనేహక్కు ఎవరికుంది?

"కవులకూ శబ్దాలకూ చెదపట్టింది ఈ దేశంలో" "ప్రజల ఎదుర్రొమ్ములమీద ప్రతిష్ఠ చేసిన ఈ శిలా విగ్రహాల్ని పీకెయ్యండి నిలువునా లేచి ఒళ్ళు విరుస్తున్న జ్వాలలో నోళ్ళలో పారెయ్యండి ఈ పాతదేవుళ్ళని" శేషేంద్రశర్మగారి ఉవాచ ఇది. తెలుగు కవిత్వానికి పట్టిన చెదలను దులిపి అసలు సిసలు కవిత్వాన్ని అందిస్తున్న శేషేంద్రశర్మగారి కవితా జ్వాలలో పాత కవులు భస్మం కావలసిందే వారి దృష్టి ప్రకారం, 'నామాటలు ఈ దేశపు మట్టిలో చల్లుతున్నా అన్ని చోట్లా కత్తులు మొలవాలని, నేను జ్వాలల్ని కొరడాలుగా ఝళిపిస్తున్న అగ్నిని. నాజేబుల్లో కోకిలల్లేవు' అని సగర్వంగా చెప్పుకుంటున్నారు శేషేంద్రశర్మగారు.

సర్వశ్రీ శేషేంద్రశర్మ, రావు వెంకట్రావు, అవధానుల తంగిరాల, మురళీధర్, శ్రీరాములు, వనమాలి, మోనా, సాంధ్యశ్రీ, సువర్ల, సమద్, సత్యనారాయణ, అకొండి, రామచంద్రమౌళి, నరసింహం, మల్లెల కవితలు ఇందులో ఉన్నాయి. ఈ కవితలన్నీ శేషేంద్రశర్మ గారి యుగనాయకత్వ సమర్థనకు ఉపస్కారకంగా ఉండటంలో ఆశ్చర్యంలేదు.

"నా కోర్కెల్ని నమ్ముకు చాకుల్లా తగిలించుకు
తిరిగే ప్రజల్ని చూడాల్నుంది". (వనమాలి)

"నేను జలపాతాలు కురిపించేవాణ్ని
విద్యుత్తులు సృష్టించేవాణ్ని
పొలాల పొదుగుల్నించి బంగారు
ధారలు పిండు తాను" (సువర్ల)

"నా వాక్యాలు
రెమ్మల్లో ఆకులై పువ్వులై
పువ్వులై పిట్టూర్పులై
పర్వతాల మీదుగా సముద్రాలమీదుగా
గాలిలో పరుగెత్తుతాయ్" (సువర్ల)

"అరె పుస్తకం జైలు నుంచి
తప్పించుకున్న ఆ పేజీల ఖైదీలు
గాలిపటాలై ఎగురుతున్నాయ్" (మల్లెల)

"నిరాయుధులైన మన సైన్యాలకు
నా చేతులను తుపాకులుగా
దానం చేస్తాను" (సత్యనారాయణ)

ఇట్లు ఉదహరించుకుంటూ పోతే పుస్తకంలో చాలా భాగం ఉదహరించాలి. ఏ సేనలో ఉన్న కవులయినా అంధానుకరణను వదలి స్వంత గొంతును అన్వేషించడం మంచిది.

శ్రీ టి. ఎల్. కాంతారావు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.

BCI

BS



మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA104M179
పుస్తకం పేరు	మిసిమి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	85
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	01 13(1
లేని పేజీలు	NO
తయారు చేసినది	Navya
పేజీలు విడదీసినది	Srinisha
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good